ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY




ఆదివారం 30 ఆగస్టు 2026 | సంపుటి: 28 సంచిక: 140
Sunday 30 August 2026 | Vol.No 28 Issue No .140
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

## 92.86 లక్షల ఓట్ల తొలగింపుపై సమగ్ర పరిశీలన

- సర్ ప్రక్రియ గడువును మరో నాలుగు వారాలు పొడిగించాలి
- కేంద్ర ఎన్నికల సంఘానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ



హైదరాబాద్,ఆగస్ట్29 : ఓటర్ల జాబితా సవరణలో భాగంగా పెద్ద సంఖ్యలో ఓట్ల తొలగింపుపై సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. దాదాపు 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన సమగ్ర పరిశీలన అవసరమని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అభ్యంతరాలు,క్లెయిమ్‌ల గడువు పొడిగించాలని కోరుతూ.. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు.

మిగతా 2లో..

## తెలంగాణ చెరువుల పునరుద్ధరణ అత్యావశ్యకం

- చిన్ననీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయాలి
- సిఎం రేవంత్ రెడ్డికి రైతు కమిషన్ నివేదిక

హైదరాబాద్,ఆగస్ట్29 : తెలంగాణలో చెరువుల పరిరక్షణ, చిన్న నీటిపారుదల వ్యవస్థ బలోపేతం దిశగా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కీలక సూచనలు చేసింది. చిన్న నీటిపారుదల వ్యవస్థను ప్రత్యేకంగా పునరుద్ధరించడంతో పాటు నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే సాంకేతిక విభాగాలను ఏర్పాటు చేయాలని

మిగతా 2లో..



## ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం బాధ్యత

సిఎం రేవంత్‌కు నివేదిక ఇచ్చిన కమిటీ



మిగతా 2లో..

## రాష్ట్రంలో వివాద రహిత భూములన్నింటికీ

# శాశ్వత పరిష్కారం..

- గుడిసె గల ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి గుడిసె లేని తెలంగాణగా మారుస్తాం..
- కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి..
- రాష్ట్ర మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి..





నూతనకల్, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర) రానున్న సంవత్సర కాలంలో రాష్ట్రవ్యాప్తంగా గల వివాదరహిత భూములన్నిటీని (ప్రతి అంగుళాన్ని) సర్వే చేసి భూ ఆసాములకు పట్టాలు చేసి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని మఠ్రి సత్యనారాయణ రెడ్డి మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన సీలింగ్ భూముల రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నూతనకల్, మద్దిరాల మండలాలకు చెందిన రైతులకు దశాబ్దాల తరబడి పెండింగ్ లో ఉన్న 15 గ్రామాలలోని 1061 మంది రైతులకు 1044 ఎకరాలకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. సాగు చేసుకుంటున్న భూములకు ఏళ్ళ తరబడిగా పట్టాలు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని,తద్వారా వివాద రహిత భూములన్నింటికీ పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో తాతలనాటి నుండి వస్తున్న భూ సమస్యలకు భూ భారతి ద్వారా

మిగతా 2లో..

## నియోజకవర్గంలో పల్లెపల్లెకు కార్యక్రమం

- పలు గ్రామాల్లో పర్యటించిన మంత్రి పొన్నం
- గ్రామాల్లో సమస్యలపై నేరుగా తెలుసుకున్న మంత్రి
- అక్కడిక్కడే పలువురు అధికారులకు ఆదేశాలు

మిగతా 2లో..



## 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

- సర్క్యులర్ విడుదల చేసిన కార్యదర్శి



హైదరాబాద్,ఆగస్ట్29 : తెలంగాణ శాసనసభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి ముహూర్తం ఖరారైంది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నట్లు అసెంబ్లీ

మిగతా 2లో..

## సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తం కండి

- కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకదృష్టి
- అధికారులతో సమీక్షలో మంత్రి దామోదర ఆదేశాలు

హైదరాబాద్,ఆగస్ట్29 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తగా ఉంటే విజృంభిస్తాయని మంత్రి దామోదర్ రాజనర్సింహ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన

మిగతా 2లో..



## భవిష్యత్ పోరాటాలపై బిజెపి కసరత్తు

- 22ఎ భూములపై త్వరలోనే కార్యాచరణ
- పార్టీ నేతలతో బిజెపి చీఫ్ రామ్ సమీక్ష



హైదరాబాద్,ఆగస్ట్29 : తెలంగాణలో తమ పార్టీని బలోపేతం చేసే దిశగా బీజేపీ కసరత్తులు చేస్తోంది. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు తమ గొంతుకను వినిపిస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ చీఫ్ రాంచందర్ రావు అధ్యక్షతన ఫీజు బకాయిల చెల్లింపు కోసం ఇటీవల దీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. మరో రెండు పోరాటాలకు బీజేపీ నాయకులు సన్నద్ధమవుతున్నారు. 22-ఏలో చేర్చిన భూమి సంబంధించిన బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల 5,6 తేదీల్లో టీబీజేపీ నేతలు మరో దీక్ష నిర్వహించనున్నారు. ఈ

మిగతా 2లో..

## ఉత్తరాఖండ్ 'శుద్ధీకరణ' ఘటనపై కఠిన చర్యలు

- వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు
- బిజెపి తీరుపై మండిపడ్డ రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,ఆగస్ట్29 : ఉత్తరాఖండ్ 'శుద్ధీకరణ' ఘటనను లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. భారతీయ జనతాపార్టీ, ఆర్ఎస్ఎస్‌లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. భారతదేశంలో అస్పృశ్యతను చట్టబద్ధంగా నిషేధించారని, మల్లికార్జున ఖర్గే దళితుడనే కారణంతో ఇలా మైదానాన్ని శుద్ధి చేయడం ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం తీవ్రమైన నేరమని రాహుల్ పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలోని

మిగతా 2లో..



## ప్రధాని మరోమారు విదేశీ పర్యటన

ఉజ్బెకిస్తాన్, కిర్గిజ్‌లలో పర్యటించనున్న మోడీ



న్యూఢిల్లీ,ఆగస్ట్29 : ప్రధాని నరేంద్ర మోదీ మరో విదేశీ పర్యటనకు సిద్దం అయ్యారు. రెండు దేశాల విదేశీ పర్యటనకు బయలుదేరనున్నారు. ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడు షవ్‌కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు ఆగస్టు 29, 30 తేదీల్లో ప్రధాని మోదీ ఉజ్బెకిస్తాన్‌లో ద్వైపాక్షిక పర్యటన చేయనున్నారు. తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపై కీలక చర్చలు జరగనున్నాయి. ఉజ్బెకిస్తాన్‌లో ప్రధాని మోదీకి ఇది నాలుగో పర్యటన కానుంది. ఈ పర్యటనలో భారత్, ఉజ్బెకిస్తాన్ వ్యూహాత్మక భాగస్వామ్యంతో పాటు.. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగాల్లో పరస్పర సహకారంపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. అలాగే

మిగతా 2లో..

# అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చాం

- సంజీవని యాప్ ఓ గేమ్ ఛేంజర్
- మన ఆరోగ్యం ..మన ఫోన్‌లోనే
- గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ప్రభుత్వానిదే
- గిరిజన ప్రాంతాల్లో సెల్ టవర్ ద్వారా కనెక్టివిటీ పెంచుతాం
- గిరిజన ప్రాంత ఉద్యోగాలు గిరిజనులకే అందేలా చేస్తాం
- అరకు పర్యటనలో సిఎం చంద్రబాబు




పాడేరు,ఆగస్ట్29 : ఏజెన్సీ ప్రాంతానికి వస్తే కొత్త శక్తి, ఉత్సాహం వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అల్లూరు జిల్లా అరకులోయ మండలం గన్నెలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చామన్నారు. ఆ రోజుల్లోనే ఆయుర్వేద వైద్యం గిరిజనులకు అందించిన వ్యక్తి అల్లూరి సీతారామ రాజు. ఆయన సేవలకు గుర్తుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు ఆయన పేరు పెట్టాం. సంజీవని యాప్ ఓ గేమ్ ఛేంజర్. మీకు అనారోగ్యం వస్తే విశాఖ, పాడేరు వెళ్లాల్సి వచ్చేది. మీ ఆరోగ్యం మీ ఫోన్‌లో ఉంది. ఎక్కడికి వెళ్లినా మీ ఆరోగ్యం ఫోన్‌లో చెక్ చేసుకోవచ్చు. ప్రతి ఒక్క గిరిజన బిడ్డకు మెరుగైన ఆరోగ్యం ఇవ్వాలని సంకల్పించాం. గిరిజనుల ఆరోగ్యం కాపాడే బాధ్యత ఈ ప్రభుత్వానిది. ఏజెన్సీ ఏరియాలో మరికొన్ని సెల్‌టవర్లు పెట్టించి కనెక్టివిటీ పెంచుతాం. గిరిజనుల ప్రతి ఒక్క సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తాం. 3 నెలల్లో ఇక్కడ ఉన్న అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మెరుగుపరుస్తాం. ఏ వైద్య పరీక్ష అయినా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేలా ఏర్పాట్లు చేస్తాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే. గిరిజనులకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తున్నాం.. దీంతో నేను సంతృప్తి చెందడం లేదు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఉద్యోగాలన్నీ గిరిజనులకే దక్కాలనేది ఈ ప్రభుత్వ విధానం. అందరికీ ఆమోదయోగ్యమైన జీవోను మళ్లీ తీసుకువస్తామని హామీ ఇస్తున్నా. వీలైనంత త్వరగా అన్ని గ్రామాలకు రోడ్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. అరకు కాఫీకి ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చాం. ఏజెన్సీ ప్రజలకు ఆదాయం అరకు కాఫీ, మిరియాల నుంచి వస్తోంది' అని సీఎం తెలిపారు. గన్నెల పంచాయతీ ఆర్.కె.నగర్‌లో ప్రజలతో

మిగతా 2లో..

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా

- ఘనంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు
- గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా కార్యక్రమాలు..
- పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి



హైదరాబాద్,ఆగస్ట్29 : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత హాకీ దిగ్గజం, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, సోనిబాలదేవి, హాకీ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్, క్రీడా శాఖ అధికారులు, హాకీ క్రీడాకారులు

మిగతా 2లో..

## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

- బ్యాండ్ అంబాసిడర్‌గా కపిల్ దేవ్
- మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి



హైదరాబాద్,ఆగస్ట్29 : పర్యాటకం, క్రీడల ప్రచారానికి కపిల్‌దేవ్ సేవలు వినియోగించు కుంటామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ 12వ ఎడిషన్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. శామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో 130 ఎకరాల్లో గోల్ఫ్ కోర్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గోల్ఫ్ క్రీడాకారులను ఆకర్షించేలా మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక, క్రీడా రంగంలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు

మిగతా 2లో..

## 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు

కార్యదర్శి అధికారిక సర్కులర్ జారీ చేశారు. సెప్టెంబర్ 7న ఉదయం 10 గంటల నుంచి సభలు ప్రారంభమవుతాయని పేర్కొంటూ అసెంబ్లీ అధికారులు శాసనసభ సభ్యులతో పాటు శాసన మండలి సభ్యులకు కూడా సమాచారాన్ని అందిస్తూ సర్కులర్‌ను పంపించారు. తెలంగాణలో వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు సెప్టెంబర్‌లోనే నిర్వహిస్తామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గత బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలన, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై సభలో విస్తృతంగా చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అంతేకాకుండా మాజీ సీఎం కేసీఆర్ కూడా అసెంబ్లీకి వచ్చి ఈ చర్చలో పాల్గొనాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులు తదితర అంశాలను లోతుగా చర్చించే అవకాశం ఉంది. రాష్ట్రంలో ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాలు, రగులుతున్న సామాజిక అంశాల నేపథ్యంలో సెప్టెంబర్ 7 నుంచి ప్రారంభమయ్యే ఈ అసెంబ్లీ సమావేశాలు రాష్ట్ర రాజకీయాల్లోనే అత్యంత కీలకంగా మారనున్నాయి.

## సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తం కండి

అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో సీజన్ వ్యాధుల పరిస్థితిపై ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. గతేడాదితో పోలిస్తే డయేరియా, డిసెంట్రీ కేసులు కూడా తక్కువగా నమోదు అయినట్లు తెలిపారు. టైఫాయిడ్ కేసులు స్వల్పంగా పెరిగాయన్నారు. కేసులు పెరుగుతున్న జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ఫీవర్ సర్వేలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి జ్వరం కేసును పర్యవేక్షించి.. అవసరమైన పరీక్షలు, చికిత్స అందించాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ హాస్పిటళ్లలో మందులు, టెస్టింగ్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఐఎల్ఐ, స్వైన్‌ఫ్లూ కేసులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఐఎల్ఐ కేసులపై రోజువారీగా పర్యవేక్షించాలని రాజనర్సింహ తెలిపారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో సీజనల్ ఇన్‌ఫ్లూయెంజా పూర్తిగా నియంత్రణలోనే ఉందని మంత్రికి అధికారులు వివరించారు. దోమల నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నిల్వ నీటి తొలగింపు, లార్వా నిర్మూలన, ఫాగింగ్ కొనసాగించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణెళి ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని స్పష్టం చేశారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స కంటే.. ముందస్తు నివారణెళి లక్ష్యమన్నారు. ప్రతి జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. సీజనల్ వ్యాధుల కేసులను ఏమాత్రం తేలికగా తీసుకోవద్దని మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు.

## భవిష్యత్ పోరాటాలపై బిజెపి కసరత్తు

నేపథ్యంలో శనివారం రాంచందర్ రావు అధ్యక్షతన సమావేశం జరగనుంది. ఈ భేటీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో 22-ఏ వ్యవహారంపై చేసే దీక్షపై సుదీర్ఘంగా చర్చ జరగనున్నట్లు సమాచారం. దీక్షకు సంబంధించిన కార్యాచరణపై రాంచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో పార్టీ బలబలాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. పార్టీని బలోపేతం చేసే దిశలో భవిష్యత్తు కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం బీజేపీ తదుపరి కార్యాచరణపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు క్లారిటీ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మొన్న ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి అసెంబ్లీ వరకు రైతుయాత్ర చేపట్టేందుకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ సిద్ధమవుతున్నారు.

## ఉత్తరాఖండ్ 'శుద్ధీకరణ' ఘటనపై కఠిన చర్యలు

ఇందిరా భవన్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'శుద్ధీకరణ' సమాజంలో ఇంకా బతికే ఉన్న అంటరానితనానికి మరో పేరని ఆయన వ్యాఖ్యానించారు. శుద్ధీకరణ పూజను నిర్వహించిన వారిపై, దీనికి మద్దతు ఇచ్చిన ఉత్తరాఖండ్ స్థానిక బీజేపీ నేతలపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులు సమాజంలో ఎదగడం, గౌరవంగా బతకడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదని, ఈ ఘటన వారి కులవివక్ష భావజాలాన్ని స్పష్టం చేస్తోందని మండిపడ్డారు. ఆగస్టు 8వ తేదీన హల్ద్వానీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. ఖర్గే ర్యాలీ ముగిసిన రెండు రోజుల తర్వాత 'శ్రీరామ్ సేన' అనే స్థానిక సంస్థ ఆ మైదానంలో గంగాజలం చల్లి, హవనం (పూజ) నిర్వహించి మైదానాన్ని 'శుద్ధి' చేసింది. దీంతో వివాదం మొదలైంది.

## ప్రధాని మరోమారు విదేశీ పర్యటన

డిజిటల్ కనెక్టివిటీ, ఇంధనం, విద్య తదితర రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించే అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి.భారత్ 'వికసిత్ భారత్ 2047' అభివృద్ధి దార్శనికతతో పాటు ఉజ్బెకిస్తాన్ 'ఉజ్బెకిస్తాన్-2030' అభివృద్ధి ప్రణాళికలపై కూడా ఇరు దేశాల మధ్య అభిప్రాయాల మార్పిడి జరగనుంది. భవిష్యత్‌లో ఆర్థిక, సాంకేతిక, మౌలిక వసతుల రంగాల్లో పరస్పర సహకారాన్ని పెంచుకునే అవకాశాలను పరిశీలించనున్నారు. తాష్కెంట్‌లో ప్రధాని మోదీ పలు ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి మెమోరియల్‌ను సందర్శించడంతో పాటు తాష్కెంట్ స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ ఓరియంటల్ స్టడీస్‌లోని మహాత్మా గాంధీ విగ్రహాన్ని కూడా సందర్శించనున్నారు. ఉజ్బెకిస్తాన్ పర్యటన అనంతరం ప్రధాని మోదీ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 1 వరకు కిర్గిజ్ రిపబ్లిక్‌లో పర్యటించనున్నారు. కిర్గిజ్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ బిష్కెక్‌కు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో భాగంగా 26వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారు. ఎస్‌సీఓ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. 2017 నుంచి భారత్ ఎస్‌సీఓలో పూర్తి సభ్యదేశంగా కొనసాగుతోంది. ఎస్‌సీఓ సమావేశంలో భద్రత, అనుసంధానం, ప్రాంతీయ సహకారం, అభివృద్ధి అవకాశాలపై భారత ప్రాధాన్యతలను ప్రధాని మోదీ ప్రస్తావించనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీఓ సభ్యదేశాల నేతలతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అలాగే కిర్గిజ్ రిపబ్లిక్‌లో జరిగే 6వ వరల్డ్ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కూడా ప్రధాని మోదీ హాజరుకానున్నారు. మధ్య ఆసియా సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే ఈ క్రీడలు ప్రాంతీయ సాంస్కృతిక సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా

తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి మంత్రి వాకిటి శ్రీహరి, చైర్మన్ శివసేన రెడ్డి, సోనిబాలదేవి, హాకీ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్, అధికారులు, క్రీడాకారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం తెలంగాణ హాకీ లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. భారతీయ క్రీడాస్ఫూర్తి ప్రపంచానికి చాటిన గొప్ప క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ అని కొనియాడారు. ధ్యాన్‌చంద్ తన అద్భుతమైన ఆటతీరు, క్రమశిక్షణ, ఏకాగ్రతతో భారత హాకీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. ఆయన జీవితం ప్రతి క్రీడాకారుడికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆటలపై మక్కువ, ఏకాగ్రత, క్రమశిక్షణ ఉంటే విజయాన్ని సాధించవచ్చని మంత్రి అన్నారు. ప్రస్తుత తరం యువత సోషల్ మీడియా రీల్స్‌పై కాకుండా తమ భవిష్యత్తు కోసం క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. రీల్స్ కోసం కాకుండా.. రియల్ లైఫ్ కోసం ఆటలు ఆడదని మంత్రి యువ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో? తెలంగాణను క్రీడారంగంలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. క్రీడాకారులకు మెరుగైన మౌలిక వసతులు, శిక్షణ, ప్రోత్సాహం అందిస్తూ తెలంగాణను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో వివాద రహిత భూములన్నింటికీ శాశ్వత పరిష్కారం..

పరిష్కారం చేస్తున్నామన్నారు.భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రతి అంగుళం భూమిని అధికారులు సర్వే చేసి నిజమైన ఆసాములకు హక్కు పత్రాలు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో మొదటి విడతగా 70 గ్రామాలను ఎంపిక చేసుకొని సర్వే చేయించడం జరిగిందన్నారు.రాష్ట్రంలో పలుచోట్ల రెవెన్యూ, దేవాదాయ,అసైన్డ్ భూములు కబ్జాకు గురవుతుండడం తమ దృష్టికి వచ్చిందని,వీటిని అరికట్టేందుకు తాము కఠిన చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రానున్న సంవత్సరకాలంలో ప్రతి అంగుళాన్ని సర్వే చేస్తామని, వివాదరహిత భూములన్నింటికీ పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తామని పేర్కొన్నారు.పంచాయతీలేని భూములకు, భూములున్న ఆసాములు అందరికీ పట్టాలిస్తామన్నారు.గత ప్రభుత్వం 8 లక్షల 21 వేల కోట్ల అప్పును తమ ప్రభుత్వం పై మోపినప్పటికీ తల తాకట్టు పెట్టైనా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆపకూడదన్నదే తమ ఉద్దేశమని, సంక్షేమ కార్యక్రమాలు కుంటు పడకుండా తమ ప్రభుత్వం అమలు చేస్తున్నదని, అందులో భాగంగానే రైతులకు న్యాయం చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఎలాంటి పట్టాలు ఇవ్వలేదని,ఇప్పుడు మునిలి కన్నీరు కారుస్తున్నదని అన్నారు.గడచిన రెండున్నర సంవత్సరాలలో రాష్ట్రంలో మహిళలకు 63 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని,రానున్న రెండున్నర ఏళ్లలో అంతే రుణాలు ఇస్తామని,200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం,రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఘనత తమదేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకానికి జనం బ్రహ్మ రథం పడుతున్నారని,హైదరాబాద్ లో కోట్ల రూపాయల విలువచేసే భూములలో ఇందిరమ్మ టవర్స్ నిర్మించి ఇస్తామని తెలిపారు.రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి మొదటి విడత,3500,రెండో విడత 2000 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చామని,మూడవ,నాలుగవ విడతలలోను ఇండ్లు ఇస్తామని,ప్రతి నియోజకవర్గంలో అర్హులైన పేదవారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాల రైతుల సమస్యలకు పరిష్కారం పట్టాలు ఇవ్వడమని అన్నారు. భూమికి హక్కు ఉంటే రైతుకు ధైర్యం ఉంటుందని, రైతులకు రైతు భరోసా, రైతుబంధు, రైతు భీమా ఇతర లబ్ధి చేకూరుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు దేశంలో,ఏ రాష్ట్రంలో లేని విధంగా 5 లక్షల రూపాయలు ఇచ్చిన దాఖలాలు లేవని, రాష్ట్రవ్యాప్తంగా 36వేల కోట్ల రూపాయలతో హ్యాం రోడ్లను నిర్మిస్తున్నామని, తుంగతుర్తి నియోజకవర్గానికి 100 కోట్ల రూపాయలతో రోడ్లు మంజూరు చేయడం జరిగిందని,మరో 200 కోట్ల రూపాయల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. ప్రజలకు సన్నబియ్యం,రైతు భరోసా,రైతుబంధు ఇస్తున్నామని,ఇందిరమ్మ ఇండ్లను ఎట్టి పరిస్థితులలో ఆపమని, గుడిసెగల ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి గుడిసెలేని తెలంగాణ గా మారుస్తామని అన్నారు. భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజాపాలన అని,గత కొన్ని సంవత్సరాలుగా పరిష్కారం కాని రైతుల సమస్యలను పట్టాల పంపిణీతో ఇప్పుడు పరిష్కారం అయ్యాయని, తమ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత బస్సు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, ప్రజలు వీటన్నిటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ మాట్లాడుతూ పోలాలను సాగు చేసుకుంటున్న రైతులకు హక్కులు లేనందువల్ల ఎన్నో బాధలకు గురయ్యారని, అలాంటి 60 సంవత్సరాల సమస్య తీర్చినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రెవెన్యూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.పట్టాల పంపిణీతో రైతులు వారి భూములకు హక్కుదారులు అయ్యారని, గతంలో కేంద్రంలో ఉన్న తమ ప్రభుత్వం 25 లక్షల ఎకరాల భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత తమకే దక్కిందని, రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా హక్కు పత్రాలు ఇవ్వడం జరిగిందని, భూమి అనేది రైతుకు ఆత్మ గౌరవం అని ,భూమి హక్కు లేకుంటే గుర్తింపు ఉండదని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో పెండింగ్లో ఉన్న రోడ్లను మంజూరు చేయాలని, తుంగతుర్తి నియోజకవర్గానికి అదనంగా ఇండ్లు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ దేశంలో సీలింగ్ చట్టం వచ్చిన తర్వాత అంతకుముందు ఉన్న వివిధ కారణాలవల్ల పట్టాలు రాని వారు రైతుబంధు, రైతు బీమా, రైతు భరోసా, రుణాలు, విత్తనాలు వంటివి రాక అనేక ఇబ్బందులు పడ్డారని, వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని వీటి పరిష్కారానికై రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, ఇందులో భాగంగా నూతనకల్,మద్దిరాల మండలాలలోని 15 గ్రామాలలో గల 3000 ఎకరాలకు పైగా భూములన్ని సర్వే చేసి పరిశీలించి రైతుల పొలాల వద్దకు వెళ్లి వారికి నోటీసులు ఇచ్చిన పిదప ముసాయిదా అర్హుల జాబితాను ప్రకటించడం జరిగిందని,సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వడం జరుగుతున్నదని ,ఈ రెండు మండలాలలో 1060 మంది రైతులకు 1044 ఎకరాలకు పట్టాల పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.వీటితోపాటు భూభారతి కింద రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇస్తున్నామని, ఖాతాలు లేని వారికి కూడా కొత్తగా ఖాతాలు ఇస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ,సిసి ఎల్ ఏ సెక్రటరీ లోకేష్ కుమార్,ల్యాండ్ సర్వేస్ సెటిల్మెంట్ కమిషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అడిషనల్ కలెక్టర్ హరి సింగ్ రెవెన్యూ ,ఆర్డీవో వేణుమాధవ్, తహసీల్దార్లు శ్రీనివాసరావు,తాబిత, మండల స్పెషల్ ఆఫీసర్ ఎంపి భారతి, ఎంపీడీవో సునీత, రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్,మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్ పర్సన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి,రాష్ట్ర నాయకులు జెన్నారెడ్డి వివేక్ రెడ్డి,మండల అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి,వివిధ మండలాల ప్రజాప్రతినిధులు,అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో పల్లెపల్లెకు కార్యక్రమం

సిద్దిపేట,ఆగస్ట్29 : పల్లె పల్లెకు పొన్నం అన్న,పల్లె పల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది. దండేపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనం, వీఓ భవనాలు, అంతర్గత సీసీ రోడ్లు, పలు ప్రధాన రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరిగింది. పెండింగ్‌లో ఉన్న కాలువ, మంచినీటి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. లబ్ధిదారులు ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, నీటి సంరక్షణ ప్రతి ఇంటి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించడం జరిగింది. ఉపాధి-రఘుపత్య పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు యువత క్రీడల వైపు దృష్టి సారించేలా క్రీడా సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దండేపల్లిలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయనున్నాం. ఉపాధి-రజల సమస్యలను స్వయంగా విని, అధికారులతో అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే ప్రజా పాలన లక్ష్యం. దండేపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు. ఇకపోతే సూరారం గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యత.. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని అన్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో 'పల్లె పల్లెకు పొన్నం అన్న - పల్లె పల్లెలో ప్రజా పాలన' కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసు కోవడం జరిగింది. ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించడం జరిగింది. గ్రామ పాలనలో సూరారం గ్రామానికి 26 ఇందిరమ్మ ఇళ్లు, 475 పెన్షన్లు, 665 కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 158 కొత్త రేషన్ కార్డులు, రైతు రుణమాఫీ, రైతు భరోసా, కళ్యాణలక్ష్మి తదితర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరడం జరిగింది. సూరారం ప్రజల విజ్ఞప్తి మేరకు హుజూరాబాద్-హనుమకొండ మధ్య సూరారం మీదుగా ఆర్టీసీ బస్సు నడిపించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. సూరారం-పోచాద్ పల్లి మధ్య బ్రిడ్జి, రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. గ్రామంలో ఇప్పటికే సుమారు రూ.60 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. మిగిలిన పనులను కూడా దశలవారీగా పూర్తి చేస్తాం. లబ్ధిదారులు ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని, ప్రజలు ఇంకుడు గుంతలు నిర్మించుకుని భూగర్భ జలాల పరిరక్షణకు సహకరించాలని సూచించడం జరిగింది. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు 1,200 స్టీల్ బ్యాంక్ కిట్లు అందించడం జరిగింది. యువత క్రీడల వైపు దృష్టి సారించేలా సూరారం గ్రామంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నాం. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందేలా ప్రక్రియ కొనసాగుతోంది. ఎలాంటి పైరవీలు అవసరం లేదని స్పష్టం చేయడం జరిగింది. అర్హత కలిగిన ఒక్క ఓటు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించడం జరిగింది. ఓటర్ల జాబితాలో తప్పులు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని కోరడం జరిగింది. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను అని తెలియజేయడం జరిగింది.

## అరకు కాఫీకి ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చాం

ముఖాముఖి నిర్వహించిన సీఎం చంద్రబాబు.. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. గిరిజనులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 మంది జనాభా ఉందగా.. ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని, అందుకు గల విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ తన కుమార్తె నీట్ శిక్షణలో ఉందని తెలపగా.. శెభాష్ అన్న ముఖ్యమంత్రి.. అందరూ ఆమె స్ఫూర్తితో పిల్లలని చదివించాలన్నారు. మహిళలతో మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేస్తున్నారు.. ఏం చేయబోతున్నారు? అని ప్రశ్నించారు. అందరి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని పథకాలు మీ వరకు చేరుతున్నాయా అని ఆరా తీశారు. చంద్రబాబు రాకను పురస్కరించుకొని ఆర్.కె.నగర్ మహిళలు, చిన్నారులు థింసా నృత్యంతో స్వాగతం పలికారు. రాష్ట్రంలో ప్రతీ ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ దిశగా సంజీవని వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కనెక్టివిటీ పెంచేందుకు కూడా మారుమూల ప్రాంతాల్లో సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పిల్లలు భారం కాదని.. పిల్లలే మన సంపద అని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందాలని సూచించారు. యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహించి ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. కొండ ప్రాంతాల్లో వారికి వైద్య సేవల కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సిన పరిస్థితి ఉండకూడదనేదే తన సంకల్పమని ఉద్ఘాటించారు. దీని కోసమే సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటికే కుప్పం నియోజకవర్గంలో, చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. సంజీవని కార్యక్రమం రాష్ట్రంలోనూ, దేశంలోనూ ఓ గేమ్ చేంజర్‌గా మారుతుందని ఉద్ఘాటించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి రోగుల రక్త నమూనాలను పెద్ద ఆస్పత్రికి డ్రోన్ల ద్వారా తరలించి పరీక్ష చేసి చికిత్స అందించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా గర్భిణులకు వైద్యసేవలందించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. 104 వాహనాల ద్వారా సంచార వాహనాల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. గిరిజనులతో పాటు రాష్ట్రంలో ప్రతీ పౌరుడి ఆరోగ్యాన్ని పరిరక్షించేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏ కుటుంబమూ పేదరికంలో ఉండకూడదన్నదే తమ ఆలోచన అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'గిరిజన ప్రాంతాల్లో ఉద్యోగాలన్నీ స్థానికులకే దక్కేలా జీఓ నంబర్- 3 మేమే తీసుకువచ్చాం. గత పాలకులు నిర్లక్ష్యంతో సుప్రీంకోర్టు దానిని రద్దు చేసింది. ఈ అంశంపై అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయాన్ని త్వరలోనే తీసుకువస్తాం. ఐదు సూత్రాలతో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు చేశాం. అడవితల్లి బాట పేరుతో రూ.1000 కోట్లతో 900 కిలోమీటర్ల రహదారులు వేశాం. 1.60 లక్షల ఇళ్లకు కుళాయి ద్వారా నీరు, సోలార్ రూఫ్ టాప్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. గిరిజన ప్రాంతాల్లో ఉపాధి పెరిగేలా అరకు కాఫీని మరో లక్ష ఎకరాల్లో సాగు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. అరకు ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగింది. హోమ్ స్టే ద్వారా ఆతిథ్యం ఇస్తే గిరిజన కుటుంబాలకు ఆదాయం వస్తుంది. మన ప్రాంతానికి వచ్చే పరిశ్రమల్లో గిరిజన యువత ఉద్యోగాలు సాధించేలా నైపుణ్యాభివృద్ధి కల్పిస్తాం' అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. వచ్చే మార్చిలోగా లక్ష మంది యువతకు నైపుణ్య శిక్షణ కల్పించాలన్నదే తమ ఆలోచన అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'అత్యవసర వైద్య సేవలను అందించేందుకు జిల్లాలో 150 వాహనాలతో ఎమర్జెన్సీ లైఫ్‌లైన్ నెట్‌వర్క్ ఉంది. కొండ ఎంత దూరంలో ఉన్నా... వైద్యం మీ దగ్గరకు రావాలి. మంచి వైద్యం అందాలి. ప్రతి గిరిజన బిడ్డ అందరిలా ఆరోగ్యంగా ఎదగాలి.. అందుకే సంజీవని తీసుకువచ్చాం. గిరిజన ప్రాంతాల్లో ప్రతి కుటుంబం జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. అదే నిజమైన అభివృద్ధి. గిరిజన ప్రాంతాలకు మంచి వైద్య సేవలు అందేలా రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కన్సాలిడేషన్ మిషన్ తెస్తున్నాం. సికిల్ సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10,000 పెన్షన్ అందిస్తున్నాం. గిరిజన బిడ్డలు దేశంలోని అత్యుత్తమ విద్యాసంస్థల్లో చదవాలి. అందుకే ఎఐఐఎంఎస్ మద్రాస్‌తో ఒప్పందం చేసుకున్నాం. ఎఐఐఎంఎస్, జెఇఇ వంటి పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నాం. గిరిజన రైతులు తమ ఉత్పత్తితో ప్రపంచ స్థాయి బ్రాండ్ సృష్టించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గన్నెల పంచాయతీ ఆర్కే(రామకృష్ణ) నగర్‌లో ప్రజలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలు, ఇతర అంశాలపై మాట్లాడుతూ మొత్తం 16 మందితో సీఎం మాట్లాడారు. గర్భిణులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ గ్రామంలో 47 ఇళ్లు, 189 జనాభా ఉండగా.. ఇక్కడ పాపులేషన్ మేనేజ్‌మెంట్ బాగుందని.. దానికి గల విధానాలను అడిగి తెలుసుకున్నారు.

## గోల్ఫ్ టూరిజం హబ్‌గా తెలంగాణ

వేస్తోంది. అందులో భాగంగా క్రీడలు, పర్యాటక రంగాలు రెండింటినీ మిళితం చేస్తూ తెలంగాణను 'గోల్ఫ్ టూరిజం హబ్‌'గా తీర్చిదిద్దేందుకు సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. రాష్ట్ర పర్యాటక , సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైదరాబాద్ శివారు ప్రాంతమైన షామీర్‌పేట సమీపంలోని జవహర్‌నగర్‌లో దాదాపు 130 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ గోల్ఫ్ కోర్సును నిర్మించనున్నారు. దేశ విదేశాల నుంచి వచ్చే క్రీడాకారులను, పర్యాటకులను ఆకట్టుకునేలా దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో రూపకల్పన చేయనున్నారు. దీంతోపాటు, ప్రకృతి అందాలకు నిలయమైన నాగర్‌కర్నూల్ జిల్లాలోని సోమశిల వద్ద మరో ప్రపంచస్థాయి గోల్ఫ్ కోర్సును అభివృద్ధి చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో ఈ రెండింటిని నిర్మించి, పర్యాటకులకు ఉన్నత స్థాయి వసతులను కల్పించనున్నారు. భారీ ప్రాజెక్టులతో పాటు తెలంగాణ పర్యాటక , క్రీడారంగాలను ప్రపంచస్థాయిలో ప్రచారం చేసేందుకు ప్రముఖ భారతీయ క్రికెట్ దిగ్గజం, గోల్ఫ్ క్రీడాభిమాని కపిల్ దేవ్ సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆయనకున్న ప్రపంచవ్యాప్త గుర్తింపు ద్వారా విదేశీ పర్యాటకులను, పెట్టుబడిదారులను తెలంగాణ వైపు ఆకర్షించడమే ఈ నిర్ణయం ముఖ్య ఉద్దేశం. ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి కేవలం పర్యాటక ఆదాయం మాత్రమే కాకుండా, స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విదేశీ పర్యాటకుల రాకతో హోటల్, రవాణా రంగాలకు కూడా మహర్దశ పడుతుంది. ప్రకృతి సౌందర్యం, ఆధునిక క్రీడా వసతుల మేళవింపుతో తెలంగాణను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.

## 92.86 లక్షల ఓట్ల తొలగింపుపై సమగ్ర పరిశీలన

అక్టోబర్ 19తో గడువు ముగుస్తున్నందున మరో 4 వారాలు పెంచాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సమీప భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికలు లేనందున గడువు పెంచాలని కోరారు. 'సర్'కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని తెలిపారు. ఓటర్ల పరిశీలనలో అనేక లోపాలు ఉన్నాయని, ఇళ్లు మారితే నోటీసు ఇవ్వకుండా ఓట్లు తొలగించవద్దని కోరారు. గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటర్ జాబితాను కనీసం రెండుసార్లు చదివి వినిపించాలన్నారు. నోటీసులకు సమాధానం ఇచ్చేందుకు 4 వారాల గడువు ఇవ్వాలన్నారు. పట్టణాల్లో పోలింగ్ కేంద్రాల వారీగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని, మండలస్థాయి అధికారులు ఇచ్చే డాక్యుమెంట్‌ను ఆమోదించాలని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో అదనపు ఈఆర్‌ఓలను నియమించాలని కోరారు. ఓటర్ల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించేందుకు ప్రస్తుతం ఉన్న గడువు సరిపోదని పేర్కొన్నారు. గడువును మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని కోరారు. వలస కూలీలు, రోజువారీ కూలీలు.. తమ ఓటు హక్కు వివరాలను పరిశీలించుకునేందుకు, అవసరమైన పత్రాలను సమర్పించేందుకు అదనపు సమయం ఇవ్వాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉన్నందున అదనపు సిబ్బంది అవసరమని సూచించారు. ఈ మూడు ప్రాంతాల్లో అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను నియమించాలని కోరారు. ఎసీఐ ప్రక్రియను వికేంద్రీకరించాలని సీఈసీకి రాసిన లేఖలో రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ చెరువుల పునరుద్ధరణ అత్యావశ్యకం

సూచించింది. చిన్న, పెద్ద నీటిపారుదల వనరులను సమన్వయం చేస్తూ కమాండ్ ఏరియా ఆధారిత నిర్వహణ వ్యవస్థను తీసుకురావాలని సిఫారసు చేసింది. చిన్న నీటిపారుదల రూపొందించిన నివేదికను కమిషన్ ప్రతినిధి బృందం శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పించింది. ఈ సందర్భంగా రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, గంగాధర్, ఎం. భవానీరెడ్డి పాల్గొన్నారు. తెలంగాణలో నీటి భద్రత, వ్యవసాయ రంగ స్థిరీకరణ, గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధికి చెరువుల పునరుద్ధరణ అత్యంత అవసరమని కమిషన్ తన నివేదికలో పేర్కొంది. చెరువుల పరిరక్షణ కోసం ప్రత్యేక చిన్న నీటిపారుదల చట్టాన్ని రూపొందించాలని సూచించింది. చెరువుల పూర్తి నీటి నిల్వ మట్టం సరిహద్దులను తక్షణమే గుర్తించి, ఆక్రమణలను తొలగించి శాశ్వతంగా పరిరక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నీటిని మరింత సమర్థవంతంగా వినియోగించుకునేలా సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, చిన్న చెరువులు, ఇతర చిన్న నీటి వనరులను పెద్ద నీటిపారుదల వ్యవస్థలతో అనుసంధానించే విధానాన్ని రూపొందించాలని కమిషన్ అభిప్రాయపడింది. ఈ సందర్భంగా గత రెండేళ్లలో కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, వివిధ అంశాలపై ప్రభుత్వానికి అందించిన సూచనలను కమిషన్ బృందం ముఖ్యమంత్రికి వివరించింది. కమిషన్ పనితీరుపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో వ్యవసాయ రంగంలో పంటల మార్పిడిపై మరింత దృష్టి పెట్టాలని, ఉద్యానవన పంటల సాగును పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతుల ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుపైనా కమిషన్ ప్రత్యేకంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. చెరువుల పునరుద్ధరణతో పాటు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే అంశాలపై కూడా కమిషన్ మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు.

## ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం బాధ్యత

హైదరాబాద్,ఆగస్ట్29 : తెలంగాణ ఉద్యమకారుల రుణం తీర్చుకోవడం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రితో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ భేటీ అయింది. కమిటీ సభ్యులు కేశవరావు, కోదండరామ్, రాములునాయక్, మోతె శోభన్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీలతో జరిపిన సంప్రదింపుల వివరాలతో కూడిన నివేదికను సీఎంకు అందజేశారు. ఉద్యమకారుల గుర్తింపు కసరత్తును జాప్యం లేకుండా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. వెబ్‌సైట్ ఏర్పాటు చేసి డిజిటల్ దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇచ్చేందుకు, పింఛన్, హెల్త్‌కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నట్లు కమిటీ వెల్లడించింది.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

సంపాదకీయం

# నేపాల్‌లో సవాల్‌గా సహాయక చర్యలు !



నేపాల్‌ను అతలాకుతలం చేసిన భారీ ఆకస్మిక వరదలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. ఇప్పుడా చిన్న దేశం కోలుకోవడానికి సవత్సరాలు పట్టవచ్చు. ఊళ్లకు ఊళ్లు ధ్వంసం కావడంతో మళ్లీ పునర్నిర్మాణం అతిపెద్ద సమస్యగా మారింది. కేవలం టూరిజం ప్రధాన వనరుగా ఉన్న నేపాల్ ఆర్థికంగా పెద్దగా బలపడడ్ దేశం కాదు. మౌళిక వసతులు అంతంత మాత్రమే. ఈ క్రమంలో తొలుతు బురద తొలగింపు, గల్లంతయిన వారి గుర్తింపు ప్రధాన సమస్యగా మారింది. వరదల కారణంగా మృతుల సంఖ్య 600 దాటగా, మరో 2,500 మందికి పైగా ఆచూకీ లేకుండా పోయారు. దీంతో సహాయక చర్యలకు మరో పెద్ద సమస్య ఎదురైంది. వరదల్లో మరణించిన వారి మృతదేహాలను భద్రపరిచేందుకు దేశంలోని మార్చురీల్లో సరిపడా స్థలం లేకపోవడంతో అధికారులు తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. భారత్, చైనా మధ్య ఉన్న భూపరివేష్టిత దేశమైన నేపాల్‌లోని మార్చురీలన్నింటి కలిపి సామర్థ్యం సుమారు 350 మృతదేహాలు మాత్రమే. అయితే మృతుల సంఖ్య ఇప్పటికే 600 దాటడంతో ఆసుపత్రులు, మార్చురీలు మృతదేహాలను భద్రపరచడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. వరదల తర్వాత కూడా 2,500 మందికి పైగా గల్లంతైనవారు ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. గల్లంతైన వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ బంధువులను గుర్తించే వరకు మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం తాత్కాలిక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. నేపాల్ పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, సహాయక బృందాలు మృతదేహాలను వెలికితీసిన వెంటనే వాటి క్లోజ్‌అప్ ఫొటోలను తీస్తున్నారు. మృతదేహం స్పష్టంగా కనిపించకపోతే ముందుగా శుభ్రం చేసి, అనంతరం బాడీ బ్యాగ్‌కు ప్రత్యేక గుర్తింపు ట్యాగ్‌ను అమర్చుతున్నారు. ఆ తర్వాత వాటిని తాత్కాలిక భద్రపరిచే కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ తాత్కాలిక కేంద్రాల్లో ఉష్ణోగ్రతను సుమారు 0 డిగ్రీల వద్ద ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గల్లంతైన వారి బంధువులు సమాచారం కోసం వచ్చినప్పుడు, ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల ఫొటోలను వారికి చూపిస్తున్నారు. కుటుంబ సభ్యులు తమ బంధువును గుర్తిస్తే, అవసరమైన అధికారిక పక్రియలను పూర్తి చేసిన అనంతరం మృతదేహాన్ని వారికి అప్పగిస్తున్నారు. మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగానే ఈ విధానాన్ని అనుసరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఫింగర్ ప్రింట్, డిఎన్ఏ నమూనాల సేకరణ ముఖం ద్వారా గుర్తింపు సాధ్యం కాని మృతదేహాల విషయంలో పోలీసులు ఇప్పుడు వేలిముద్రలు, ఇతర నమూనాలను సేకరిస్తున్నారు. బంధువులు వెంటనే గుర్తించలేని పరిస్థితుల్లో కూడా భవిష్యత్తులో శాస్త్రీయ పద్ధతుల ద్వారా మృతదేహాల ను గుర్తించేందుకు ఈ నమూనాలు ఉపయోగ పడతాయి. బంధువులు లభించకపోయినా లేదా మృతదేహాన్ని గుర్తించలేకపోయినా వాటిని నిరవధికంగా నిల్వ ఉంచడం సాధ్యం కాదు. అందుకే ముందుగానే వేలిముద్రలు, డిఎన్ఏ నమూనాలు సేకరించి, మార్గదర్శకాల ప్రకారం స్థానిక అధికారుల సహకారంతో మృతదేహాలను ట్యాగ్‌లతో నిర్దేశిత ప్రదేశాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాల నిర్వహణ కోసం నేపాల్‌లో 2021 ప్రత్యేక చట్టం అమల్లో ఉన్నాయి. జిల్లా పోలీస్ చీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిటీలు గుర్తు తెలియని, బంధువులు ఎవరూ కలెయిమ్ చేయని మృతదేహాలను నిర్వహిస్తాయి. అయితే ప్రస్తుతం వరుసగా మృతదేహాలు వస్తుండటంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లా స్థాయి కమిటీలు కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాయి. వరదల్లో గల్లంతైన 2,500 మందికి పైగా వ్యక్తుల కోసం సహాయక బృందాలు తీవ్రంగా గాలిస్తున్నాయి. ప్రస్తుతం అధికారికంగా మృతుల సంఖ్య 616కి చేరినట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్న కొద్దీ మరిన్ని మృతదేహాలు వెలికితీయడంతో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి తీవ్రంగా మారడంతో నేపాల్ విదేశీ సహాయాన్ని స్వీకరించేందుకు అంగీకరించింది. ముఖ్యంగా భారత్, చైనాకు చెందిన సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలు స్థానిక అధికారులకు సహాయం చేసేందుకు అనుమతిస్తున్నారు. అంతర్జాతీయ సమాజం నుంచి వచ్చిన ఒత్తిడి, గల్లంతైన విదేశీ పౌరుల కుటుంబాల ఆందోళనల నేపథ్యంలో పరిమిత సంఖ్యలో నిపుణులను, సెర్చ్ అండ్ రెస్క్యూ బృందాలను నిర్దిష్ట ప్రాంతాల్లోకి అనుమతిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం తెలిపింది. భారీ వరదల కారణంగా ప్రాణనష్టం మాత్రమే కాకుండా, మృతదేహాల గుర్తింపు, భద్రపరచడం, కుటుంబ సభ్యులకు అప్పగించడం వంటి పక్రియలు కూడా అధికారులకు పెద్ద సవాలుగా మారాయి. 600కు పైగా మరణాలు, 2,500 మందికి పైగా గల్లంతు, మార్చురీల పరిమిత సామర్థ్యం నేపాల్‌లో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో మృతుల గుర్తింపు, కుటుంబాల పునరేకీకరణ ఇప్పుడు అధికారులకు అత్యంత కీలకమైన పనిగా మారింది.

# బాల్యానికి సంకెళ్లు..!
# గదిలోనే ఐదేళ్ల చిన్నారి...!!

## - కిటికీ అవతల ప్రపంచం, కిటికీ లోపట చిన్నారి అర్థనాదాలు..!
## - ఆడుకోవాల్సిన వయసులో ఒంటరితనంతో పోరాటమా..!

- తాళం వేసి డే, నైట్ వేళల్లో బయటకు వెళ్తున్న తల్లి..?
- సీసీ కెమెరాలతో అన్నీ తెలుస్తాయి.. నీ అంతు చూస్తా అంటూ తల్లి బెదిరింపులు...?
- అందరినీ కన్నీళ్లు పెట్టిస్తున్న ఆ పాప రోదనలు..
- తక్షణమే చిన్నారికి రక్షణ కల్పించాలని స్థానికుల వేడుకోలు...
- అసలు తాళం వెనుక దాగి ఉన్న మిస్టరీ ఏంటి..?

*నాలుగు గోడల మధ్యన దాగిన చిన్నారి కన్నీటి గాధపై విజన్ ఆంధ్ర అందిస్తున్న ప్రత్యేక కథనం..*

తల్లి ఒడిలో ఆడుతూ.. కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా గడపాల్సిన ఐదేళ్ల చిన్నారి ఇంట్లోనే ఒంటరిగా బందీగా ఉంటోందన్న ఆరోపణలు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేపుతున్నాయి. జీడిమెట్ల సర్కిల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తున్న ఓ మహిళ తన చిన్నారి కుమార్తెను ఇంట్లో ఉంచి బయట నుంచి తాళం వేసి విధులకు వెళ్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**పేట్ బషీరాబాద్, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర):** స్థానికుల సమాచారం ప్రకారం.. సదరు మహిళ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. విధుల్లో భాగంగా నైట్ షిఫ్ట్‌లు కూడా చేస్తుందని, ఆ సమయంలోనూ చిన్నారిని ఇంట్లో ఒంటరిగా ఉంచి తలుపులకు తాళం వేసి వెళ్లిపోతుందని స్థానికులు చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో మరుసటి రోజు ఉదయం వరకు ఆమె ఇంటికి తిరిగి రాదని పేర్కొంటున్నారు.

### కిటికీ వద్దకు చేరి.. 'అమ్మా.. అమ్మా..' అంటూ రోదన

తల్లి ఇంట్లో లేని సమయంలో చిన్నారి కిటికీ వద్దకు వచ్చి 'అమ్మా.. అమ్మా..' అంటూ ఏడుస్తున్న దృశ్యాలను పలుమార్లు చూశామని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో కరెంటు పోయినప్పుడు బాలిక భయంతో కిటికీ వద్దకు చేరుకుని ఇరుగుపొరుగు వారిని 'ఆంటీ.. ఆంటీ..' అంటూ పిలుస్తుందని వారు పేర్కొంటున్నారు.



ఐదేళ్ల పాప ఒంటరిగా ఉండి భయంతో ఏడుస్తున్న దృశ్యాలు తమను తీవ్రంగా కలచివేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కిటికీ వద్దకు వెళ్లినా.. ఎవరినైనా పిలిచినా తల్లి కొడుతుందని బాలిక చెప్పినట్లు సమాచారం

ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు కిటికీ వద్దకు వెళ్లినా, బయటివారిని పిలిచినా తల్లి ఇంటికి వచ్చిన తర్వాత తనను కొడుతుందని బాలిక కొన్ని సందర్భాల్లో పక్కింటి వారికి చెప్పినట్లు సమాచారం. అదేవిధంగా ఇంట్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశానని, తాను లేని సమయంలో కిటికీ వద్దకు వెళ్లినా, ఎవరినైనా పిలిచినా తనకు తెలుస్తుందని, ఇంటికి వచ్చిన తర్వాత తీవ్రంగా శిక్షిస్తానని తల్లి బెదిరిస్తున్నట్లు బాలిక చెప్పినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలు వాస్తవమా? కాదా? అనే విషయాన్ని పోలీసులు బాలల నిపుణుల సమక్షంలో బాలికతో మాట్లాడి, ఇతర ఆధారాలను పరిశీలించి నిర్ధారించాల్సి ఉంది.

### నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందా?

గత మే నెల నుంచి మహిళ విధులకు వెళ్లే ప్రతిసారీ చిన్నారిని ఇంట్లోనే ఉంచి బయట నుంచి తాళం వేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. నైట్ షిఫ్ట్ ఉన్న సమయంలో కూడా బాలికను ఒంటరిగా వదిలేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఇంత చిన్న వయస్సున్న బాలికను గంటల తరబడి ఇంట్లో ఒంటరిగా ఉంచడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? అత్యవసర పరిస్థితుల్లో బాలికకు ఎవరు సహాయం చేస్తారు? అనే ప్రశ్నలు స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

### చిన్నారి మానసిక పరిస్థితిపై ఆందోళన

తరచూ ఒంటరిగా ఉండటం, భయంతో ఏడవడం వల్ల బాలిక మానసిక స్థితిపై ప్రభావం పడుతుందేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాలిక తనలో తానే మాట్లాడుకుంటూ కనిపిస్తోందని, ఆమె ప్రవర్తనలో మార్పులు గమనించామని కొందరు చెబుతున్నారు. అయితే బాలిక మానసిక ఆరోగ్యంపై ముందస్తు నిర్ధారణకు రాకుండా, అధికారులు బాలల వైద్యులు, మానసిక ఆరోగ్య నిపుణులతో అవసరమైన పరీక్షలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

### ముందుగా పాపకు రక్షణ.. తర్వాతే పూర్తి విచారణ

చిన్నారిని ఇంట్లో ఒంటరిగా బంధిస్తున్నారన్న ఆరోపణలపై పేట్‌బషీరాబాద్ పోలీసులు, మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారి భద్రతకు ముప్పు ఉందని అధికారులు గుర్తిస్తే, చట్టప్రకారం ఆమెను సురక్షిత రక్షణలోకి తీసుకుని, వైద్య పరీక్షలు నిర్వహించి, బాలల సంక్షేమ వ్యవస్థ ద్వారా అవసరమైన సంరక్షణ కల్పించాలని కోరుతున్నారు.

### బంధువుల వివరాలు నిర్ధారించాలి

బాలిక తల్లిదండ్రులు, సమీప బంధువులు, కుటుంబ నేపథ్యం, చిన్నారికి సంరక్షణ అందించగల కుటుంబ సభ్యులు ఎవరనే విషయాలను అధికారులు పూర్తిగా పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. బాలికను ఎవరికి అప్పగించాలన్న నిర్ణయం కూడా ఆమె భద్రత, సంక్షేమాన్ని ప్రధానంగా పరిగణనలోకి తీసుకుని సంబంధిత బాలల సంక్షేమ అధికారులు చట్టప్రకారం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బాలిక కుటుంబ నేపథ్యం, సురక్షిత సంరక్షణకు అర్హులైన బంధువుల వివరాలు నిర్ధారించే వరకు అధికారులు తగిన రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

### మరో చోటికి పంపితే పరిస్థితి పునరావృతం కాకూడదు

ప్రస్తుత పరిస్థితిపై పూర్తిస్థాయి విచారణ జరపకుండానే బాలికను మరో వ్యక్తి లేదా తెలియని ప్రదేశానికి అప్పగిస్తే భవిష్యత్తులో కూడా ఇలాంటి పరిస్థితులు పునరావృతమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల బాలిక కుటుంబ నేపథ్యం, బంధువుల వివరాలు, వారి సంరక్షణ సామర్థ్యం, బాలికకు అక్కడ లభించే భద్రత వంటి అంశాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.




### పాప కన్నీళ్లకు.. అధికారుల స్పందన ఎప్పుడు?

ఐదేళ్ల చిన్నారి గురించి వెలువడుతున్న ఈ ఆరోపణలు నిజమైతే ఆమె భద్రత, సంక్షేమం తీవ్రంగా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అందువల్ల అధికారులు ఆలస్యం చేయకుండా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, మొదట చిన్నారి భద్రతను నిర్ధారించి.. అనంతరం కుటుంబ నేపథ్యాన్ని పరిశీలించి.. చట్టబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చిన్నారి కిటికీ వద్ద నిలబడి 'అమ్మా.. అమ్మా..' అంటూ రోదించాల్సిన పరిస్థితి ఇకనైనా ముగిసి, ఆమెకు భద్రమైన బాల్యం అందేలా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని రాఘవేంద్ర కాలనీ స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారి విషయంలో ఆరోపణలు నిజమా? తల్లి పరిస్థితి ఏమిటి? కుటుంబ నేపథ్యం ఏమిటి? బాలికకు సురక్షిత సంరక్షణ ఎవరి వద్ద లభిస్తుంది? అనే ప్రశ్నలకు అధికారుల విచారణతోనే సమాధానం లభించాల్సి ఉంది. పాప భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

## - చెరువుల వద్ద విద్యుత్ దీపాలు, బారికేడ్లు..పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
## - ట్రాఫిక్ నియంత్రణ, తాత్కాలిక మరుగుదొడ్లు, రహదారుల మరమ్మతులపై అధికారుల సమీక్ష

కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జీడిమెట్ల సర్కిల్-55 అధికారులు ముందస్తు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం జీడిమెట్ల గ్రామంలోని వెన్నెలగడ్డ చెరువు, కుత్బుల్లాపూర్ జోనల్ కార్యాలయం సమీపంలోని హెచ్ఎంటీ బహిరంగ ప్రదేశంలో ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక గణేశ్ నిమజ్జన కుంటను వివిధ శాఖల అధికారులతో కలిసి డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్ పరిశీలించారు.



అనంతరం సాయంత్రం గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నిమజ్జన ప్రాంతాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. చెరువుల వద్ద విద్యుత్ దీపాల ఏర్పాటు, బారికేడింగ్, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకంగా చర్చించారు. అదేవిధంగా భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు, వాటి నిర్వహణ, నిమజ్జన ప్రాంతాలకు వెళ్లే రహదారుల నిర్వహణ, అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టే అంశాలపై అధికారులతో సమీక్షించారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు. గణేశ్ నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్ ఆదేశించారు. ఈ పరిశీలన, సమీక్ష సమావేశంలో పోలీసు, ట్రాఫిక్, విద్యుత్, జలమండలి, అగ్నిమాపక, నీటిపారుదల శాఖల అధికారులు, జీడిమెట్ల సర్కిల్ అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో లారీ కింద పడి మహిళ మృతి

## - హెచ్‌బీఎల్ పరిశ్రమం సమీపంలో ఘటన.

నందిగామ:ఆగస్టు 29(విజన్ ఆంధ్ర న్యూస్): రోడ్డు ప్రమాదంలో లారీ క్రింద పడి మహిళ మృతి చెందిన సంఘటన నందిగామ మండలంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట కు చెందిన మల్లెకేడి మహేశ్వర్ జీ,భార్య మల్లెకేడి అరుణాబాయితో కలిసి రాఖీ పండుగ సందర్భంగా తమ ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌లోని ఖర్మాన్‌ఘాట్‌లో ఉన్న తమ పెద్ద కుమార్తె ఇంటికి వెళ్లి,తిరిగి వస్తుండగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ బైపాస్ రోడ్డుపై మండల పరిధిలో హెచ్‌బీఎల్ దంసింగ్ తండా సమీపంలోని హెచ్ బిఎల్ పరిశ్రమ వద్ద జాతీయ రహదారి-44 పై వెనుక నుంచి భారీ వాహనం అశోక్ లేలాండ్ లారీ అకస్మాత్తుగా టైర్ పేలడంతో అదుపు తప్పి వారి ద్విచక్ర వాహనాన్ని



ఢీకొట్టిందని,దీంతో ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న మల్లెకేడి అరుణాబాయి రోడ్డుపై పడిపోవడంతో లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ కిందపడిన మహిళపై నుంచి లారీని పోనివ్వడంతో ఆమెకు తలకు తీవ్ర గాయమై, అధిక రక్తస్రావంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారని తెలిపారు.ప్రమాదం జరిగిన అనంతరం లారీ డ్రైవర్ వాహనాన్ని సంఘటనా స్థలంలోనే వదిలి అక్కడి నుంచి పరారయ్యాడని తెలిపారు.ఈటీ ఘటనపై మృతురాలి భర్త మల్లెకేడి మహేశ్వర్ జీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# రైతు సదస్సులో ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధ్య వాగ్వాదం

**- ప్రభుత్వ పథకాల అమలుపై మాటామాటా**

**- షాబాద్ రైతు వేదికలో ఉద్రిక్తత**

షాబాద్, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): షాబాద్ మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించిన కంది రైతుల సదస్సులో ఎమ్మెల్యే, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రైతు వేదికల ఏర్పాటు, వాటిలో సమావేశాల నిర్వహణ, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చ జరుగుతున్న సమయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, రైతు వేదికలను వినియోగించుకునే విధానం తదితర అంశాలపై వివాదం తలెత్తింది. ముఖ్యంగా రైతు రుణమాఫీ, దళితబంధు పథకాల అమలు అంశాలపై ఇరువురు నాయకులు తమ వాదనలు వినిపించడంతో పరిస్థితి కొంత ఉద్రిక్తంగా మారింది. గతంలో బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే.. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాలపై సానుకూలంగా మాట్లాడినట్లు కొందరు కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కంది రైతుల సమస్యలు, పంట సాగులో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రభుత్వ పథకాల అమలుపై చర్చించాల్సిన సదస్సులో నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో రైతులు, నాయకులు అసహనానికి గురయ్యారు. అనంతరం పరిస్థితి సద్దుమణిగి సదస్సు కొనసాగింది.

# నీట్-పీజీకి పటిష్ట ఏర్పాట్లు!!

**- మూడు కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన**

**- 7:30 నుంచి 8:45 వరకు ప్రవేశం**

**- 9 గంటలకు నీట్-పీజీ పరీక్ష**

**- విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు**

**- సీసీటీవీలతో నిరంతర నిఘా**

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): జిల్లాలో ఆగస్టు 30న జరగనున్న నీట్–పీజీ 2026 ప్రవేశ పరీక్షను ప్రశాంత వాతావరణంలో ఇబ్బందులు లేని అత్యంత పకడ్బందీ రీతిలో నిర్వహించేందుకు అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శనివారం డీసీపీ రామ్‌రెడ్డి, స్థానిక అధికారులతో కలిసి పెద్దకల్వలలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లి ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల, రామగిరి సెంటినరీ కాలనీలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షా ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

**పరీక్షా సమయాలు, ప్రవేశ నిబంధనలు**

పరీక్ష సమయం: ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు. రిపోర్టింగ్ సమయం: ఉదయం 7:30 గంటల నుంచే ప్రవేశం ప్రారంభం. 8:45 గంటల తర్వాత గేట్లు మూసివేస్తారు; ఆలస్యంగా వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. హాజరు పత్రాలు: అడ్మిట్ కార్డును నిర్దేశిత కలర్ ప్రింట్ (బ్యాక్–టు–బ్యాక్, ఒకే ఏ4 షీట్‌పై) రూపంలో తీసుకురావాలి. దీంతో పాటు ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు, ఒరిజినల్/ప్రొవిజనల్ ఎంబీబీఎస్ సర్టిఫికెట్ మరియు దాని సెల్ఫ్ అటెస్టెడ్ జిరాక్స్ కాపీని తప్పనిసరిగా సమర్పించాలి.

**పటిష్ట నిఘా పారదర్శక తనిఖీలు**

పరీక్షా కేంద్రాల వద్ద పూర్తిస్థాయి సీసీటీవీ నిఘా, మొబైల్ జామర్లు ఏర్పాటు చేశారు. ప్రవేశ ద్వారం వద్ద హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్లు , మాన్యువల్ బాడీ ఫ్రిస్కింగ్ నిర్వహిస్తారు. ఆధార్ ధ్రువీకరణ, ఫేస్ కంపారిజన్, బార్‌కోడ్ స్కానింగ్, వేలిముద్రల సేకరణ పూర్తయిన తర్వాతే పరీక్ష హాల్లోకి అనుమతిస్తారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, డిజిటల్ గడియారాలు, నగలు, షూలకు **అనుమతి లేదు.**

**పరీక్ష సరళి, మౌలిక సదుపాయాలు**

ప్రశ్నపత్రం మొత్తం 5 టైమ్–బౌండ్ సెక్షన్లుగా విభజించి ఉంటుంది; ఒక్కో విభాగానికి 42 నిమిషాల సమయం కేటాయించారు. అభ్యర్థులకు తాగునీరు అందుబాటులో ఉంచుతారు. రఫ్ షీట్లు, పెన్నులు అందించబడవు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత బయో బ్రేక్‌లకు అవకాశం ఉండదు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం టీజీఎన్‌పీడీసీఎల్, అత్యవసర వైద్య సేవలకు డీఎంహెచ్ఓ ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తుతో పాటు రెండు ప్రత్యేక ఫ్లయింగ్ స్క్వాడ్లు పర్యవేక్షణ బాధ్యతలు చేపడతాయి. ఈ పరిశీలన కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసిల్దార్లు రాజయ్య, బషీరుద్దీన్, సుమన్, పరీక్షా కేంద్రాల సమన్వయకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వేగవంతంగా గోదావరి పుష్కర పనులు

**- కలెక్టర్ భవేష్ మిశ్రా**




నిజామాబాద్, ఆగస్టు 29 :(విజన్ ఆంధ్ర )వచ్చే ఏడాది జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని జిల్లాలోని ఆయా పుష్కర ఘాట్ ల వద్ద భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సదుపాయాల కల్పన పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైదరాబాద్ నుండి శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావులు ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా, పుష్కర ఘాట్ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని వారు సూచించారు. ఇప్పటికే ఆమోదం పొందిన పనులను మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి తక్షణమే ప్రారంభించాలని అన్నారు. ఈ పనుల పర్యవేక్షణ కోసం తగిన అనుభవం కలిగిన సీనియర్ అధికారిని స్పెషల్ ఆఫీసర్ గా నియమించాలని అన్నారు. భూసేకరణ అవసరమైన పక్షంలో వెంటనే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పుష్కరాలకు మరో పది నెలల గడువు మాత్రమే మిగిలి ఉన్నందున సదుపాయాల కల్పన పనులను చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని హితవు పలికారు. వారం వారం పనుల ప్రగతిని సమీక్షిస్తూ, నివేదికలు సమర్పించాలని సూచించారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ, నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి పుష్కర క్షేత్రం వద్ద భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని తెలిపారు. ఎండోమెంట్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. యంచ వద్ద కూడా కొత్తగా పుష్కర ఘాట్ ఏర్పాటు కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశామని, స్థల నిర్ధారణ జరిగిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని, పోచంపాడ్, తడ్ పాకల్ తదితర పుష్కర ప్రదేశాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. పుష్కర ఘాట్ల వరకు అప్రోచ్ రోడ్లు, ఘాట్ల మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రపంచవ్యాప్తంగా మున్నూరు కాపులను ఏకం చేయడమే లక్ష్యం

**: జీఎంఏ వ్యవస్థాపక చైర్మన్ వెంకట్ పెద్ది**



హైదరాబాద్, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర) : ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో నివసిస్తున్న మున్నూరు కాపు సమాజ బాంధవులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారికి సామాజిక, ఆర్థిక, వైద్య, న్యాయ, వృత్తిపరమైన సహాయ సహకారాలు అందించడమే గ్లోబల్ మున్నూరు కాపు అసోసియేషన్ (జీఎంఏ) ప్రధాన లక్ష్యమని సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వెంకట్ పెద్ది తెలిపారు. తెలంగాణ మున్నూరుకాపు జర్నలిస్ట్స్ ఫోరం ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎర్రమంజిల్ లోని హోటల్ మెర్క్యూర్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్ పెద్ది మాట్లాడుతూ... అమెరికాతో పాటు ప్రపంచంలోని వివిధ దేశాల్లో నివసిస్తున్న మున్నూరు కాపు కుటుంబాలకు అండగా నిలిచేందుకు జీఎంఏను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అమెరికాలో నిర్వహించిన జీఎంఏ తొలి కన్వెన్షన్‌కు 2,500 మందికి పైగా హాజరై విజయవంతం చేశారని, ప్రస్తుతం సంస్థలో 3వేల మందికి పైగా సభ్యులు ఉన్నారని వివరించారు. విదేశాల్లో నివసిస్తున్న మున్నూరు కాపులకు అనుకోని కష్టాలు ఎదురైనప్పుడు తక్షణ సహాయం అందించేలా జీఎంఏ పనిచేస్తోందన్నారు.

**కష్టకాలంలో అండగా జీఎంఏ**

కోవిడ్ సమయంలో తండ్రిని కోల్పోయి విదేశాల్లో చిక్కుకుపోయిన ఓ మున్నూరు కాపు యువతికి సంబంధిత కాన్సులేట్ జనరల్ అధికారులతో మాట్లాడి, అర్ధరాత్రి సమయంలోనే వీసా స్టాంపింగ్ ఏర్పాట్లు చేయించి స్వదేశానికి పంపేందుకు సహకరించిన విషయాన్ని వెంకట్ పెద్ది గుర్తుచేశారు. సమాజానికి చెందిన ఏ ఒక్కరికైనా కష్టకాలంలో అండగా నిలవడమే జీఎంఏ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. భవిష్యత్తులో సంస్థను మరింత ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు లీగల్, బిజినెస్ ఫోరమ్‌లను విస్తరించాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని ప్రతిభావంతులు, వ్యాపారవేత్తలు, న్యాయవాదులు, వైద్యులు, విద్యార్థులు, యువతతో పాటు వివిధ రంగాల్లో ఉన్న వారందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరస్పర సహకారాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**జీఎంఏ వెబ్‌సైట్ ద్వారా వివిధ సేవలు**

జీఎంఏ వెబ్‌సైట్ ద్వారా మ్యాట్రిమోనియల్ సేవలు, విద్యార్థులుయువతకు ఉద్యోగ అవకాశాల సమాచారం, డాక్టర్స్ గ్రూప్ ద్వారా వైద్య సహాయం, లీగల్ నెట్‌వర్క్ ద్వారా న్యాయ సహాయం వంటి పలు ఉచిత సేవలను అందిస్తున్నట్లు వెల్లడించారు. విదేశాల్లో స్థిరపడుతున్న మున్నూరు కాపు కుటుంబాలకు, ముఖ్యంగా అక్కడ పెరుగుతున్న తదుపరి తరానికి అవసరమైన మార్గదర్శకత్వం, సామాజిక అనుసంధానం, సహకారం అందించేలా జీఎంఏను మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. సమాజానికి చెందిన ప్రతి ఒక్కరూ జీఎంఏలో భాగస్వాములై సంస్థ కార్యకలాపాలను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**మానవాభివృద్ధిపైనే దృష్టి పెట్టాలి**

సీనియర్ జర్నలిస్ట్ సుంకరి రామ్మూర్తి మాట్లాడుతూ కేవలం భవనాలు, ఫ్లైఓవర్లు, విమానాశ్రయాలు నిర్మించడమే అభివృద్ధి కాదని, మానవాభివృద్ధి సూచికలు పెరిగినప్పుడే సమాజం నిజమైన ప్రగతి సాధించినట్లు భావించాలని అన్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలు ముందుకు రావాలంటే విద్య, వైద్యం, ఆర్థిక స్థితిగతులు, ఉపాధి అనే నాలుగు కీలక అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. ఒకప్పుడు ఐక్యతకు మారుపేరుగా ఉన్న మున్నూరు కాపు సమాజం గత 1520 ఏళ్లలో వివిధ రాజకీయ పార్టీలుగా విడిపోవడం వల్ల సరైన ప్రాతినిధ్యం కోల్పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, కుట్టు మిషన్ల పంపిణీ తదితర ప్రభుత్వ పథకాల ఫలాలు సమాజంలోని అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా నెట్‌వర్కింగ్‌ను మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జర్నలిస్టులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని, అర్హత కలిగిన జర్నలిస్టులుగా గుర్తింపు పొందేందుకు జర్నలిజం కోర్సులను ఎంచుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

**'పటేల్' గుర్తింపును బలోపేతం చేయాలి**

తెలంగాణ మున్నూరు కాపు జర్నలిస్ట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ మున్నూరు కాపు సమాజ ఐక్యత, సామాజిక గుర్తింపు కోసం 'పటేల్' అనే పదాన్ని విస్తృతంగా ప్రచారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. మున్నూరు కాపు సామాజిక వర్గంలో దాదాపు 70 నుంచి 80 శాతం మంది 'పటేల్' గుర్తింపును ఇప్పటికే ఆమోదించి, సోషల్ మీడియాతో పాటు వివిధ సర్టిఫికెట్లలో ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఇతర సమాజాలు కూడా ఈ గుర్తింపును అంగీకరిస్తున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 'పటేల్' పద వినియోగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువతలో అవగాహన పెంచేందుకు పటేల్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో మూడుసార్లు జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించామని, వాటికి జీఎంఏ పూర్తి సహకారం అందించిందని గుర్తుచేశారు. తెలంగాణలోని మున్నూరు కాపుల మూలాలు, ప్రాంతాలవారీగా ఉన్న సంస్కృతి, చారిత్రక పరిణామాలపై ప్రత్యేక పరిశోధన చేపట్టి త్వరలోనే ప్రత్యేక సంచికగా ఒక పుస్తకాన్ని వెలువరించనున్నట్లు ప్రకటించారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో మున్నూరు కాపు సామాజిక వర్గం బలంగా ఉన్నప్పటికీ, రాజకీయ నాయకులు ఎన్నికల్లో గెలిచిన తర్వాత కుల ప్రస్తావన చేయడానికి వెనకాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులకు తగిన గుర్తింపు లభించేలా ప్రచారం కల్పించాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు.

**దుబాయిలో త్వరలో మున్నూరు కాపుల సమ్మేళనం**

జీఎంఏ వ్యవస్థాపక సభ్యుడు, గ్లోబల్ కనెక్ట్ చైర్ రజినీకాంత్ సంగాని వీడియో సందేశం ద్వారా మాట్లాడుతూ త్వరలో దుబాయిలో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో మున్నూరు కాపుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని, యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కోసం తోడ్పాటునందిస్తామని చెప్పారు. ముఖ్యంగా జర్నలిస్టులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. విదేశాల్లో ఉన్న మున్నూరు కాపు కుటుంబాలకు, ముఖ్యంగా భవిష్యత్ తరాలకు జీఎంఏ ఒక బలమైన వేదికగా, కొండంత భరోసాగా నిలుస్తుందని అన్నారు. సమాజ అభివృద్ధి, ఐక్యత కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మున్నూరు కాపులంతా పరస్పర సహకారంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ విఠల్, సీనియర్ జర్నలిస్టులు ఆకుల రవీందర్, మ్యాడం మధు, జీఎంఏ కాలిఫోర్నియా చాప్టర్ ప్రెసిడెంట్, నేషనల్ మెంబర్‌షిప్ కమిటీ వైస్ చైర్మన్ చంద్ర ఆవుల, పేరుక రమేష్, తుడి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# హియరింగ్ నోటీసుల పంపిణీని వేగవంతం చేయాలి

**- కలెక్టర్ భవేష్ మిశ్రా**



నిజామాబాద్ ఆగస్టు 29 :(విజన్ ఆంధ్ర ) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా హియరింగ్ నోటీసుల పంపిణీనీ వేగవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై శనివారం రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీ, హియరింగ్ అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా, పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు ఈ.ఆర్.ఓలు, సహాయ ఈ.ఆర్.ఓ లు బూత్ లెవెల్ అధికారులకు దిశా నిర్దేశం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ముందుకెళుతున్నామని తెలిపారు. జిల్లాలో హియరింగ్ కోసం 4,32,401 నోటీసులు సిద్ధం చేశామని, 56,678 మందికి ఇప్పటికే నోటీసులు అందజేశామని అన్నారు. ఈ.ఆర్.ఓలు, సహాయ ఈ.ఆర్.ఓలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, హియరింగ్ ప్రక్రియను నిర్ణీత గడువు లోపు పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. వీ.సీ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులకు సూచనలు చేశారు. నోటీసుల పంపిణీని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ గరిష్ట సంఖ్యలో నోటీసులను సంబంధిత ఓటర్లకు అందించి, తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా, మండలాల వారీగా ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించాలని, పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన నోటీసుల పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ భుజంగరావు, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- భక్తులకు ఇబ్బందులు లేకుండా.. శాంతియుత వాతావరణంలో వేడుకలు**

**- మండప నిర్వాహకులకు అధికార యంత్రాంగం సహకరించాలి: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి**




కుత్బుల్లాపూర్, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): రాబోయే వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఉత్సవాల నిర్వహణ, ప్రభుత్వ శాఖల సమన్వయం, మండప నిర్వాహకుల సమస్యల పరిష్కారంపై సమితి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో వినాయక మండపాల ఏర్పాటు, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, విద్యుత్ సౌకర్యాలు, తాగునీటి వసతి, నిమజ్జన ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఉత్సవాల ప్రారంభం నుంచి నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత శాఖలు ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి పరిధిలోని అసెంబ్లీ, డివిజన్ స్థాయి కమిటీలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఆయా ప్రాంతాల్లో గణేష్ ఉత్సవాలను సమన్వయంతో నిర్వహించడం, మండప నిర్వాహకులు ఎదుర్కొనే సమస్యలను గుర్తించి సకాలంలో పరిష్కరించడం, ప్రభుత్వ శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకోవడంపై సమావేశంలో చర్చించారు. నిబంధనల అమలు పేరుతో మండప నిర్వాహకులను అనవసరంగా ఇబ్బందులకు గురిచేయకుండా, అవసరమైన సహకారం అందించాలని సమితి ప్రతినిధులు అధికారులను కోరారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అవసరమైన అనుమతులు, విద్యుత్, పారిశుధ్యం, ట్రాఫిక్, భద్రత, నిమజ్జన ఏర్పాట్లలో నిర్వాహకులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం, పోలీస్, మున్సిపల్ అధికారులు, ఇతర సంబంధిత శాఖలు, గణేష్ మండప నిర్వాహకుల మధ్య సమన్వయకర్తగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని తెలిపారు. మండపాల నిర్వాహకులు తమకు ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులు, సూచనలు, అవసరమైన ఏర్పాట్లను సమితి దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి జీవన్, కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆకుల సతీష్, కో–కన్వీనర్లు కట్ట కుమార్, జయశంకర్, బలరాం, మల్లారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో జరిగింది. దుండిగల్ సర్కిల్ కన్వీనర్ కృష్ణారెడ్డితో పాటు పలువురు అసెంబ్లీ, డివిజన్ కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

# మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డ్-26 ప్రదానం



హైదరాబాద్, ఆగస్ట్ 29 (విజన్ ఆంధ్ర) : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డా.రాజ్ నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం మేజర్ ధ్యాన్ చంద్ ఎక్సలెన్స్ అవార్డ్స్–2026ను ప్రొఫెసర్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్ట రెడ్డి హాజరై అందజేశారు. జస్టిస్ బి.చంద్రకుమార్, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొ.ఇటికల పురుషోత్తం ప్రసంగించారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత కె.సాయి బాబా, ఓయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.కె.దీప్లా పాల్గొని అవార్డు గ్రహీతలు ప్రొ.బి.సురేష్ కుమార్, డా.కె.అనిత, డా.సి.సందీప్ రెడ్డి, డా.బట్టు వెంకన్న, డా.బి.ఆర్. నేత, డా.పుంజాల సుప్రియ, డా.ఏ.సిద్దార్థ, డా.ఆర్.మురళి, మేజర్ డి.జయసుధ, మేజర్ కె.ఏ.శివప్రసాద్, పొటెల్ శ్రీనివాస్ యాదవ్ లను సత్కరించారు. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాధుల మధుసూదన్, జంట నగరాల గుజరాతీ బ్రహ్మ సమాజ్ అధ్యక్షుడు తరుణ్ కుమార్ మేత, కార్యదర్శి డా.మొహమ్మద్ అక్తర్ అలీ, చీఫ్ కోఆర్డినేటర్ డా.రవితేజ, కోఆర్డినేటర్లు జి.వేణుగోపాల్, కె.రవీందర్, సూర్య పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**- మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు**



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 29,(విజన్ ఆంధ్ర); జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను నిర్మల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశాలతో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జిల్లా హాకీ అసోసియేషన్ సహ ఎన్‌టీఆర్ మినీ స్టేడియంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల అధికారి బి. శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. భారత హాకీకి ప్రపంచస్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో మేజర్ ధ్యాన్‌చంద్ చేసిన కృషి, ఆయన ప్రతిభ, అంకితభావం చిరస్మరణీయమని అన్నారు. ధ్యాన్‌చంద్‌ను స్పూర్తిగా తీసుకుని విద్యార్థులు, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడలు కేవలం పోటీలకే పరిమితం కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగం కావాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు క్రీడా కోటా ద్వారా ప్రభుత్వంతో పాటు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను గుర్తించి క్రీడల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రాథోడ్ లక్ష్మణ్, జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు పాకాల రాంచందర్, పీడీలు రమణారావు, రవీందర్‌గౌడ్, అన్నపూర్ణ, భూమన్న, సత్తయ్య, బుచ్చిరామారావు, సుధార్‌సింగ్, పోశెట్టి, వంశీ, కె. శ్రీనివాస్, పీఈటీలు సంజీవ్, గంగాధర్, ముకేష్, భీమేశ్, గిరి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# బోర్గాం(పి) జెడ్పీ హైస్కూల్ ను సందర్శించిన కలెక్టర్




నిజామాబాద్, ఆగస్టు 29 :(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ రూరల్ మోపాల్ మండలం బోర్గాం(పి) గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న బోధనా సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోనే ఇతర అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పోలిస్తే అత్యధికంగా ఈ పాఠశాలలో 1120 మంది విద్యార్థిని, విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండడం, ముగ్గురు ఉపాధ్యాయులకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు వరించడం పట్ల కలెక్టర్ హర్షం వెలిబుచ్చారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా క్రీడా మైదానం లేదని నిర్వాహకులు తెలుపడంతో, స్కూల్ కు ఆనుకుని ఉన్న ఆరోగ్య ఉప కేంద్రం, గ్రంథాలయ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. వీటిని సమీపంలో మరో చోటికి మార్చేందుకు ఏమైనా అవకాశాలు ఉన్నాయా అన్నది పరిశీలించాలని, దీనివల్ల పాఠశాలకు క్రీడా మైదానం వసతి సమకూరడంతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు వీలవుతుందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. బడికి ఆనుకుని ఉన్న ప్రైవేట్ స్థలాన్ని సైతం కొంతమేర సేకరించి పాఠశాలను మరింతగా విస్తరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పదవ తరగతిని సందర్శించి విద్యార్థిని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. ఫిజిక్స్, మ్యాథ్స్, ఆంగ్లం సబ్జెక్టులను బోధించి, పలు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థిని, విద్యార్థులకు పెన్నులు బహుమతిగా అందజేశారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా సర్కారు బడులలో నాణ్యమైన విద్యా బోధనను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి. చేయాలని సూచించారు. పిల్లలను కేవలం పాఠ్యాంశాలకే పరిమితం చేయకుండా బయటి ప్రపంచానికి సంబంధించిన విషయ పరిజ్ఞానం కూడా కల్పించాలని ఉపాధ్యాయులకు హితవు పలికారు. ఏకాగ్రతతో చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విషయ పరిజ్ఞానం పెంపొందించుకుని ప్రతిభను మెరుగుపర్చుకోవాలని విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, మోపాల్ తహసిల్దార్ రేఖ, ఎం.ఈ.ఓ సాయిలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్ తదితరులు ఉన్నారు.

## నీట్ (పీజీ) పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



నిజామాబాద్, ఆగస్టు 29 :(విజన్ ఆంధ్ర )నీట్(పీ.జీ) పరీక్ష కేంద్రాలను కలెక్టర్ భవేష్ మిశ్రా శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాలో నీట్(పీ.జీ) పరీక్షకు 265 మంది అభ్యర్థులు హాజరు కానుండగా, అర్సపల్లిలోని ఏ.వీ ఎంటర్ ప్రైజెస్. మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్ లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ సందర్శించి నిశిత పరిశీలన జరిపారు. పరీక్షా కేంద్రాల్లో సరిపడా కంపూటర్లు, సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ ఇత్యాది సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చూడాలని, పరీక్షా కేంద్రాలలో తాగునీరు, వైద్య సదుపాయాలు సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. నీట్(పీ.జీ) పరీక్ష నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు, లోటుపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నీట్(పీ.జీ) పరీక్ష కొనసాగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీ.ఈ.ఓ అశోక్, డీ.ఐ.ఈ.ఓ రవికుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, ఏ.సీ.పీ ప్రకాశ్, తహసిల్దార్లు వినయ్ కుమార్, హరికిషోర్, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు తదితరులు ఉన్నారు.

# శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో గణేష్ ఉత్సవాల ముందస్తు సమన్వయ సమావేశం

**- జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్**




శేరిలింగంపల్లి.ఆగస్టు 29: (విజన్ ఆంధ్ర) : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను, నిమజ్జన వేడుకలను ప్రశాంత వాతావరణంలో, విజయవంతంగా నిర్వహించేందుకు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఉన్నత స్థాయి ముందస్తు సమన్వయ సమావేశం జరిగింది. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో , పోలీస్, ట్రాఫిక్, హైడ్రా , నీటిపారుదల శాఖ , విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి , జలమండలి తదితర అన్ని ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే గణేష్ ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, అన్ని శాఖలు ఒకరికొకరు పూర్తి స్థాయిలో సహకరించుకుంటూ ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు శాంతిభద్రతలు & ట్రాఫిక్ నియంత్రణ: ఉత్సవాల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ గట్టి భద్రతా చర్యలు చేపట్టనుంది. నిమజ్జన ఊరేగింపుల రూట్లలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు చెరువుల పరిరక్షణ & నిమజ్జన ఏర్పాట్లు: హైడ్రా మరియు నీటిపారుదల శాఖలు సంయుక్తంగా నిమజ్జన చెరువుల వద్ద తగిన చర్యలు చేపట్టాలి. చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా చూస్తూనే, భక్తులకు నిమజ్జనానికి ఇబ్బంది లేకుండా క్రేన్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రహదారుల మరమ్మతులు: ఆర్ అండ్ బి మరియు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగాలు గణేష్ విగ్రహాల ఊరేగింపు సాగే ప్రధాన రహదారులలోని గుంతలను వెంటనే పూడ్చివేయాలని, అవసరమైన చోట రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా: నవరాత్రి ఉత్సవాల పొడవునా మరియు నిమజ్జనం రోజున ఎక్కడా విద్యుత్ అంతరాయం కలగకుండా చూసేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లను, అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచనుంది. కరెంట్ వైర్లను సరిచేయాలని స్పష్టం చేశారు. తాగునీరు & పారిశుద్ధ్యం: జలమండలి ఆధ్వర్యంలో ఉత్సవాల పరిసర ప్రాంతాలలో, నిమజ్జన ఘాట్ల వద్ద నిరంతర తాగునీటి సరఫరా చేయనున్నారు. అలాగే జిఎంసి పారిశుద్ధ్య విభాగం నిరంతరం చెత్తను తొలగిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచనుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పర్యావరణహిత మట్టి వినాయకులను పూజించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఉత్సవ కమిటీలకు అధికారులు పిలుపునిచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్క అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని సర్కిల ఉప కమిషనర్లు మరియు ఉన్నత అధికారులు పాల్గొన్నారు

# కల్వకుర్తి పోచమ్మ తల్లి బోనాల జాతరకు పోలీసుల కఠిన ఆంక్షలు

**- డీజేలపై పూర్తి నిషేధం.. రాత్రి 8 గంటల లోపే ఊరేగింపులు పూర్తి చేయాలి - ఎస్సై కురుమూర్తి**





కల్వకుర్తి, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగ కల్వకుర్తి పట్టణంలో అత్యంత వైభవంగా జరుగనుంది. పట్టణంలోని ప్రసిద్ధ పోచమ్మ తల్లి ఆలయంలో సెప్టెంబర్ 1వ తేదీన నజరు బోనాలు, వీర బోనం మరియు సెప్టెంబర్ 2వ తేదీన ప్రధాన బోనాల జాతర ఘనంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కల్వకుర్తి పోలీసులు కఠిన నిబంధనలు, ఆంక్షలు విధించారు. గత సంవత్సరం బోనాల పండుగ సందర్భంగా జరిగిన ఊరేగింపులో కొందరు యువకులు అనుమతి లేకుండా భారీ డీజే సౌండ్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసి, అత్యధిక శబ్దంతో స్థానిక ప్రజలకు, వృద్ధులకు, చిన్నారులకు తీవ్ర అసౌకర్యం కలిగించారని ఎస్సై కురుమూర్తి తెలిపారు. అంతేకాకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో వాగ్వాదానికి దిగి వారి విధులకు ఆటంకం కల్పించారని ఆయన పేర్కొన్నారు. అలాంటి వారిని గుర్తించి శనివారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి, ఇకపై ఎలాంటి గొడవలకు, అల్లర్లకు పాల్పడబోమని హామీ తీసుకోవడంతో పాటు, ఎమ్మార్వో సమక్షంలో ప్రతి ఒక్కరిపై రూ.1,00,000/- (లక్ష రూపాయలు) చొప్పున బైండ్ ఓవర్ కేసులు నమోదు చేయడం జరిగిందని ఆయన వెల్లడించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సంవత్సరం బోనాల ఊరేగింపుల నిర్వాహకులకు పోలీస్ శాఖ తరపున కఠిన హెచ్చరికలు జారీ చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఈ ఏడాది ఊరేగింపులలో ఎక్కడా కూడా డీజేలు ఉపయోగించడానికి వీలు లేదని, ఒకవేళ నిబంధనలను అతిక్రమించి డీజేలు పెట్టినట్లయితే అట్టి డీజే సౌండ్ సిస్టమ్‌లను వెంటనే సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా అన్ని బోనాల ఊరేగింపులను సాయంత్రం ప్రశాంత వాతావరణంలో రాత్రి 8 గంటల లోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలు జరిగినా దానికి పూర్తి బాధ్యత ఆయా ఊరేగింపుల నిర్వాహకులదేనని, నిబంధనలను అతిక్రమించిన వారిపై ఎలాంటి కనికరం లేకుండా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయని ఆయన స్పష్టం చేశారు. కావున కల్వకుర్తి పట్టణ ప్రజలు, యువకులు, బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు శాఖకు సహకరించి బోనాల జాతరను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్సై కురుమూర్తి విజ్ఞప్తి చేశారు.

# ఏరులై పారుతున్న మద్యం.. నాలుగు నెలల్లోనే రికార్డు స్థాయి అమ్మకాలు!

**నిమిషానికి 1,600 లీటర్లు.. నిమిషానికి 5,200 బాటిళ్లు.. 4 నెలల్లో రూ.14,668 కోట్ల ఆదాయం**




ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో,ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర) తెలంగాణలో మద్యం ఏరులై పారుతోంది. తాగుడుకు తెలంగాణ అడ్డాగా మారుతోందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పండుగ వచ్చినా, ఫంక్షన్ జరిగినా, సంతోషం వచ్చినా, బాధ వచ్చినా మందు బాటిల్ ఓపెన్ చేయాల్సిందే అన్నట్లుగా యువతతో పాటు అన్ని వర్గాల్లో మద్యం వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. తాజాగా ఎక్సైజ్ శాఖ విడుదల చేసిన లెక్కలు చూస్తే దిమ్మతిరిగిపోయే నిజాలు బయటపడ్డాయి.

**నిమిషానికి ఎంత తాగుతున్నారంటే..?**

ఎక్సైజ్ శాఖ అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుండి జులై వరకు కేవలం 4 నెలల్లోనే మందుబాబులు ఏకంగా 28.4 కోట్ల లీటర్ల మద్యాన్ని తాగేశారు. అంటే సగటున నిమిషానికి 1,600 లీటర్ల మద్యం అమ్ముడవుతోంది. బాటిళ్ల లెక్కన చూస్తే నిమిషానికి 3,600 ఐఎంఎఫ్ఎల్ బాటిళ్లు, 1,600 బీర్ బాటిళ్లు.. మొత్తంగా నిమిషానికి 5,200 బాటిళ్లు అమ్ముడుపోతున్నాయి.

**కోట్లలో కేసులు, వేల కోట్లలో ఆదాయం:**

ఈ నాలుగు నెలల్లో మొత్తం 3.5 కోట్ల కేసులు విక్రయమయ్యాయి. అందులో 2.21 కోట్లు బీర్ కేసులు, 1.29 కోట్లు ఐఎంఎఫ్ఎల్ కేసులు ఉన్నాయి. వివిధ ప్యాకింగ్ సైజులతో లెక్కిస్తే 91.5 కోట్ల బాటిళ్లు అమ్ముడయ్యాయి. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు, లిక్కర్ వ్యాపారానికి కలిపి లిరూ.14,668 కోట్ల మేర భారీ ఆదాయం సమకూరింది. ఇదే సమయంలో గత ఏడాదితో పోలిస్తే అమ్మకాలు దాదాపు 18 శాతం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.

**పెరుగుదలకు కారణాలేంటి?**

1. వేసవి కాలం కావడంతో బీర్ వినియోగం విపరీతంగా పెరగడం
2. ఎన్నికల తర్వాత ఫంక్షన్లు, పార్టీలు, పెళ్లిళ్ల సీజన్ జోరందుకోవడం
3. కొత్త బ్రాండ్లు, తక్కువ ధర బాటిళ్లు మార్కెట్లోకి రావడం
4. గ్రామీణ ప్రాంతాల్లో కూడా బెల్ట్ షాపుల ద్వారా యథేచ్ఛగా మద్యం లభించడం

రాష్ట్రానికి ఆదాయం వస్తున్నా, యువత మద్యానికి బానిసలు కావడం, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ కలహాలు పెరగడం ఆందోళన కలిగిస్తోందని సామాజికవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదాయంపైనే కాకుండా మద్య నియంత్రణపైనా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేస్తున్నారు.

## మహిళా పారిశ్రామికవేత్తల ఉన్నతికి 'ర్యాంప్' వరం

**- వ్యాపార విస్తరణ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**

**- ర్యాంప్‌ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'పై అవగాహన సదస్సు**



నిర్మల్ జిల్లా,ఆగస్ట్ 29,(విజన్ ఆంధ్ర); మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించి ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో విజయలక్ష్మి సూచించారు. మహిళా పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు 'ర్యాంప్‌ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం' చక్కటి అవకాశమని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ ఆధ్వర్యంలోని వి-హబ్ సౌజన్యంతో జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తల కు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ర్యాంప్‌ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ బ్యాంకు, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త సహకారంతో 'ర్యాంప్' పథకాన్ని అమలు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న సూక్ష్మ, చిన్న తరహా వ్యాపార సంస్థలను మరింత వేగంగా అభివృద్ధి చేయడం, వాటి సామర్థ్యాన్ని పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పథకం కింద ఎంపికైన మహిళా పారిశ్రామికవేత్తలకు రెండేళ్లపాటు ప్రత్యేక శిక్షణ, మార్గదర్శకత్వం, అవసరమైన సహకారం అందిస్తారని నిర్వాహకులు తెలిపారు. జౌళి, ఆహార శుద్ధి, తయారీ, చేతివృత్తులు, హస్తకళలు తదితర రంగాల్లోని వ్యాపార సంస్థలకు ప్రోత్సాహం కల్పిస్తారన్నారు. వ్యాపార నిర్వహణ నైపుణ్యాల పెంపు, ఉత్పత్తుల నాణ్యత మెరుగుదల, కొత్త ఉత్పత్తుల రూపకల్పన, ఉత్పత్తుల వైవిధ్యీకరణ, బ్రాండింగ్, మార్కెటింగ్‌లో అవసరమైన సహకారం అందిస్తారని వివరించారు. బ్యాంకుల ద్వారా రుణ అనుసంధానం కల్పించడంతో పాటు వివిధ రంగాలకు చెందిన నిపుణులతో వ్యక్తిగత మెంటరింగ్ అందించి వ్యాపారాలను మరింత లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు తోడ్పాటునందిస్తారని తెలిపారు. సదస్సులో 'ర్యాంప్‌ఉమెన్ యాక్సిలరేషన్ ప్రోగ్రాం'కు సంబంధించిన అర్హతలు, ఎంపిక విధానం, శిక్షణ, ప్రయోజనాలు, వ్యాపార విస్తరణకు అందించే సహకారంపై మహిళలకు అధికారులు అవగాహన కల్పించారు. వ్యాపారాలను విస్తరించేందుకు ఆసక్తి చూపిన పలువురు మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మారుతి, వి-హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహ, ప్రతినిధులు డాక్టర్ డెబోశ్రీ, రూపానంద్, హరిచందన, స్వయం సహాయక సంఘాల మహిళలు, మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## జర్నలిస్టు నేత అనిల్ రెడ్డిని పరామర్శించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు

**- దివంగత సరళా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు**



భద్రాచలం, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర ) : భార్య మృతి పట్ల తీవ్ర విషాదంలో ఉన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం టీవీ9 రిపోర్టర్ కర్ర అనిల్ రెడ్డిని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్యతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పరామర్శించారు. భద్రాచలంలోని అనిల్ రెడ్డి నివాసానికి శనివారం వెళ్లిన నాయకులు ఆయనను ఓదార్చి, దివంగత సరళా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. సరళా రెడ్డి మృతి పట్ల మామిడి సోమయ్య తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, అనిల్ రెడ్డికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు చిర్రా శ్రీనివాస్ గౌడ్, ఎలుగోటి వెంకట్రావు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడు బాపురావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, కోశాధికారి వేములకొండ రమేష్, ఉపాధ్యక్షుడు కందబోయిన నాగకృష్ణ, జి. గోపాలకృష్ణ, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఎం. గోపాల్,పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సుంక మహేష్, మణుగూరు నాయకులు పొదిల సుబ్బారావు, భద్రాచలం నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు సరళా రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేసి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనిల్ రెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో అండగా ఉంటామని తెలిపారు.

# రేడియల్ రోడ్డుపై రైతుల ఆవేదన!

**- జంక్షన్ ప్రతిపాదనపై అసంతృప్తి..**

**- ఏరియల్ రోడ్ సర్వేను పరిశీలించిన తహశీల్దార్**



షాబాద్,ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): షాబాద్ మండలంలో ప్రతిపాదిత ఏరియల్ రోడ్‌కు సంబంధించి కొనసాగుతున్న సర్వే పనులను తహశీల్దార్ ఎం డి అన్వర్ పరిశీలించారు. సర్వే జరుగుతున్న ప్రాంతాల ను సందర్శించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణం కారణంగా ప్రభావితమయ్యే రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

**రేడియల్ రోడ్డు జంక్షన్‌పై రైతుల అసంతృప్తి**

అయితే ప్రతిపాదిత రేడియల్ రోడ్డు జంక్షన్ విషయంలో సంకేపల్లిగూడ గ్రామానికి చెందిన రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జంక్షన్ నిర్మాణం కోసం తమ వ్యవసాయ భూములు ప్రభావితమయ్యే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జీవనాధారమైన భూములను కోల్పోయే పరిస్థితి రాకుండా అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కోరారు.

**భూములు కోల్పోతే తీవ్ర నష్టం**

వ్యవసాయ భూములు కోల్పోతే తమ కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని రైతులు తెలిపారు. రోడ్డు అలైన్‌మెంట్‌ను మరోసారి పరిశీలించి, రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను విజ్ఞప్తి చేశారు.రైతుల అభ్యంతరాలను తహశీల్దార్ పరిశీలించి, వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో తమ సమస్య పరిష్కారమవుతుందనే ఆశతో సంకేపల్లిగూడ రైతులు ఎదురుచూస్తున్నారు.

## ఇద్దరిని బలిగొన్న వేపచెట్టు వివాదం

**- గొడ్డళ్లతో నరుకున్న ఇరువర్గాలు**

**- అడ్డుకోబోయిన ఎస్ఐకి తీవ్ర గాయాలు**

సూర్యాపేట,ఆగస్ట్29 : సూర్యాపేటజిల్లాలో ఓ చిన్న వివాదం పెద్దదిగా మారి ఇద్దరి ప్రాణాలను బలి తీసుకున్నది. మేళ్లచెరువు మండలం ఎర్రగడ్డతండాలో ఇంటి పక్కన ఉన్న వేపచెట్టు విషయమై రెండు వర్గాల మధ్య చిచ్చు రేగింది. దారుణమైన రక్తపాతానికి దారితీసింది. మాటామాటా పెరిగి తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయిన ఇరు వర్గాలు విచక్షణ కోల్పోయి ఏకంగా గొడ్డళ్లతో పరస్పరం దాడులకు తెగబడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో ఒకరిపై ఒకరు వేసుకున్న గొడ్డలి వేట్లకు ఇద్దరు వ్యక్తులు రక్తపు మడుగులో కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఆ ఇద్దరు వ్యక్తులు ఘర్షణను అడ్డుకునేందుకు రంగంలోకి దిగిన మేళ్లచెరువు ఎస్ఐ నవీన్‌కుమార్‌కు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఓ చిన్న చెట్టు వివాదం ఇద్దరి ప్రాణాలు తీయడంతోపాటు పోలీసులకే గాయాలయ్యే స్థాయికి వెళ్లడంతో ఎర్రగడ్డతండాలో ప్రస్తుతం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**




రంగారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 29, ( విజన్ ఆంధ్ర ):ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓ. లకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా కొత్తగా విధుల్లో చేరిన సిబ్బందికి సోమవారం వరకు అవసరమైన శిక్షణ అందించి, శిక్షణ అనంతరం బుధవారం నుంచి క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఫార్మ్‌లకు సంబంధించిన ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయడంతోపాటు, మండల స్థాయి వరకు పనులను సమన్వయంతో పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏఈఆర్ఓ కార్యాలయాల పరిధిలో క్లస్టర్ స్థాయిలో సిబ్బందికి బాధ్యతలు కేటాయించి, అవసరమైన ప్రాంతాల్లో అదనపు బృందాలను ఏర్పాటు చేసి కార్యాలయం నుంచి పనులను పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే, పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో అవసరమైన సమన్వయం, బాధ్యతల కేటాయింపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శారదా దేవి, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత క్యాంపులు ఏర్పాటు అభినందనీయం

**- ఐఎంఎ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ పుల్లారావు.**


**- ఘనంగా శ్రీ సత్యావతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నాలుగో వార్షికోత్సవం.**



నల్లగొండ,ఆగస్టు 22,(విజన్ ఆంధ్ర) : మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఉచిత క్యాంపులు ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ఐ ఎంఎ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ పుల్లారావు పేర్కొన్నారు.నాలుగో వార్షికోత్సవం సందర్భంగా శనివారం నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులోని శ్రీ సత్యావతి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మహిళలకు ఉచిత క్యాన్సర్ క్యాంప్,రక్తదాన శిబిరాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు.సత్యవతి హాస్పిటల్ లో ప్రతి సంవత్సరం మోకాళ్ళ చిప్ప మార్పిడి చికిత్స చేయడం ఎంతో గర్వకారణం అన్నారు.తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించే హాస్పిటల్ సత్యవతి హాస్పిటల్ అని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులకు ఐఎంఏ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని అన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు ప్రతి ఒక్కరు రక్తదానాలు చేయాలని సూచించారు.10వ వార్డు డివిజన్ కార్పొరేటర్ పిల్లి కృష్ణ మారాజు మాట్లాడుతూ.. గతంలో ఎంత చిన్న ప్రాబ్లం వచ్చినా చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించేవారని,ఇలాంటి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి జిల్లా కేంద్రంలో ఏర్పాటు అయిన తర్వాత ఆ సమస్యలు తీరిపోయాయని అన్నారు.వార్షికోత్సవం సందర్భంగా నిరుపేద ప్రజలకు ఎలాంటి డబ్బు ఖర్చు లేకుండా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం పట్ల సత్యవతి ఆసుపత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.ఐఎంఎ నీలగిరి అధ్యక్షులు డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ వైద్యం అందిస్తున్న సత్యవతి హాస్పిటల్ సిబ్బందికి, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని,రోగులకు మరింత వైద్య సేవలు అందించాలని సూచించారు. నాలుగు సంవత్సరాల కాలంలో సత్యవతి హాస్పిటల్ వైద్యంలో మరింత అభివృద్ధి చెందిందన్నారు. ఉచిత వైద్య శిబిరాలకు నీలగిరి ఐఎంఎ పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.రక్తదాన శిబిరానికి యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానాలు చేశారు.ఉచిత క్యాన్సర్ క్యాంపునకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పరీక్షలు చేయించుకున్నారు.ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ డైమండ్ మోహన్ రెడ్డి,శ్రీ సత్యావతి మల్టీ హాస్పిటల్ మేనేజర్ సురేపల్లి సత్యనారాయణ,ఆసుపత్రి డాక్టర్లు సురేపల్లి రాం మనోహర్,సంపద,చైతన్య, అశ్విని పిల్లల ఆసుపత్రి డాక్టర్ వినోద్ కుమార్,డాక్టర్ గణేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# జడ్చర్ల మున్సిపాలిటీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



మహబూబ్ నగర్ ఆగస్ట్ 29(విజన్ ఆంధ్ర)జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి, పారిశుద్ధ్య, పౌర సేవల కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జడ్చర్ల మున్సిపాలిటీకి చెందిన అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని వివిధ విభాగాల పనితీరు, ఆయా విభాగాల ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాల పురోగతిని విభాగాల వారీగా సమీక్షించారు.మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల స్థితిగతులు, పారిశుద్ధ్యం, పరిశుభ్రత నిర్వహణ, ప్రజలకు అందుతున్న మున్సిపల్ సేవలు, పన్నులు తదితర ఆదాయ వసూళ్ల పురోగతి, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై అదనపు కలెక్టర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మున్సిపల్ సేవలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిస్తూ నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంపొందించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న పన్నులు, ఇతర ఆదాయ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనులను నిర్దేశిత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి విభాగం తనకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మున్సిపాలిటీ అభివృద్ధి , ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో కీలకపాత్ర పోషించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు.

# క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

**- హనుమకొండను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా అడుగులు**

**- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**- క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల కల్పనకు చర్యలు**

**- జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయి**

**- హనుమకొండలో ఘనంగా బ్యాడ్మింటన్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ ప్రారంభోత్సవం**



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 29 ( విజన్ ఆంధ్ర ) : విద్య, వైద్యంతో పాటు క్రీడారంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, హనుమకొండలో క్రీడా మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని ప్రధాన క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ లిపశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శనివారం హనుమకొండ లో అభివృద్ధి చేసిన స్విమ్మింగ్ పూల్‌ను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ తదితరులతో,జేఎన్ఎస్ ఇండోర్ స్టేడియంలో పునర్నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న బ్యాడ్మింటన్ స్టేడియంను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ హనుమకొండ జేఎన్ఐఎస్ ప్రెసిడెంట్ బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సభాధ్యక్షత వహించగా ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని అన్నారు. గత రెండున్నరేళ్లలో వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అన్ని రంగాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. జేఎన్ఎస్ లో కల్పించిన క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడాకారులకు అవసరమైన మెరుగైన మౌలిక సదుపాయాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్పోర్ట్స్ స్కూల్‌కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, త్వరలోనే ఏర్పాటుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. వరంగల్ క్రీడాకారులకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందిందని, ఈ ప్రాంతానికి చెందిన అనేక మంది క్రీడాకారులు గతంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. ప్రస్తుత తరం క్రీడాకారులు కూడా క్రమశిక్షణ, పట్టుదలతో శిక్షణ పొంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు.క్రీడల్లో సాధించే ప్రతి విజయం వ్యక్తిగత విజయంతో పాటు కుటుంబానికి, ఊరికి, జిల్లాకు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలుస్తుందని పేర్కొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభతో హనుమకొండ జిల్లా పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన రోజే మాకు నిజమైన బహుమతి అని అన్నారు. హనుమకొండలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, స్పోర్ట్స్ స్కూల్‌కు సొంత భవన నిర్మాణం వంటి చర్యలు భవిష్యత్తులో మరింత మంది ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు దోహదపడనున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూలి, క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. జేఎన్ఎస్‌లో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ లలో క్రీడా వసతులను మెరుగైన ప్రమాణాలతో అభివృద్ధి చేశామని తెలిపారు. క్రీడాకారులు ఈ సదుపాయాలను తమ సొంత ఆస్తిగా భావించి సద్వినియోగం చేసుకోవడంతో పాటు వాటి పరిరక్షణకు కూడా సహకరించాలని సూచించారు. స్పోర్ట్స్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్‌కు ప్రత్యేక భవనం నిర్మాణం కోసం ప్రభుత్వానికి నివేదిక అందజేశామని, ఈ దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలకే పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని కలెక్టర్ ఆకాంక్షించారు. యువ క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వసతులు అందించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. హనుమకొండ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కొత్త ప్రశాంత్ మాట్లాడుతూలి దాదాపు కోటిన్నర రూపాయలతో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ పునర్నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణముతో నిర్మించిన వీటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన అనంతరం స్పోర్ట్స్, స్విమ్మింగ్ అకాడమీ క్రీడాకారులు స్విమ్మింగ్ చేయగా ఎంపీ ఎమ్మెల్యే కలెక్టర్లు పరిశీలించారు. బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, ఏసిపి జితేందర్ రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి బ్యాడ్మింటన్ ఆడారు. బ్యాడ్మింటన్ వెటరన్ క్రీడాకారులు రమణయ్య, కైలాసం లను ఎమ్మెల్యే కలెక్టర్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కైలాస్ యాదవ్, ఆఫీసర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్, ఏసీపీ జితేందర్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి రమేష్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిబంధనల మేరకు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం

**: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 29(విజన్ ఆంధ్ర)ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా జిల్లాలో ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 2,36,590 నోటీసులు జనరేట్ చేయగా, 60,959 నోటీసులను సంబంధిత ఓటర్లకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. నోటీసుల జారీ, వారం రోజుల గడువు, డీసెంట్రలైజ్డ్ హియరింగ్ తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని ఆయన పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, EROలు, AEROలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి SIR ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా జజూా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, SIR ప్రక్రియను నిబంధనల ప్రకారం, పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లకు జారీ చేసే నోటీసులను తప్పనిసరిగా సంబంధిత వ్యక్తికే వ్యక్తిగతంగా అందజేయాలని, నోటీసు అందజేసినట్లు సరైన ఎకనాలెజ్‌మెంట్ తీసుకుని రికార్డుల్లో భద్రపరచాలని సూచించారు. నోటీసు అందుకున్న ఓటర్లు అవసరమైన పత్రాలు సమర్పించుకునేందుకు కనీసం ఏడు రోజుల సమయం ఇవ్వాలని తెలిపారు. విచారణ తేదీకి రెండు రోజుల ముందుగానే ఓటర్లకు మరోసారి సమాచారం అందించి, నిర్ణీత తేదీన విచారణకు హాజరయ్యేలా చూడాలని సూచించారు.

***వికేంద్రీకృత విధానంలో విచారణలు***

ఓటర్లకు సౌకర్యంగా ఉండేలా విచారణలను వికేంద్రీకృత విధానంలో నిర్వహించాలని జజూా సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద లేదా సమీపంలోని కమ్యూనిటీ హాళ్లు, ఇతర అనువైన ప్రదేశాల్లో విచారణలు చేపట్టాలని తెలిపారు. అవసరాన్ని బట్టి పలు పోలింగ్ కేంద్రాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి విచారణలు నిర్వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న విచారణలను వేగవంతంగా పూర్తి చేసేందుకు EROలు, AEROలు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని, నియోజకవర్గాల వారీగా పెండింగ్ కేసుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు.

***స్పీకింగ్ ఆర్డర్లలో స్పష్టత తప్పనిసరి***

ఓటరు పేరు తొలగింపు లేదా ఇతర మార్పులకు సంబంధించిన నిర్ణయాలను స్పష్టమైన కారణాలతో కూడిన స్పీకింగ్ ఆర్డర్ రూపంలో జారీ చేయాలని సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. ఓటరు పేరు ముసాయిదా జాబితాలోకి వచ్చిన విధానం, అభ్యంతరానికి కారణం, సమర్పించిన పత్రాలు, విచారణలో తేలిన అంశాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. తుది నిర్ణయం తీసుకునే ముందు సంబంధిత రికార్డులను పలుమార్లు పరిశీలించి పూర్తి బాధ్యతతో చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో అప్పీళ్లు వచ్చినా రికార్డుల ఆధారంగా నిర్ణయాన్ని సమర్థించుకునేలా వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు.

***డేటా ఎంట్రీపై నిరంతర పర్యవేక్షణ***

ఎన్యూమరేషన్ ఫారాల డేటా ఎంట్రీలో పొరపాట్ల కారణంగా నాన్-మ్యాపింగ్ కేటగిరీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని జజూా పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ల పనితీరును సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి దశలో నాణ్యతా తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

***రాజకీయ పార్టీలకు సమాచారం అందించాలి***

క్లెయిమ్స్, అబ్జెక్షన్ల వివరాలను రోజువారీగా లేదా కనీసం వారానికి ఒకసారి సంబంధిత కార్యాలయాల నోటీస్ బోర్డులపై ప్రదర్శించాలని CEO సూచించారు. అవసరమైన చోట రాజకీయ పార్టీల ప్రతినిధులకు కూడా సమాచారం అందించాలని తెలిపారు. అనామలీస్ లిస్ట్, నాన్-మ్యాపింగ్ కేటగిరీల వివరాలను సాధ్యమైన మేరకు రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. విచారణకు హాజరయ్యే ఓటర్లు సమర్పించాల్సిన పత్రాలపై ముందుగానే స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, అవసరమైన ఆధార పత్రాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అన్నారు. విచారణల అనంతరం జరిగే అప్పీళ్ల ప్రక్రియకు కూడా సిబ్బందిని ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. SIR ప్రక్రియలో నోటీసుల జారీ నుంచి వాటి స్వీకరణ, విచారణ, పత్రాల సమర్పణ, నిర్ణయం, స్పీకింగ్ ఆర్డర్ వరకు ప్రతి దశకు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా భద్రపరచాలని జజూా స్పష్టం చేశారు. ఒకే చిరునామాకు సంబంధం లేని వ్యక్తుల పేర్లు నమోదవడం, వాస్తవంగా ఆ ప్రాంతంలో నివసించని వ్యక్తుల పేర్లు జాబితాలో ఉండటం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్డీఓ నవీన్, సంబంధిత ఎన్నికల అధికారులు

# దోమకొండ పి,ఏ,సి,యస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం

**- రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం**

**ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్.**

కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 29(విజన్ఆంధ్ర) : కామారెడ్డి నియోజకవర్గంలోని దోమకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి ఏ సి యస్ ) నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.చైర్మన్‌గా చంద్రయ్యగారి అనంతరెడ్డి ప్రమాణ స్వీకారం చేయగా, పాలకవర్గ సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్‌తో పాటు నూతన పాలకవర్గ సభ్యులను షబ్బీర్ అలీ, ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ అభినందించారు. రైతులకు అండగా పి ఏసియష్ పనిచేయాలని సూచించారు.

**- ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడితేనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సహకార సంఘాలు కేవలం రుణాల పంపిణీకి మాత్రమే పరిమితం కాకుండా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను అందించే కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.




**- కామారెడ్డి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత**

కామారెడ్డి నియోజకవర్గంలో విద్య, వైద్యం, రహదారులు, తాగునీరు, వ్యవసాయం తదితర రంగాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని షబ్బీర్ అలీ తెలిపారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.దోమకొండ పిఏసియస్ నూతన చైర్మన్ అనంతరెడ్డిని అభినందించిన ఆయన.. రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఎలాంటి రాజకీయ భేదాలు లేకుండా ప్రతి రైతుకు సమానంగా సేవలందిస్తూ ను మరింత బలోపేతం చేయాలని కోరారు.

**- జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కర్ మాట్లాడుతూ..**

రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, కొంత ఆలస్యం జరిగినా ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సామగ్రి సకాలంలో అందేలా చైర్మన్లు, పాలకవర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రైతులు చిన్నచిన్న అవసరాల కోసం అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామస్థాయిలోనే సహకార సంఘాల ద్వారా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాస్, మాజీ డీసీసీబీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, దోమకొండ సర్పంచ్ ఐరేని నరసయ్య , ఆశ పోయిన శ్రీనివాస్ ,కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, భీంరెడ్డి, గూడెం శ్రీనివాస్ రెడ్డి, తిరుమల గౌడ్, ఇరేని సందీప్, అంతంపల్లి సుధాకర్ రెడ్డి , అబ్బర బోయిన స్వామి , రామస్వామి గౌడ్ , రెడ్డి నాయక్, భూమనీ బాలరాజ్, బల్యాల సుదర్శన్, లింగారెడ్డి, కవిత, నౌసి లాల్ నాయక్ , అంకం కృష్ణారావు, శ్రీకాంత్, రాకేష్ రెడ్డి, మండల యస్ సి సెల్ అధ్యక్షులు వినీత్, గ్రామ అధ్యక్షులు మధు, మాజీ సర్పంచ్ నల్లపు అంజలి శ్రీనివాస్, గోపాల్ రెడ్డి, సిద్దారంలు, ఈశ్వర్ గౌడ్, లింగం, సాయిలు, శ్రీహరి, నరేష్ రెడ్డి, శంకర్ రెడ్డి, సంజీవ్, రామస్వామి గౌడ్, సిద్ధారెడ్డి, బాపురెడ్డి, అంజం, జగ్గారెడ్డి, ముత్తాగౌడ్, నర్సింలు, బాలరాజ్, పాత్రికేయ మిత్రులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు. వివిధ సొసైటీల చైర్మన్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**- కలెక్టర్ రాజర్షిషా**



ఆదిలాబాద్, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం మరియు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ముఖ్య అతిథిగా హాజరై, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడా జ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఆదిలాబాద్, జైనథ్, ఐటీడీఏ స్పోర్ట్స్ పాఠశాలల విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. క్రీడాకారుల ప్రగతికి అవసరమైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, జూడో, హాకీ తదితర విభాగాలలో విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలువురు పూర్వ క్రీడాకారులను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. డివైఎస్‌ఓ దయానంద్ రెడ్డి, ప్రముఖ క్రీడాకారులు, కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): విద్యార్థులు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండేందుకు పోషకాలతో కూడిన పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం స్థానిక ఖుర్షీద్‌పూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమం మరియు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలోని కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పోషకాహార లోపం నివారణకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన ఆహారాన్ని అందిస్తోందని, విద్యార్థులు దీనిని నిర్లక్ష్యం చేయకుండా ఆకుకూరలు, కూరగాయలు, గుడ్లను తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లు, టీవీలను పరిమితంగా ఉపయోగించాలని, అధిక స్క్రీన్ టైమ్ ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. విద్యార్థులు చదువు, క్రీడలు, పుస్తక పఠనానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కంటి సమస్యలు ఉన్న విద్యార్థులు నిర్లక్ష్యం చేయకుండా వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా కంటి అద్దాలు ధరించాలని తెలిపారు. పాఠశాలలో సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కంప్లైంట్ బాక్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పురాతనంగా మారిన ప్రస్తుత పాఠశాల భవన స్థానంలో నూతన భవన నిర్మాణం పూర్తయ్యే వరకు విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా తాత్కాలికంగా డీసీఈబీ కార్యాలయ భవనానికి తరలిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాధవి, డీఎంహెచ్‌ఓ డా. సాధన, స్థానిక కౌన్సిలర్ ప్రకాష్, వైద్యులు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు రమేష్ రెడ్డి, డీబీసీఓ కృష్ణ, ఆర్బీఎస్‌కే వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రామతీర్థంలో వైభవంగా పౌర హక్కుల దినోత్సవం

**- ప్రజాప్రతినిధులు, మండల అధికారులతో కలిసి ఊరంతా సహ పంక్తి భోజనాలు**




నల్లబెల్లి, ఆగస్టు 29, ( విజన్ ఆంధ్ర ) : మండల పరిధిలోని రామతీర్థం గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు వైభవంగా నిర్వహించారు. సమాజంలో కుల వివక్షను నిర్మూలించి, ప్రతి ఒక్కరూ పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎస్సై సాయి ప్రసన్న కుమార్‌లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ. చట్టం ముందు అందరూ సమానులేనని, పౌర హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎలాంటి అస్పృశ్యత, తారతమ్యాలకు తావులేకుండా కలిసిమెలిసి జీవించాలని కోరారు. అనంతరం కులమతాలకు అతీతంగా సమతా భావాన్ని చాటుతూ స్థానిక ప్రజలు, అధికారులు కలిసి సమరసతా సహపంటి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి,రవి, మండల విద్యాధికారి అనురాధ, మండల వ్యవసాయ అధికారి రజిత బన్నా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఏపీఎం సుధాకర్ వైద్యాధికారి డాక్టర్ ఆచార్య విలేజ్ రెవెన్యూ సొసైటీ ప్రతినిధులు, ఏపీఓ, రెవెన్యూ గిర్దావర్, జీపీఓ, పంచాయతీ కార్యదర్శి తదితర శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తక్కువ ధరకే నాణ్యమైన బోల్ట్ ఇట్ ఇంజిన్ ఆయిల్..!

**- నాచారం పారిశ్రామిక వాడలో లాంఛనంగా ప్రారంభం.!**



కాప్రా/ ఆగస్టు 28(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : నాచారం ఇండస్ట్రీస్ ప్రాంతంలో ఈవీ జాజ్ మొబిలిటీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'బోల్ట్ ఇట్ ఎక్స్‌ప్రెస్' ఇంజిన్ ఆయిల్‌ను శుక్రవారం సంస్థ కార్యాలయంలో ప్రారంభించారు. టీపీసీసీ జాయింట్ కన్వీనర్ రేగులపాటి రమ్యారావు, సంస్థ చైర్మన్ అంకుల్ అగర్వాల్, రూపేష్ షా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిజన్ శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ ధరకే నాణ్యమైన ఇంజిన్ ఆయిల్ అందుబాటులోకి రావడం నగర వాహనదారులకు ప్రయోజనకరమన్నారు. ఇప్పటికే వినియోగదారుల్లో మంచి గుర్తింపు పొందిన ఈవీ జాజ్ మొబిలిటీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'బోల్ట్ ఇట్ సూపర్ యాప్' ఎంతోమందికి ఉపయోగపడుతోందని తెలిపారు.

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే ఎల్బీనగర్ అభివృద్ధి

**- మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్**



ఎల్బీనగర్, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అత్యధిక నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధి పనులకు ప్రత్యేక సహకారం అందిస్తున్నారని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. చంపాపేట డివిజన్లోని మారుతీ నగర్ కాలనీలో లో రూ. 1.44 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, సేవ దళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ తో కలిసి మధుయాష్కి గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. అభివృద్ధి కోసమని పార్టీ మారిన ఇక్కడి ఎమ్మెల్యే, ఏ అభివృద్ధి చేయకుండా ప్రజలను మోసం చేశాడని, సూర్యుడి కంటే ముందే లేస్తా అని డైలాగులు మాత్రమే చెప్పుకుంటున్నాడని విమర్శించారు. మూసీ కార్పొరేషన్ చైర్మన్ పదవి పొందాడే తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. రాజకీయాలకతీతంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నామని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే నియోజకవర్గానికి నిధులు మంజూరయ్యాయని బిజెపి మాజీ కార్పొరేటర్లు సైతం పలు వేదికలపై మాట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు స్పందించి పనిచేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ప్రజలు కట్టిన పన్నులను కాళేశ్వరానికి తరలించి కమీషన్లు దండుకొని తిన్నారని, సీఎం రేవంత్ రెడ్డి మాత్రం నగరంలో వసూలు చేసే పన్నులను ఇక్కడి అభివృద్ధికే ఖర్చు చేస్తున్నారన్నారు. నగరంలో మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. చంపాపేట డివిజన్ లో గతంలో వరద ముంపు సమస్యలు ఉంటే, తాము రూ. 5కోట్ల నిధులతో పనులు చేయించి సమస్య తీర్చామన్నారు. డ్రైనేజీ సమస్యలను కూడా పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపీగా ఈటల రాజేందర్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు తీసుకొచ్చారు..? అని ప్రశ్నించారు. ఇక్కడి ఎమ్మెల్యే 118 జీవో ద్వారా కన్వీనెంట్ డేట్ తీసుకొచ్చి ప్రజలకు బురిడీ కొట్టించాడన్నారు. మునుగోడు ఉప ఎన్నికను పురస్కరించుకొని హడావుడిగా 118జీఓ తీసుకొచ్చి ప్రజలు కష్టపడి కొనుక్కున్న ఇళ్లలో ప్రజలే కబ్జాదారులని కన్వీనియన్స్ డీడ్ లలో చూపించారని, ప్రజలతో పైసలు కట్టించి కన్వీనియన్స్ డీడ్ పేరిట చిత్తుకాగితాన్ని అందజేశారని విమర్శించారు. అనంతరం మల్ రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఏర్పడిన తర్వాత మధుయాష్కి గౌడ్ సహకారంతో వివిధ నియోజకవర్గంలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఎల్బీనగర్ అంటే సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక అభిమానమన్నారు. గత ప్రభుత్వంలో 100 కోట్ల నిధులు కూడా నియోజకవర్గానికి రాలేదని, అభివృద్ధి పేరిట ఇక్కడి ఎమ్మెల్యే డ్రామాలు ఆడుతుంటాడని విమర్శించారు. ప్రజా సంక్షేమ అభివృద్ధిలో భాగంగా మంత్రికి రోడ్లు, అభివృద్ధి విషయాలు చెప్పగానే, ఎమ్మెల్యే వాటిపై మాట్లాడుతూ.. తానే చేస్తున్నట్లు డ్రామాలు చేస్తుంటారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్ రెడ్డి, సామ రమణారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల రవీందర్ గౌడ్, మాజీ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెగావత్ గణేష్ నాయక్, అనసూయ, సరిత, యాదమ్మ, వరలక్ష్మి, భాగ్య, మాధవి, కాలనీ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, రఘునందన్ రెడ్డి, లలిత తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సన్నిధిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**- భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు.. రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం స్వామివారిని వేడుకున్న మంత్రి**

**- అర్హత ఉన్న ప్రతి ఓటును కాపాడుకోవాలి.. ఓటర్ల సవరణపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**





వేములవాడ రాజన్న సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర బ్యూరో): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలోని భీమేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తన ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు చెప్పారు. కొత్తకొండ వీరభద్రస్వామివారికి నక్షత్ర మాల సమర్పించిన సందర్భంగా వేములవాడకు వచ్చినట్లు మంత్రి తెలిపారు. కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయానికి కాకతీయుల కాలం నాటి గొప్ప చరిత్ర ఉందని పేర్కొన్నారు. ఆధ్యాత్మికతతో పాటు తెలంగాణ సంస్కృతి, వారసత్వాన్ని ప్రతిబింబించే ఇలాంటి పుణ్యక్షేత్రాలను ప్రతి ఒక్కరూ దర్శించుకుని దైవ ఆశీస్సులు పొందాలని కోరారు. ఇటీవల కొండగట్టు పాదయాత్రతో పాటు వివిధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం పలు దేవాలయాల్లో పూజలు నిర్వహించారని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలందరూ శాశ్వత సుఖసంతోషాలతో, ఐక్యతతో, అభివృద్ధితో ముందుకు సాగాలన్నదే తమ ఆకాంక్ష అని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఓటును కాపాడుకోవాలి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల సవరణ కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన హక్కు అని, అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు పేరులో చిన్నచిన్న స్పెల్లింగ్ తప్పులు, పేర్లు లేదా ఇతర వివరాల్లో పొరపాట్లు ఉన్నా, అధికారుల నుంచి నోటీసులు అందినా నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించి తమ ఓటు వివరాలను సరిచేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైతం బూత్ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి ఓటు నమోదయ్యేలా, ఇప్పటికే ఉన్న ఓట్లలో తప్పులు ఉంటే సరిచేసుకునేలా ప్రజలకు సహకరించాలని సూచించారు. గతంలో కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఓటర్ల పునర్విమర్శ ప్రక్రియపై రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం అర్హత ఉన్న ప్రతి పౌరుడి ఓటు హక్కు కాపాడేలా ఓటర్ల సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని అన్నారు. ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఓటర్ల సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లకు, వివాదాలకు తావులేకుండా సజావుగా పూర్తికావాలని ఆకాంక్షించారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకూడదన్నారు. "తెలంగాణ ప్రజలందరికీ నా విజ్ఞప్తి ఒక్కటే.. మీ ఓటును మీరే కాపాడుకోండి. ఓటర్ల సవరణలో మీ పేరు, వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో తప్పకుండా పరిశీలించుకోండి" అని మంత్రి సూచించారు. ఎన్నికల కమిషన్ ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ విమర్శలు ఉన్నాయని, పలు రాష్ట్రాల్లో జరిగిన ఓటర్ల సవరణ ప్రక్రియ అనంతరం వెలువడిన ఎన్నికల ఫలితాలను ప్రజలు గమనించారని మంత్రి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రజల చేతిలో ఉన్న అత్యంత శక్తివంతమైన ఆయుధం ఓటు హక్కు అని, ఆ హక్కును ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# యువత సమస్యలపై ఢిల్లీ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

**- ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ**





హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 29 ( విజన్ ఆంధ్ర ): యువత సమస్యలపై ఢిల్లీ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 2వ హనుమకొండ జిల్లా మహాసభ ఘనంగా జరిగింది. ఈ మహాసభకు కేతపాక ప్రసాద్, పసునూరి సునీల్, తాటికంటి మమత అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి హాజరై ముందుగా ఎఐవైఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మహాసభను ప్రారంభించి ఆయన మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో యువత చేపట్టిన పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఎఐవైఎఫ్ ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా యువత 20 రోజుల పాటు ఢిల్లీలో స్వచ్ఛందంగా ఆందోళన నిర్వహించడంతో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం దిగివచ్చి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయించిందని, ఇది దేశ యువత సాధించిన విజయమని అన్నారు. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎఐవైఎఫ్ కార్యకర్తలు, నాయకులు యువత సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. 2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఆ హామీని విస్మరించిందని విమర్శించారు. దేశ సంపదను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ అవకాశాలు లేక యువత పెడదారి పడుతున్న పరిస్థితికి కేంద్ర ప్రభుత్వ విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలే కారణమని అన్నారు. రానున్న రోజుల్లో దేశంలోని యువతీ యువకులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని ఆయన అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన యువత పోరాటం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.5,000 నిరుద్యోగ భృతి అందిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యువతీ యువకుల సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని ఉద్యమాలు చేపడతామని డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి తెలిపారు.

### నూతన జిల్లా కమిటీ ఎన్నిక

ఈ సమావేశంలో ఎఐవైఎఫ్ హనుమకొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా నోముల కిశోర్ ను, జిల్లా కార్యదర్శి గా గిన్నారపు రోహిత్ ను, ఉపాధ్యక్షులుగా కేతపాక ప్రసాద్, పసునూరి సునీల్, మర్రి విజయ్ లను, సహాయ కార్యదర్శులుగా గుగులోత్ సురేష్, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు లను, కోశాధికారిగా తాటికంటి మమత లతో పాటు మొత్తం జిల్లా కమిటీ సభ్యులను 29 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు డాక్టర్ సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి అభినందనలు తెలియజేస్తూ, యువజన సమస్యల పరిష్కారం, ఉద్యోగాల భర్తీ, విద్యా-వైద్య రంగాల పరిరక్షణ కోసం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో మరింత విస్తృతమైన ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఎఐవైఎఫ్ మాజీ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మాస్కొ సుదీర్, ఎఐవైఎఫ్ నాయకులు తపాక ప్రసాద్, పసునూరి సునీల్, పెనుకుల మధు, పూజారి నరేందర్, కొత్తపల్లి శ్రీకాంత్, పల్లకొండ శ్రీకాంత్, మోతె సతీష్, తాటికంటి మమత, మనుకొండ శిరీష, బానోత్ శిరీష, నోముల వెన్నెల, కృష్ణవేణి, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో)29 ఆగస్టు : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. లికరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్,అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓ. లకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# అల్వాల్ జంక్షన్ అభివృద్ధి పనులకు వేగం..

- పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశం



మేడ్చల్ జిల్లా,ఆగస్టు 29(విజన్ ఆంధ్ర ప్రతినిధి): మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పౌర సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం అల్వాల్ సర్కిల్‌లో క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. సంబంధిత అధికారులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించి పారిశుద్ధ్యం, రహదారులు, కూడళ్ల అభివృద్ధి, ఆక్రమణలపై సమీక్షించారు. తిమ్స్ సమీపంలోని టీ కూడలి, రాజీవ్‌గాంధీ విగ్రహం కూడలి, ఏహెచ్‌డబ్ల్యూఓ కాలనీలోని టీ కూడలిని పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు, రహదారుల స్థితిగతులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతిపాదిత కూడళ్ల అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తిచేయాలని ఆదేశించారు. కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రహదారి స్థలాన్ని సమర్థంగా వినియోగించుకునేలా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఎత్తైన విద్యుత్ లైన్ల కింద రహదారి అభివృద్ధి ప్రతిపాదనను స్థాయీ సంఘం ఆమోదానికి సమర్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అల్వాల్ పరిధిలోని అన్ని చెత్త సేకరణ కేంద్రాల నుంచి ప్రతిరోజూ చెత్తను ఎలాంటి జాప్యం లేకుండా తరలించాలని పారిశుద్ధ్య సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి రోజువారీగా చెత్త సేకరణ జరిగేలా చూడాలని, క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రధాన కూడళ్లు, రహదారులపై వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉన్న ఆక్రమణలను గుర్తించి నిబంధనల ప్రకారం వెంటనే తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారులు ఎలాంటి అవరోధాలు లేకుండా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అల్వాల్ సర్కిల్‌లో పారిశుద్ధ్యం, రహదారులు, కూడళ్ల అభివృద్ధి, పౌర సదుపాయాల మెరుగుదలకు అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో వేగంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో ఉప కమిషనర్ భోగేశ్వర్లు, నిర్వహణ విభాగం అధికారులు, పట్టణ ప్రణాళిక అధికారులు, పారిశుద్ధ్య విభాగం అధికారులు, ఉద్యానవన విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రా చెరువులో చేపల మృత్యువాత..

- కెమికల్ నీటితోనే చనిపోయాయన్న అనుమానాలు..
- శాంపిళ్లు సేకరించిన హైడ్రా అధికారులు
- కలుషిత నీటిని వదిలిన కంపెనీలపై వెంటనే చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల డిమాండ్







బోడుప్పల్,ఆగస్టు 29(విజన్ ఆంధ్ర) : బోడుప్పల్ రా చెరువులో పెద్ద సంఖ్యలో చేపలు మృత్యువాత పడటం కలకలం రేపింది. చెరువులోకి కెమికల్ కలిసిన నీరు చేరడంతోనే చేపలు చనిపోయి ఉంటాయని స్థానికులు, మత్స్యకారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న హైడ్రా అధికారులు చెరువును పరిశీలించి, మృతి చెందిన చేపలు, చెరువులోని నీటి శాంపిళ్లను సేకరించారు. చెరువుకు సమీపంలోని పలు ప్రాంతాల నుంచి రసాయనాలతో కూడిన వ్యర్థ నీటిని అక్రమంగా వదులుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు. రసాయనాలు కలిసిన నీరు చెరువులోకి చేరడంతో చేపలు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన చేపల శాంపిళ్లతో పాటు నీటి నమూనాలను అధికారులు పరీక్షలకు పంపనున్నట్లు తెలిసింది. పరీక్షల నివేదిక ఆధారంగా చేపల మృతికి అసలు కారణం ఏమిటనేది తేలనుంది. మరోవైపు చెరువులోకి కలుషిత నీటిని వదులుతున్న సంస్థలు, పరిశ్రమలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు. కలుషిత నీటిపై నిఘా ఏదీ? చెరువుల్లోకి రసాయన వ్యర్థాలు చేరకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా కెమికల్ నీటిని చెరువులోకి వదిలినట్లు నిర్ధారణ అయితే సంబంధిత కంపెనీలపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గ్రామ అభివృద్ధి, పాఠశాలలు, పారిశుద్ధ్య పనులను పరిశీలన అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి.



రంగారెడ్డి జిల్లా బ్యూ రో, ఆగస్టు 29, ( విజన్ ఆంధ్ర ): శనివారం కొత్తూరు మండలం పెంజర్ల గ్రామ పంచాయతీలో జిల్లా అదనపు కలెక్టర్ ఎల్ బీ డాక్టర్ కె.కిరణ్మయి పర్యటించి గ్రామంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలోని పారిశుద్ధ్య నిర్వహణ, పల్లె ప్రకృతి వనం నర్సరీలను పరిశీలించి వాటి నిర్వహణపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పల్లె ప్రకృతి వనం, నర్సరీల్లో మొక్కల సంరక్షణ, వాటి పెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం లను సందర్శించి అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పిల్లలకు పౌష్టికాహారం, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ నిరంతరం కొనసాగించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 29(విజన్ఆంధ్ర) : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓ. లకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. , కామారెడ్డి జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ప్రతిమ సింగ్, మాట్లాడుతూ జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించి 1 లక్ష 84 వేల 742 నోటీసుల జనరేట్ చేయబడి 36 వేల 664 నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. 2102 నోటీసుల హియరింగ్ ప్రక్రియ పూర్తి చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియ నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ రవితేజ, కామారెడ్డి తహసిల్దార్ హిమబిందు, సూపరిడెంట్ రాజేశ్వర్. ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



హన్మకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 29 ( విజన్ ఆంధ్ర ) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి రాయపర్తి (వర్ధన్నపేట) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ రిపోర్టులు, రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఫార్మసీ మరియు ల్యాబొరేటరీలను పరిశీలించి, అవసరమైన సూచనలు చేశారు. తదనంతరం పల్లె దవాఖానల వైద్యాధికారులు ( ఎం ఎల్ హెచ్ పి లు) మరియు వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మరియు పల్లె దవాఖానల్లో ఓపీ శాతాన్ని మరింత పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజలకు స్థానికంగానే అవసరమైన వైద్య సేవలు అందేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఫార్మసీలో మందుల నిర్వహణలో ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ ( ఎఫ్ ఐ ఎఫ్ ఓ ) విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని, ఎక్స్‌పైరీ తేదీ సమీపంలో ఉన్న మందులను ముందుగా వినియోగించాలని సూచించారు. అన్ని అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా తగిన నిల్వలు నిర్వహించాలని ఆదేశించారు. ల్యాబొరేటరీలో సేకరించిన రక్త నమూనాలను నిర్దేశిత విధానంలో సక్రమంగా టి - హబ్బు డైగ్నోస్టిక్స్ కేంద్రానికి పంపించాలని సూచించారు. అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో నిర్దేశించిన కీలక పారామీటర్లలో పురోగతి సాధించాలని అన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు, కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని, ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించాలని సూచించారు. టీబీ వ్యాధిగ్రస్తులు, మధుమేహం మరియు రక్తపోటు ఉన్న రోగులకు అవసరమైన మందులు సక్రమంగా అందేలా చూడాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె దవాఖానలు మరియు ఏ ఏ ఎం కేంద్రాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, కలుపు మొక్కలు మరియు వ్యర్థ మొక్కలను స్వయంగా డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి గారు దగ్గరుండి తొలగింపజేసి, పరిసరాల పరిశుభ్రతపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఆర్. రాజమౌళి, స్థానిక వైద్యాధికారి డాక్టర్ అరుణ్ కుమార్, ఎంపీహెచ్ఈఓ సదానందం, ఎం ఎల్ ఎచ్ పి లు మరియు ఇతర వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వం


- ఏఐటీయూసీ రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయండి
- సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి
- ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ




హనుమకొండ జిల్లా ప్రతినిధి ఆగస్టు 29 ( విజన్ ఆంధ్ర ) : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి విమర్శించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏఐటియుసి రాష్ట్ర 4వ మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే 1920 అక్టోబర్ 31న ఏఐటియుసి ఆవిర్భవించిందని, నాటి నుంచి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే 'వ్యాపారం సులభతరం' పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడుతూ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకరణను నిలిపివేయాలని కోరారు. కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 6 నుంచి 8వ తేదీ వరకు కరీంనగర్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు, ఈ రాష్ట్ర మహాసభలను కార్మిక లోకం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శులు గుంటీ రాజేందర్, కర్రె బిక్షపతి, నాయకులు పూజారి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలి

- జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఎన్నికల ముఖ్య అధికారి సుదర్శన్ రెడ్డి
- కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా నోటీసుల పంపిణీనీ వేగవంతం చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై శనివారం ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల్లో మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్లకు నోటీసుల పంపిణీ, హియరింగ్ అంశాలపై అధికారులతో మాట్లాడారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారం తీసుకొని ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. సంబంధిత ఈఆర్వోలు, ఏఈఆర్వోలు తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితాలను రూపొందించేందుకు బూత్ లెవెల్ అధికారులకు తరచూ దిశా నిర్దేశం చేయాలన్నారు. గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, ఎన్నికల సంఘం నియమావళిని అనుసరించి ముందుకెళుతున్నట్లు చెప్పారు. విసి అనంతరం కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారులకు తగు సూచనలు చేశారు. నోటీసుల పంపిణీని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ గరిష్ట సంఖ్యలో నోటీసులను సంబంధిత ఓటర్లకు అందించి, తప్పనిసరిగా అక్నాలెడ్జ్‌మెంట్ పొందాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల వారీగా, మండలాల వారీగా ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షించాలని, పెండింగ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి మిగిలిన నోటీసుల పంపిణీని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆర్డీవో శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం అధికారి మంజుల, వివిధ మండలాల తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం మూడవ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి..

- వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూరుగుల నాగేందర్..



సూర్యాపేట ఆగస్టు 29:(విజన్ ఆంధ్ర) : తెలంగాణ మాదిగ జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12 హైదరాబాద్ బిసిసిఈ భవన్ లోనిర్వహించనున్న మూడవ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూరుగుల నాగేందర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాదిగ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో పాటు వృత్తిపరమైన హక్కులు, సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ఫోరం నిరంతరం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలోని మాదిగ జర్నలిస్టులందరూ ఐక్యంగా ముందుకు సాగుతూ మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వల్దాస్ ప్రవీణ్,రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి మామిడి శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షులు పల్లెటి నాగార్జున, కోశాధికారి కనుకు రవి, జిల్లా నాయకులు మామిడి శంకర్, దుర్గం బాలు, జాన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# హియరింగ్ నోటీసులు త్వరగా అందించాలి

- రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 29,(విజన్ ఆంధ్ర) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలు భాగంగా మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు హియరింగ్ నోటీసులు జారీ చేసి అవసరమైన ధృవపత్రాల స్వీకరణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి మాట్లాడుతూ మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు నోటీసులు వెంటనే అందించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి నోటీసులు జారీ చేసి సంబంధిత వ్యక్తుల నుండి రసీదు తీసుకోవాలని తెలిపారు. నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియల మధ్య నిర్ణీత గడువు ఉండాలని, సంబంధిత ఓటరు నుండి హియరింగ్ లో అవసరమైన ధృవపత్రాలు సేకరించాలని తెలిపారు. ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని, నోటీసులు తీసుకున్న వారికి అవసరమైన పత్రాలు సమర్పించడంపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ కె.హరిత, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో గల ఓటర్లు 1 లక్ష 5 వేల 829 మంది ఓటర్లకు నోటీసుల జారీకి చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటి వరకు 8 వేల 98 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులతో ఇంటింటికి వెళ్లి నోటీసులు అందజేసి, పోలింగ్ కేంద్రం పరిధిలోని గ్రామపంచాయతీ కార్యాలయాలలో హియరింగ్ నిర్వహించి అవసరమైన ధ్రువపత్రాలు స్వీకరించి బి.ఎల్.ఓ. యాప్ లో వివరాల నమోదుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఐఎం ఎమ్మెల్సీ రహ్మత్ సస్పెన్షన్

- ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని పార్టీ ఆదేశం

హైదరాబాద్,ఆగస్ట్29 : ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్ బేగ్‌పై పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన పార్టీ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేసినట్లు పార్టీ జాయింట్ సెక్రటరీ ఎస్ఏ హుస్సేన్ అన్వర్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. మిర్జా రహ్మత్ బేగ్ తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా పత్రాన్ని వెంటనే శాసన మండలి చైర్మన్‌కు సమర్పించాలని ఆదేశించారు. నాలుగు రోజుల క్రితం అత్తాపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారని రహ్మత్ బేగ్‌పై ఆరోపణలు వచ్చాయి. అయితే.. ఈ ఆరోపణలే పార్టీ నిర్ణయానికి కారణమని ఎంఐఎం అధికారికంగా వెల్లడించలేదు. ప్రస్తుతం ఆయనపై పార్టీ తీసుకున్న చర్య రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రైతుల నడ్డి విరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**- సబ్సిడీలకు కోత.. విద్యుత్ కనెక్షన్లకు రెట్టింపు భారం**

**- బీజేపీ జిల్లా నాయకుడు జమ్మూ రమేష్**



శాలీగౌరారం,ఆగస్ట్ 29(విజన్ ఆంధ్ర): రైతు ప్రభుత్వం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కారు.. రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని బీజేపీ జిల్లా నాయకుడు జమ్మూ రమేష్ ఆరోపించారు. ఓవైపు కరువు పరిస్థితులు నెలకొంటే.. మరోవైపు రైతులకు అందాల్సిన సబ్సిడీలను తగ్గించి ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు.డ్రిప్ ఇరిగేషన్‌కు గతంలో బీసీ రైతులకు 90 శాతం, ఎస్సీ రైతులకు 100 శాతం సబ్సిడీ ఉండేదని.. ప్రస్తుతం వాటిని వరుసగా 80, 90 శాతానికి తగ్గించారని తెలిపారు. రైతు భరోసా విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. రెండు పంటలకు రైతు భరోసా అందిస్తామని చెప్పి.. రైతులను మోసం చేసిందని విమర్శించారు. పేద రైతులు కొద్దిపాటి భూమి కొనుగోలు చేసుకునేందుకు సైతం రిజిస్ట్రేషన్ రుసుముల పెంపు అడ్డంకిగా మారిందన్నారు. గతంతో పోలిస్తే రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగడంతో సామాన్య రైతులు భూములు కొనుగోలు చేసే పరిస్థితి లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఇంటి విద్యుత్ మీటర్ మంజూరు రుసుము గతంలో సుమారు రూ.1,200 ఉండగా.. ప్రస్తుతం రూ.5 వేలకు పైగా పెంచారని ఆరోపించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరు రుసుము గతంలో రూ.5,600 ఉండగా.. ప్రస్తుతం రూ.10 వేలకు పైగా పెంచారని తెలిపారు. దీంతో చిన్న, సన్నకారు రైతులపై అదనపు భారం పడుతోందన్నారు.ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని విమర్శించారు. గతంలో మాదిరిగానే డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీలను బీసీలకు 90 శాతం, ఎస్సీలకు 100 శాతంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల రుసుములను కూడా గతంలో ఉన్న స్థాయికి తగ్గించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు బోడ రాజు, గోని గణేష్, రాచకొండ సందీప్, ఉడుగు రమేష్, రాచమల్ల శ్రీనివాస్, చిప్పలపల్లి అంజయ్య, కర్నాటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవలో అరుదైన గౌరవం.. దేవార వినోద్ స్వామికి డాక్టరేట్ ప్రదానం...

**- ప్రజా సేవే లక్ష్యం.. మానవత్వమే మార్గంగా కొనసాగుతున్న నిస్వార్థ సేవలకు గుర్తింపు...**





అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్ట్ 29:(విజన్ ఆంధ్ర) : ప్రజా సేవే లక్ష్యంగా, మానవత్వమే మార్గంగా ఎన్నో సంవత్సరాలుగా నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దేవార వినోద్ స్వామి కి అరుదైన గౌరవం దక్కింది. సామాజిక సేవా రంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో “డాక్టర్ ఆఫ్ సోషల్ సర్వీస్” గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. శనివారం పుదుచ్చేరిలోని కంబన్ కలైయరంగం ఆడిటోరియంలో నిర్వహించిన “సామాజిక నాయకులుదార్శనికుల సమ్మేళనం2026” కార్యక్రమంలో దేవార వినోద్ స్వామికి సామాజిక సేవలో గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ డైరెక్టర్, తమిళనాడు మాజీ న్యాయమూర్తి డాక్టర్ కె. వెంకటేశన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.ఆర్. శంపత్, ఐఏఎస్, ప్రపంచ శాంతి సంస్థ, ఐక్యరాజ్యసమితి ప్రతినిధి, ప్రపంచ బౌద్ధ సమాఖ్య అధ్యక్షులు రాయబారి డాక్టర్ పర్విందర్ సింగ్, అంతర్జాతీయ న్యాయవాది డాక్టర్ కావేటి శ్రీనివాసరావు, యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ పి. అమృతవల్లి, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కమిషనర్ డాక్టర్ కె. సుకుమార, చెన్నై మద్రాస్ హైకోర్టు మధ్యవర్తి డాక్టర్ ఎస్. సిద్ధార్థన్ తదితరులు పాల్గొన్నారు. ఆయన చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకున్న యూనివర్సిటీ ఎంపిక మండలి ఈ గౌరవానికి ఆమోదం తెలిపింది. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ దేవార వినోద్ స్వామి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు వేసవిలో మూడు నెలల పాటు అంబలి పంపిణీ, మంచినీటి పంపిణీ, పేదలు, వృద్ధులకు దుపట్ల పంపిణీ, యువతకు వాలి బాల్ & క్రికెట్ కిట్స్ పంపిణీ, గర్భిణి మహిళలకు పౌష్టిక ఆహారం, వస్త్రాలు, నిత్యావసర వస్తువుల పంపిణీ, అవసరమైన ఇళ్లు దగ్ధమైన వారికి, తల సీమియతో బాధపడేవారికి ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నారు. కరోనా విపత్కర సమయంలోనూ ప్రజలకు అండగా నిలిచి ప్రతి గ్రామంలో కొన్ని వేల కుటుంబాలకు నిత్యావసర సరుకులు, నిరుపేదలైన తల్లితండ్రులు లేని వారికి వారి సొంత ఖర్చుతో ఇప్పటివరకు 25 జంటలకు మంగళసూత్రాలు మట్టెలు అందజేసి ద్వారా వినోద్ స్వామి వీణ దంపతులు అతి చిన్న వయస్సులోనే కళ్ళు కడిగి కన్యాదానం చేసి, సారేగా వంట పాత్రలు, సరుకులు వస్త్రాలు అందజేశారు, కొన్ని వందల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు, ఉచిత చర్మ దంత పరీక్షలు, ఉచిత మందులు అందజేశారు, గ్రామంలో ఎవరు చనిపోయిన వారి కుటుంబానికి 5000/- రూపాయలు, సరుకులు అందించడం, ఇతర సహాయాలను అందించారు. యువతను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తూ “సేవే లక్ష్యం.. మానవత్వమే మార్గం” అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ఆధ్యాత్మిక సేవతో పాటు సామాజిక సేవకు ప్రాధాన్యం ఇస్తూ అన్నదానాలు, వైద్య సహాయం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. సామాజిక సేవకు గుర్తింపుగా దేవార వినోద్ స్వామికి గౌరవ డాక్టరేట్ లభించడం పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, యువత, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. పురస్కారాల కోసం కాకుండా ప్రజల కోసం చేసే సేవకే నిజమైన గౌరవం లభిస్తుందనే విషయాన్ని సేవా ప్రస్థానం నిరూపిస్తోందని పలువురు పేర్కొన్నారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 29,(విజన్ ఆంధ్ర) : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈ.ఆర్.ఓ లు, ఎ.ఈ.ఆర్.ఓ. లతో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నోటీసుల జారీ, పరిష్కార చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ నోటీసుల పంపిణీ వేగవంతం చేయాలని, ఫిర్యాదులు, అభ్యంతరాలపై నిర్దిష్ట గడువులో విచారణ చేపట్టాలని, సంబంధిత రికార్డుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. నోటీసుల పంపిణీ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న అన్ని నోటీసులను సంబంధిత వ్యక్తులకు తప్పనిసరిగా అందజేయాలని, నోటీసులు అందజేసిన రోజు నుండి 7 రోజుల గడువు పూర్తయిన అనంతరం విచారణ నిర్వహించాలని సూచించారు. అనామలీస్/నో మ్యాపింగ్ జాబితాను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ఏజెంట్లకు అందుబాటులో ఉంచాలని, సంబంధిత వ్యక్తులు క్లెయిమ్స్, అభ్యంతరాల సందర్భంగా సమర్పించాల్సిన పత్రాలు, ఆధారాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రస్తుత స్థితిని రోజువారీ ప్రాతిపదికన నోటీస్ బోర్డుపై నవీకరించాలని, ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ, నిర్దేశిత గడువులో పనులను పూర్తి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కార ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు. ప్రక్రియ కొరకు నియమించిన ఎ.ఈ.ఆర్.ఓ. లకు అవసరమైన శిక్షణ అందించాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వేగవంతానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...**

జిల్లాలో అనామోలీస్, మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించి 1 లక్ష 70 వేల 967 నోటీసుల జనరేట్ చేయబడి 32 వేల 183 నోటీసులు జారీ చేసి యాప్ లో వివరాలు నవీకరించడం జరిగిందని తెలిపారు. 394 నోటీసుల హియరింగ్ ప్రక్రియ పూర్తి చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియ నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, అన్ని మండలాల తహసిల్దార్లు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జలసిరి, ఇందిరమ్మ ఇండ్ల పనులు పకడ్బందీగా చేపట్టాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 29,(విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వం చేపట్టిన జలసిరి, ఇందిరమ్మ ఇండ్ల పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శనివారం జిల్లాలోని జైపూర్ మండలం కుందారం గ్రామ పంచాయతీలో జలసిరి కార్యక్రమంలో భాగంగా కొనసాగుతున్న పంట కుంట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ నీటిమట్టాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలసిరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పంట కుంట పనులలో పాటించాల్సిన జాగ్రత్తలు, పనుల పురోగతి అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలోని వివిధ రిజిస్టర్లు, రికార్డులతో పాటు ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించి, ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన వ్యక్తులు సంబంధిత స్థాయి అధికారులను సంప్రదించి అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఎ.పి.ఓ., పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, టి.ఎ., క్షేత్రస్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సినిమా రంగంలో ప్రముఖ ఫోక్ స్టార్ కిట్టు పవన్ ఎంట్రీ

**- యం.యస్ వారాహి, శివమ్ మీడియా పతాకాలు నిర్మిస్తున్న సినిమాలో ప్రముఖ ఫోక్ స్టార్ కిట్టు పవన్**





రంగారెడ్డి/హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): తెలంగాణా మట్టి వాసనలతో సంచలనమైన జానపద పాటలతో వందల మిలియన్ల వ్యూస్ సాధించి ప్రేక్షకులకు దగ్గరైన కిట్టు హీరోగా శనివారం సినిమా ప్రారంభమైంది. యం.యస్ వారాహి క్రియేషన్స్ , శివమ్ మీడియా పతాకంపై ప్రొడక్షన్ నెంబర్ 3గా ముని శివ, శివమల్లాలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకుడు దిలీప్ సాయి నాయక్. మాదాపూర్ శివమ్ మీడియా కార్యాలయంలో చిత్రం వైభవంగా ప్రారంభమైంది. ఈ సినిమా ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ రచయిత ఆస్కార్ అవార్డు విన్నర్ చంద్రబోస్, దర్శకుడు ఆర్.పి పట్నాయక్, నేషనల్ అవార్డు విన్నర్ సతీష్ వేగేశ్న, బిగ్ టీవి చైర్మెన్ విజయ్ వెన్నం పాల్గొన్నారు. దర్శకుడు దిలీప్‌కి స్క్రిప్టని సతీష్ వేగేశ్న, బుల్లెట్‌బండి లక్ష్మణ్ అందించగా హీరో కిట్టుపై చంద్రబోస్ క్లాప్ నిచ్చారు. ఆర్ పి పట్నాయక్ తొలిషాట్‌కి గౌరవ దర్శకత్వం వహించగా బిగ్ టీవి విజయ్ కెమెరా స్విచాన్ చేసి టీమ్‌కి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ.. ఈ టీమ్ గురించి నాకు చాలా బాగా తెలుసునని, టీమంతా ఎంతో టాలెంట్ ఉన్నవారన్నారు. నిర్మాతలు ముని శివ, శివమల్లాలల, బుల్లెట్‌బండి లక్ష్మణ్, సంగీత దర్శకుడు మదిన్ నాకు ఎంతో ఆత్మీయులు. వారందరూ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటునన్నారు. అనంతరం సతీష్ వేగేశ్న మాట్లాడుతూ.. మంచికథతో వచ్చిన దర్శకుడు దిలీప్‌కి మా శివలిద్దరూ ఎంతో సపోర్ట్ చేస్తున్నారు. వీరందరికి పెద్ద విజయం రావాలని కోరుకుంటునన్నారు. ఈ సందర్భంగా ఆర్‌పి పట్నాయక్ మాట్లాడుతూ.. ఈ నిర్మాతలిద్దరూ మంచి సినిమాలు చేసి పెద్ద నిర్మాతలుగా మారి పదులకొద్ది సినిమాలు తీయాలని కోరుకుంటునన్నారు. హీరో కిట్టు మాట్లాడుతూ.. నేను చాలా చిన్న నటునిగా ఫోక్ సాంగ్స్ చేసేవాడినని, అలాంటిది నేను చేస్తున్న ఈ సినిమాకి ఇంత పెద్దవాళ్లు వచ్చి సపోర్టు చేయటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు మదిన్, కెమెరామెన్ జనతా బబ్లూ, నూతన దర్శకుడు కృష్ణకాంత్, ఫోక్ ఇండస్ట్రినుండి అనేకమంది కళాకారులు పాల్గొన్నారు.

# విద్యార్థి చదువుకు అండగా “సర్వ్ ఫర్ నీడీ ఫౌండేషన్“

**- బొల్లం స్వరాజ్యలక్ష్మి జన్మదిన సందర్భంగా బీటెక్ విద్యార్థికి రూ.15,000 ఆర్థిక సహాయం**



రంగారెడ్డి/హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): సమాజంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, అవసరంలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సర్వ్ ఫర్ నీడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరో అభినందనీయమైన సేవా కార్యక్రమం జరిగింది. బొల్లం స్వరాజ్యలక్ష్మి జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థి విద్యాభ్యాసానికి ఆర్థిక సహాయం అందించారు. బీటెక్ విద్యను అభ్యసిస్తున్న పి నాగసాయి మణికంఠ చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో డాక్టర్ బొల్లం రాజేష్ రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. విద్యార్థి ఉన్నత విద్యను కొనసాగించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలనే లక్ష్యంతో ఈ సహాయం చేయడం జరిగిందని తెలిపారు.ఈ సందర్భంగా సర్వ్ ఫర్ నీడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రవీణ్ మాట్లాడుతూ... ఆర్థిక పరిస్థితులు కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువును మధ్యలోనే ఆపకూడదన్నదే తమ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో ఉన్న విద్యార్థులను గుర్తించి, వారి విద్యకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.అవసరంలో ఉన్నవారికి చేయూతనివ్వడం, విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవడం మా ఫౌండేషన్ ప్రధాన ఉద్దేశమని తెలియజేశారు. ఒక విద్యార్థి చదువు కొనసాగితే అది ఒక్క కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా ఉపయోగపడుతుందిని ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రవీణ్ పేర్కొన్నారు. బొల్లం స్వరాజ్యలక్ష్మి జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా ఒక విద్యార్థి భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా జరుపుకోవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించి, పేద విద్యార్థులకు విద్యా సహాయం, అవసరమైన వారికి ఆర్థిక చేయూత అందేలా సర్వ్ ఫర్ నీడీ ఫౌండేషన్ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యార్థి కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొని డా. బొల్లం రాజేష్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# కామారెడ్డి పురపాలక సంఘ అత్యవసర సమావేశం

**- ప్రతి వార్డుకు రూ.6 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు**


**- అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్. వై. గిరి.**



కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 29(విజన్ఆంధ్ర) : కామారెడ్డి, పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పురపాలక సంఘ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్. వై. గిరి సూచించారు. శనివారం కామారెడ్డి పురపాలక సంఘ సమావేశ మందిరంలో ఆగస్ట్ నెలకు సంబంధించిన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘం చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, వైస్ చైర్మన్ కాసర్ల గోదావరి, అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొత్తం 9 ఎజెండా అంశాలను కౌన్సిల్ సభ్యుల ముందుంచి చర్చించారు.ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పురపాలక సంఘానికి సంబంధించిన వివిధ అంశాలపై సభ్యులు చర్చించారు. ఎజెండాలో ప్రతిపాదించిన 9 అంశాలకు కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.అత్యవసర సమావేశంలో భాగంగా కామారెడ్డి పురపాలక సంఘంలోని ప్రతి వార్డుకు రూ.6 లక్షల చొప్పున అభివృద్ధి నిధులు కేటాయించి, ఆయా వార్డుల్లో అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనను ప్రవేశపెట్టగా, కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ ఎన్. వై. గిరి మాట్లాడుతూ, పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టాలని అన్నారు. వార్డుల వారీగా ప్రజల అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పురపాలక సంఘ కమిషనర్, కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, డిప్యూటీ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# “తెలుగు పలుకు-తరతరాల వెలుగు“ తెలుగు భాషా దినోత్సవం

**-వనస్థలిపురం వాసి సిహెచ్ విఆర్కే మూర్తికి ప్రశంసపత్రం**




ఎల్బీనగర్ ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): విశ్వ సాహితీ కళావేదిక“తెలుగు పలుకుతరతరాల వెలుగు” తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కవితా పోటీలు ఆద్యాంతం ఆసక్తి రేపించాయి. తెలుగు భాష పట్ల కవుల ప్రేమాభిమానాలకు, సాహిత్య సృజనకు అద్దం పట్టేలా“తెలుగు పలుకు తరతరాల వెలుగు”కవితా పోటీలలో ఎంతోమంది ప్రముఖులు హాజరయ్యారు. విశ్వ సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కవితా పోటీలో దాదాపు 400 మంది కవులు ఉత్సాహంగా పాల్గొని తమ అద్భుతమైన కవితా ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రూప్‌లో ప్రతిభ కనబరిచిన టాప్ 20 విజేతలను ఎంపిక చేసి ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా 5వ గ్రూప్ టాప్ 20 విజేతలుగా ఇరువంటి నాగదుర్గ మాధురి దేవి, టీవీఏ శర్మ, సిహెచ్ వి ఆర్ కె మూర్తి, కాదంబరి శ్రీనివాసరావు, పండిట్ గగనం శ్రీనుకుమార్, ర్యాలీ నాగేంద్రరావు, జుట్టు రాజశేఖర్, అద్దంకి వీరాంజనేయులు, బెస్త రవికుమార్, పరిమి వెంకట సత్యమూర్తి,గాదిరాజు హేమ లక్ష్మీనారాయణ, కరణం పద్మజ, వల్లూరి విద్యారాణి, శ్రావణ్ కుమార్, సిరిపురపు నాగలక్ష్మి, శ్రీ కృష్ణ మాదవి, వి. ఎస్.శాస్త్రి, డా పెరుకరాజు, వడ్లమాను మురళి మోహన్, డా. సుధా చంద్ర దొడ్డపనేనిలు విజేతలుగా నిలిచారని నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా సిహెచ్ విఆర్కే మూర్తి మాట్లాడుతూ.. ఈ గ్రూప్‌లో టాప్ 20 విజేతలుగా నిలిచిన కవులందరికీ విశ్వ సాహితీ కళావేదిక తరఫున హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారన్నారు. మీ అక్షర ప్రయాణం మరింత విజయవంతంగా సాగాలని, మీ కలం నుంచి మరెన్నో అద్భుతమైన సాహితీ సుమాలు విరబూయాలని ఆకాంక్షిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రశంసా పత్రం మరింత బాధ్యతను పెంచిందని, ముమ్ముందు కూడా ఉత్సాహంగా పాల్గొంటారని ఆయన తెలిపారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలు చెందిన పుర ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# మేయర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ ఆగస్టు29:(విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ నగరంలో మేయర్ కూరగాయల ఉమారాణి తల్లి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ శనివారం కసాబ్ గల్లీ లో గల స్వగృహంలో పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ తో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, మనో ధైర్యాన్ని ఇచ్చారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, మఠం పవన్, పసునూరి రాము, జగదీష్ కులకర్ణి, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# సనాతనధర్మంలో శ్రావణ మాసానికి గొప్పవిశిష్టతఉంది.



ఊట్కూర్, ఆగస్టు 29 ( విజన్ ఆంధ్ర) : సనాతన ధర్మంలో శ్రావణ పౌర్ణమి శ్రావణమాసానికి విశిష్టమైన ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రాధాన్యత ఉందని టిటిడి ఉపన్యాసకులు దొరోల్ల కృష్ణయ్య అన్నారు. శనివారం ఊట్కూర్ మండల పరిధిలోని బిజ్వార్ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో మన గుడి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,శ్రావణ పౌర్ణమి రోజు రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల ప్రేమానుబంధానికి రక్షణకు ప్రతీకగా ప్రతి ఒక్కరు జరుపుకుంటారని అన్నారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు నేను నీకు రక్ష నువ్వు నాకు రక్ష మనిద్దరం దేశానికి ,హిందూ ధర్మానికి రక్షా అని రాఖీ కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుతారని అన్నారు.బ్రాహ్మణులు ఈ రోజున నూతన యజ్ఞోపవీతం ధరించి వేదాధయన్నాని తిరిగి ప్రారంభించే ఉపాకర్మ ను ఈ జంధ్యాల పౌర్ణమి గా జరుపుకుంటారని తెలిపారు. ఈ పవిత్ర దినాన శివపార్వతులను శ్రీమహావిష్ణువును , లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే అన్ని విఘ్నాల తొలగి సకల సంపదలు, ఆయురారోగ్యాలు లభిస్తాయని అన్నారు.హిందుత్వం అనేది మతం కాదని అది కేవలం ధర్మం మాత్రమే అన్నారు. ప్రతి ఒక్కరూ దేశంపై , హిందూ ధర్మంపై ప్రేమ కలిగి ఉండాలని కోరారు. దేశానికి, ధర్మానికి ఆపద వస్తే అది తనకే వచ్చిందిగా భావించి ఆ యొక్క ఆపద తీర్చడం కోసం సర్వస్వాన్ని అర్పించడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశము, హిందూ ధర్మం బాగున్నప్పుడే అందరం బాగుంటామని తెలిపారు. లోక కళ్యాణం కోసం మంచి పనులు చేయాలని సూచించారు. గ్రామాలలోని శిథిలావస్థలో ఉన్నటువంటి గుడిలను బాగు చేసుకుని ధూప దీప నైవేద్యాలు జరిగే విధంగా చూడాలని అన్నారు. వారంలో ఒక రోజు ఆ యొక్క దేవాలయంలో భజన నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం వలన జాతీయ సామరసత మరియు ఐక్యమత్యం పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సుధాకర్ రెడ్డి, హెచ్.నర్సింహా, రామాంజనేయులు, దత్తప్ప, వెంకప్ప గౌడ్, వెంకటప్ప, శ్రీనివాసులు, శివారెడ్డి ,అశోక్ రెడ్డి, నరసింహా రెడ్డి, రామలింగం గౌడ్, ఉప్పు కృష్ణయ్య, ఉప్పు రాఘవేంద్ర, మంగలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ఓబీసీ కమిటీలను పునర్నిర్మించి పార్టీని మరింత పటిష్టం చేస్తాం.


**- డీసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి.**



నారాయణపేట,ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో (సీవీఆర్ భవన్) జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అధ్యక్షతన శనివారం ఓబీసీ కమిటీల పునర్నిర్మాణం,పార్టీ సంస్థాగత బలోపేతంపై సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టిపిసిసి పరిశీలకులు కోట్ల చంద్రయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ,ఓబీసీ కమిటీలను పునర్నిర్మించి పార్టీని మరింత పటిష్టం చేస్తామని అన్నారు. గ్రామస్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు,ఓబీసీ వర్గాలను కాంగ్రెస్ పార్టీతో మరింత అనుసంధానం చేసి పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఓబీసీ కమిటీలను పునర్నిర్మించడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.జిల్లా ఓబీసీ చైర్మన్‌తో పాటు మండల, టౌన్ ఓబీసీ అధ్యక్షుల నియామకాలు,మండల, గ్రామ,టౌన్ కమిటీల ఏర్పాటు,అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ఓబీసీ కమిటీల పునర్నిర్మాణంపై సమీక్షించారు.పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులు,కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తూ,అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం ఉండేలా కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా అధ్యక్షులు మండల అధ్యక్షులకు సూచించారు. జిల్లా,రాష్ట్రస్థాయి ఓబీసీ కమిటీలలో నియమించాల్సిన అర్హులైన నాయకుల పేర్లను సేకరించి పార్టీ అధిష్ఠానానికి ప్రతిపాదించాలని అన్నారు.పటిష్టమైన ఓబీసీ కమిటీల నిర్మాణం ద్వారా పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, ప్రజా సమస్యలపై సమర్థవంతంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం, ఓబీసీ జిల్లా అధ్యక్షులు గొల్ల కృష్ణయ్య, మాజీ మండల అధ్యక్షుడు కె. నరహరి, దామరగిద్ద మండల అధ్యక్షుడు బర్ల హన్మంతు,కృష్ణయ్య, సుభాష్ గౌడ్,జత్రం లక్ష్మయ్య గౌడ్,వెంకట్రాములు, రవికుమార్ చారి,బండి. అనంద్,తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ లేబర్ సెల్ కన్వీనర్‌గా దాసరి మహేష్ యాదవ్

**- రాష్ట్ర కన్వీనర్ అందే శ్రీనివాస్ చేతుల మీదుగా నియామక పత్రం స్వీకరణ**



బోడుప్పల్,ఆగస్టు 29(విజన్ ఆంధ్ర): భారతీయ జనతా పార్టీ మేడ్చల్ రూరల్ జిల్లా లేబర్ సెల్ కన్వీనర్‌గా దాసరి మహేష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర లేబర్ సెల్ రాష్ట్ర కన్వీనర్ అందే శ్రీనివాస్ చేతుల మీదుగా శనివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన బీజేపీ మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్‌కు దాసరి మహేష్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొనె శ్రీనివాస్, రాష్ట్ర సీనియర్ నాయకులు ఏనుగు లక్ష్మయ్య,జిల్లా ఎండోమెంట్ కన్వీనర్ ఆదిమూలం కరుణాకర్,బోడుప్పల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు తలారి రవి యాదవ్, సీనియర్ నాయకులు వేమునూరు మురళీధర్, ఎస్ఎం ప్రగతి, భానుకుంట వేణుగోపాల్, గొల్లపూడి శ్రీనివాస్, తూప్పత్ ఆనంద్, లీలావతి, ఆదిమూలం రమాదేవి, రజకుమారి, బొడ్డు సంధ్య, కాంతారెడ్డి, బజ్జూరి శ్రీనివాస్, చంచల శివకుమార్, ఆర్. వేణుగోపాల్, బీజేవైఎం జనరల్ సెక్రెటరీ ధర్మపురి అరవింద్, నరేందర్ రెడ్డి, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయంలో రైతుల ఆదాయం పెంచేలా ఆధునిక సాంకేతికతను విస్తృతం చేయాలి

**- కేవీకే పరిశోధనా కేంద్రం రైతులకు సాంకేతిక వారధిగా నిలవాలి,**

**- డ్రోన్ టెక్నాలజీపై రైతులకు విస్తృత శిక్షణ ఇవ్వాలి,**

**- కేవీకే, పాలెం సందర్శనలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర), ఆగస్టు 29 : రైతుల ఆర్థికాభివృద్ధి, వ్యవసాయ ఉత్పాదకత పెంపే లక్ష్యంగా శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువచేయాలనినాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న నూతన సాంకేతిక మార్పులను క్షేత్రస్థాయిలో రైతులు వినియోగించుకునేలా కేవీకే పరిశోధనా కేంద్రం మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు.శనివారం బిజినపల్లి మండలం పాలెంలోని వ్యవసాయ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)ను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే కార్యకలాపాలు, రైతులకు అందిస్తున్న సేవలు, శిక్షణ కార్యక్రమాలు, వ్యవసాయ సాంకేతికతల ప్రదర్శనలతో పాటు ఇన్‌స్ట్రక్షనల్ ఫారంలో కొనసాగుతున్న వివిధ యూనిట్లను ఆయన పరిశీలించారు.కేవీకే సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ డా. ఓ. శైల జిల్లా కలెక్టర్‌కు కేవీకే లక్ష్యాలు, విధులు, రైతుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. రైతు క్షేత్ర పరీక్షలు (రాఖీం), శిక్షణ కార్యక్రమాలు, వ్యవసాయ సలహా సేవలు, సాంకేతిక పరిజ్ఞాన విస్తరణ, క్షేత్ర ప్రదర్శనలు తదితర కార్యక్రమాల ద్వారా రైతులకు ఆధునిక సాగు విధానాలను పరిచయం చేస్తున్నట్లు ఆమె కలెక్టర్కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ.... కేవీకే ద్వారా రైతులకు అందుతున్న సాంకేతిక సేవలు రైతుల వాస్తవ అవసరాలకు అనుగుణంగా, ఫలితాలు కనిపించే విధంగా ఉండాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో రైతులతో నిరంతరం అనుసంధానమై, వారి సమస్యలను గుర్తించి శాస్త్రీయ పరిష్కారాలను అందించాలని అన్నారు. రైతులు కేవలం సంప్రదాయ పంటలపైనే ఆధారపడకుండా, మార్కెట్ డిమాండ్, నేల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణ చేపట్టేలా ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. తక్కువ పెట్టుబడి, తక్కువ వనరులతో మెరుగైన దిగుబడులు సాధించడంతో పాటు అదనపు ఆదాయం పొందే అవకాశాలపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను కేవలం ప్రదర్శనలకు పరిమితం చేయకుండా, వాటి ఆర్థిక ప్రయోజనాలు, పెట్టుబడి-ఆదాయ నిష్పత్తి, రైతులకు కలిగే లాభాలను స్పష్టంగా వివరించి, ఆచరణలోకి తీసుకువచ్చేలా కేవీకే కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కేవీకే ఇన్‌స్ట్రక్షనల్ ఫారంను సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన విత్తన శుద్ధి యూనిట్, షేడ్‌నెట్ నర్సరీ ఉత్పత్తి యూనిట్, వర్మీకంపోస్ట్ యూనిట్, పందిరి కూరగాయల సాగు, డ్రాగన్ ఫ్రూట్ ప్రదర్శన యూనిట్‌తో పాటు వివిధ పంటలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలకు సంబంధించిన ప్రదర్శన యూనిట్లను పరిశీలించారు. ప్రతి యూనిట్ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయా సాంకేతికతలను రైతులు తమ పొలాల్లో అమలు చేస్తే వచ్చే పెట్టుబడి, నిర్వహణ వ్యయం, దిగుబడి, మార్కెట్ అవకాశాలు, ఆదాయంపై వివరాలు తెలుసుకున్నారు. రైతులకు అధిక ఆదాయం అందించే ప్రత్యామ్నాయ పంటలు, అధిక విలువ కలిగిన పంటలు, ఆధునిక సాగు విధానాలను ప్రోత్సహించాలని అన్నారు. పంటల వైవిధ్యీకరణతో రైతులు ఒకే పంటపై ఆధారపడే పరిస్థితిని తగ్గించడంతో పాటు, వ్యవసాయంలో స్థిరమైన ఆదాయ మార్గాలను అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. వ్యవసాయ ఉత్పాదకతలో నాణ్యమైన విత్తనాలు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ అన్నారు. కేవీకే, పాలెం ఆధ్వర్యంలో నాణ్యమైన విత్తనోత్పత్తి, విత్తన వ్యవస్థాపకతకు సంబంధించిన కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాల లభ్యతతో పాటు విత్తన శుద్ధి, విత్తన ఉత్పత్తి, నిల్వ, వినియోగ పద్ధతులపై శిక్షణ అందించాలని అన్నారు. విత్తనోత్పత్తిని రైతులకు ఒక అదనపు ఆదాయ మార్గంగా అభివృద్ధి చేసే అవకాశాలను కూడా పరిశీలించాలని కేవీకే అధికారులకు సూచించారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ సాంకేతికత వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో కూడా దీనిని విస్తృతంగా ప్రోత్సహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వ్యవసాయ కార్యకలాపాల్లో డ్రోన్లను సమర్థవంతంగా, సురక్షితంగా వినియోగించే విధానంపై రైతులకు శిక్షణ ఇవ్వాలని కేవీకేను ఆదేశించారు. పంటలకు అవసరమైన ద్రావణాలు, పురుగుమందులు తదితరాలను పిచికారీ చేసే సమయంలో డ్రోన్ టెక్నాలజీని ఎలా ఉపయోగించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పించాలని సూచించారు. డ్రోన్ వినియోగం వల్ల వ్యవసాయ పనుల్లో సమయం, శ్రమను ఆదా చేసుకోవడంతో పాటు సాంకేతికత ఆధారిత వ్యవసాయాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం కేవీకే ఆధ్వర్యంలో ప్రత్యక్ష ప్రదర్శనలు, శిక్షణ శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని రైతుల అవసరాలు, స్థానిక వ్యవసాయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేవీకే మరిన్ని వినూత్న కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. నూతన ప్రాజెక్టు ప్రతిపాదనలు రూపొందించి, రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరే కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. రైతుల సమస్యలను కేవలం గుర్తించడం మాత్రమే కాకుండా, వాటికి శాస్త్రీయ పరిష్కారాలను అందించి వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలో చూపించాలని అన్నారు. కేవీకేలో ప్రదర్శిస్తున్న సాంకేతికతలు మరింత మంది రైతులకు చేరేలా విస్తరణ కార్యక్రమాలను బలోపేతం చేయాలని కోరారు. కేవీకే, పాలెం ఆధ్వర్యంలో రైతుల కోసం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ అభినందించారు. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో కేవీకే కీలక పాత్ర పోషిస్తోందని, రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాల అమలులో జిల్లా యంత్రాంగం నుంచి పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ సందర్శన కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బందికి ఎంతో ప్రోత్సాహాన్ని అందించిందని, జిల్లా రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో మరింత విస్తృతంగా సాంకేతిక సేవలు, శిక్షణ కార్యక్రమాలు అందించేందుకు జిల్లా కలెక్టర్ సూచనలు మార్గదర్శకంగా నిలుస్తాయని కేవీకే సీనియర్ సైంటిస్ట్ అండ్ హెడ్ డా. ఓ. శైల తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట కె వి కె సిబ్బంది ఇతర శాస్త్రవేత్తలు తదితరులు ఉన్నారు.

# భూ సేకరణ ప్రక్రియ వేగవంతం కావాలి

**- అవార్డు పూర్తయిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ**

**- అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి**

**- సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్, గద్వాల ఎమ్మెల్యే**



గద్వాల ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జిల్లాలో పురోగతిలో ఉన్న వివిధ సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని, అవార్డు పూర్తయిన రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ నిర్మాణానికి ఇంకా అవసరమైన భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాజెక్టుల వారీగా వివిధ మండలాల పరిధిలో సేకరించాల్సిన భూములపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి పారుదల, రెవిన్యూ, భూ సేకరణ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతిన పూర్తి అయ్యేందుకు సహకరించాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించినప్పటికీ జిల్లాలో వివిధ రిజర్వాయర్ల పరిధిలో కొంతమంది రైతులు వరి సాగు చేయడం జరిగిందన్నారు. జూరాల కుడి కాలువ పరిధిలో ఉన్న చివరి డిస్ట్రిబ్యూటర్స్ వరకు నీటి సరఫరాపై సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పష్టతతో ఉండాలన్నారు. పంట చేతికి వచ్చేవరకు రైతులు నష్టపోకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసే వరకు అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అవ్వకుండా ముందుకెళ్లాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రాజెక్టుల భూసేకరణకు ఉన్న అన్ని అడ్డంకులను అధిగమించి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళున్నామన్నారు. సంబంధిత శాఖల అధికారులు నిబద్ధతతో పనిచేసి నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలోని వివిధ ప్యాకేజీల్లో ఇంకా చేయాల్సిన భూసేకరణను వేగవంతం చేయాల్సి ఉందన్నారు. గట్టు ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ కూడా వేగవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో జూరాల ప్రాజెక్టుకే కొద్ది రోజులుగా నిరంతరం ఇన్ఫ్లో ఉండడం వలన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ద్వారా పలు రిజర్వాయర్లను నింపుకోవడం జరుగుతుందన్నారు. జూరాల కుడి కాలువతో పాటు వివిధ రిజర్వాయర్ల పరిధిలో కొందరు రైతులు తమ పొలాల్లో వరి సాగు చేసినప్పటికీ సరైన ప్రణాళికను అవలంబిస్తే పంటలు చేతికొచ్చే వరకు సాగునీరు అందించవచ్చుని అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు చిత్తశుద్ధితో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కొన్నేళ్లుగా జిల్లాలోని రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విజయవంతంగా ఖరీఫ్, రబీ సీజన్లను నిర్వహించుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నప్పటికీ జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలాశయాల నుంచి వరద రావడంతో జిల్లాకు మేలు జరుగుతోందన్నారు. రైతులు ఆరుతడి పంటలతోనూ ప్రయోజనం పొందేలా ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం అవగాహన కల్పించడం జరిగిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఇరిగేషన్ సిఈ రహీముద్దీన్, ఎస్ఈ కేశవరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, పలు మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకం

**- అదనపు కలెక్టర్ విక్టర్**




కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 29(విజన్ఆంధ్ర) : మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని శనివారం దోమకొండ కోటలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దోమకొండ విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ, మేజర్ ధ్యాన్‌చంద్ దేశానికి అందించిన క్రీడా సేవలు, ఆయన సాధించిన విజయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని, క్రమశిక్షణను, పట్టుదలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.యువతలో క్రీడా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువత తమలోని క్రీడా ప్రతిభను వెలికితీసుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం క్రీడలకు కేటాయించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.అనంతరం మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, యువతీ యువకులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేసి సత్కరించారు.ఈ కార్యక్రమంలో దోమకొండ ట్రస్ట్ ప్రతినిధి కామినేని అనిల్, జిల్లా యువజన మరియు క్రీడల అధికారి రంగ వెంకటేశ్వర్ గౌడ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి షేక్ సలాం, సర్పంచ్ ఐరేని నరసయ్య, మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, దోమకొండ కోట మేనేజర్ బాబ్జీ, గణేష్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, యువతీ యువకులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపకార వేతనాల దరఖాస్తులకు ఆహ్వానం

**- 2026-27 విద్యా సంవత్సరం**

**బీడీ, సినీ కార్మికుల పిల్లలకు సువర్ణ అవకాశం**



రంగారెడ్డి/హైదరాబాద్ సిటీ బ్యూరో, ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర): కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం అందించే బీడీ, సినీ కార్మికుల పిల్లలకు ప్రోత్సాహక ఉపకార వేతనాలకు కేంద్ర కార్మిక, మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సినీ కార్మిక సంక్షేమ వైద్యశాల వైద్యాధికారిణి డాక్టర్ పి. సింధూర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ పి. సింధూర మాట్లాడుతూ... 2026-27 విద్యా సంవత్సరానికి చెందిన ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పై అవకాశాన్ని ఉపయోగించుకోవాలని అన్నారు. ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు ఆగస్టు 31వ తేదీలోగా, అలాగే పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి ఇంటర్మీడియట్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు చదువుతున్న విద్యార్థులందరూ అక్టోబర్ 31వ తేదీ లోపు దరఖాస్తులు ఆన్లైన్ లో సూచించారు. సినీ విద్యార్థుల కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ. 1,00,000 రూపాయల నుంచి రూ. 2,52,000 పెంచినట్లు తెలిపారు. అర్హులైన సినీ కార్మికుల పిల్లలకు ఆధార్ కార్డు అనుసంధానం ఉన్న బ్యాంకు ఖాతా ( ఎన్ పి సి ఐ సీడెడ్, డి బి టి ఎనబ్లెడ్) ఉండాల్సిందని అన్నారు. నేషనల్ స్కాలర్ షిప్ ఆన్లైన్ పోర్టల్ లో సందర్శించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహ ఉపకార వేతనాలకు అర్హులైన విద్యార్థిని విద్యార్థులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# నివాభూప సంస్థ ద్వారా ఉచిత ఆరోగ్య క్యాంప్ ముందస్తు రోగాలను నివారించుకోవచ్చు




సిద్దిపేట జిల్లా ప్రతినిధి 29,(విజన్ ఆంధ్ర/ : సిద్దిపేట జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్లో ఏర్పాటుచేసిన విలేకరులసమావేశంలోముందస్తు వైద్య పరీక్షలతో వ్యాధులను గుర్తించి నయం చేసుకోవచ్చునివా బుపా ఆరోగ్య బీమా సంస్థ సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లుసిద్దిపేట: ముందుగా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక రకాల వ్యాధులను తొలిదశలోనే గుర్తించి, సరైన చికిత్సతో నయం చేసుకోవచ్చని నివా బుపా సిద్దిపేట బ్రాంచ్ మేనేజర్ వెంకటేశ్వర్లు తెలిపారు.సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31వ తేదీ సోమవారం సిద్దిపేట పట్టణంలోని తమ కార్యాలయంలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలునిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తామని పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని యాక్సిస్ బ్యాంక్ పైన ఉన్న నివా బుపా ఆరోగ్య బీమా కార్యాలయంలో ఈ హెల్త్ క్యాంప్నిర్వహించనున్నట్లు తెలిపారు.సిద్దిపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో నివా బుపా ఆ సిబ్బంది సామ్యూల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో 100% విద్యార్థుల హాజరే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి

**- జిల్లా కలెక్టర్ కె .హరిత...**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 29:(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరూ 100% శాతం బడికి వచ్చేలా ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శనివారం దహేగాం మండలంలోని చిన్న రాష్పల్లి గ్రామంలో ఉన్న ఎం.పి.పి.ఎస్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, టాయిలెట్లు, రక్షిత మంచినీటి వసతి మరియు పరిసరాల పరిశుభ్రతను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థుల దినసరి హాజరు రిజిస్టర్లను తనిఖీ చేసి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 100% హాజరు శాతమే విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. బడుల్లో అవసరమైన మౌలిక వసతులను వేగంగా కల్పిస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా, నాణ్యమైన విద్యనందించే ప్రభుత్వ బడులకే పంపించేలా వారికి అవగాహన కల్పించాలని అన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో సైతం నాణ్యమైన ఆంగ్ల మాధ్యమ విద్య అందుబాటులో ఉందనే విషయాన్ని గ్రామీణ ప్రాంత ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం గ్రామ పెద్దలు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ వెలుగులు , ఉచిత విద్యుత్ కనెక్షన్లతో ఎన్పీడీసీఎల్ సేవలు.

**- చిన్నారుల భవిష్యత్తుకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం: ఎస్ఈ వెల్లడి..**




ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 29; (విజన్ ఆంధ్ర) : చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఆసిఫాబాద్ సర్కిల్, సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడే తెలిపారు. సర్కిల్ పరిధిలోని మొత్తం ఉన్న 879 అంగన్వాడి కేంద్రాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందించినట్లు వెల్లడించారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు, ప్రీ-స్కూల్ కార్యకలాపాలు, ఆటలు, అభ్యసన కార్యక్రమాలు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలు సజావుగా నిర్వహించేందుకు విద్యుత్ సౌకర్యం ఎంతో దోహదపడుతుందని ఎస్ఈ తెలిపారు. విద్యుత్ కనెక్షన్లు అందుబాటులోకి రావడంతో అంగన్వాడి కేంద్రాల్లో ఫ్యాన్లు, లైట్లు, తాగునీటి మోటార్లు, ఇతర విద్యుత్ పరికరాలు సక్రమంగా వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. దీంతో చిన్నారులు వేడి, ఉక్కపోత వంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యా, అభ్యసన కార్యక్రమాల్లో పాల్గొనగలుగుతున్నారని తెలిపారు. అలాగే, అంగన్వాడి కార్యకర్తలు తమ విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు విద్యుత్ సౌకర్యం ఉపయోగపడుతుందని చెప్పారు. చిన్నారులకు పోషకాహారం తయారీ, తాగునీటి సదుపాయం, పరిశుభ్రత, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. చిన్నారుల సంక్షేమం, విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత అనుగుణంగా సర్కిల్ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తోందని ఎస్ఈ తెలిపారు. ప్రతి అంగన్వాడి కేంద్రం విద్యుత్ వెలుగులతో కళకళలాడేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.

## అఖిలభారత యువజన సమాఖ్య జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులు గా దేశామోని ఆంజనేయులు.. అల్వాల మధు గౌడ్...



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): 29 : అఖిలభారత యువజన సమైక్య ఏఐవైఎఫ్ నాగర్ కర్నూలు జిల్లా మూడవ మహాసభలు 27/08/2026 గురువారం రోజున పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ఏ ఐ వై ఎఫ్ మూడో మహాసభలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలకు ముఖ్య అతిథులు ఏఐవైఎఫ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల్ నరసింహ. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర . సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ ముఖ్య అతిథులుగా హాజరై ఈ సభ సమావేశం అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా దేశామోని ఆంజనేయులు మధు గౌడ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.. అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మాపై నమ్మకంతో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా ఏకగ్రీవంగాఎన్నుకున్నందుకుధన్యవాదాలుతెలుపుతూ నాగర్ కర్నూల్ జిల్లాలోని విద్య వైద్యం ఉపాధి హక్కుల కోసం పోరాటాలు ఇంకా ఉధృతం చేసి యువత ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య విధానాలను యువతతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామన్నారు.. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ కార్య నిర్వహణ కార్యదర్శిగా కేసుముల్లా శివకృష్ణ జిల్లా ఉపాధ్యక్షులుగా వాడల బాల పిరు సహాయ కార్యదర్శులు ధర్మరాజు మరియు శివుడు తో పాటు 15 మంది కౌన్సిల్ మెంబర్లుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

## అమర్‌గొండ గ్రామంలో రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె హరిత...



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 29:(విజన్ ఆంధ్ర) కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగాం మండలంలోని అమర్‌గొండ గ్రామంలో శరవేగంగా జరుగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ శనివారం క్షేత్రస్థాయిలో నేరుగా సందర్శించి, పరిశీలించారు. కలెక్టర్ గ్రామంలోని వ్యవసాయ భూముల అనుభవం గ్రౌండ్ ట్రూతింగ్ పనులు, గ్రామ పొలిమేర సరిహద్దులు, ఆవాస ప్రాంతాల సరిహద్దులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన భూములను స్వయంగా తనిఖీ చేసి, సర్వే పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. సర్వేలో ఉపయోగిస్తున్న +చీూా రోవర్ పరికరాల పనితీరును, కంట్రోల్ పాయింట్లను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ కే హరిత క్షేత్రస్థాయిలో సాంకేతిక పరికరాల వినియోగం మరియు ఖచ్చితత్వంపై సర్వే సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. గ్రామ మొత్తం విస్తీర్ణం, ప్రభుత్వ భూముల పరిమాణం, సంబంధిత సర్వే నంబర్లు మరియు రీ-సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న క్షేత్రస్థాయి సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక రైతులతో, గ్రామస్థులతో నేరుగా మాట్లాడి, రీ-సర్వేపై వారి అభిప్రాయాలు, వినతులు మరియు అభ్యంతరాలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రీ-సర్వే ప్రక్రియలో భూ సరిహద్దుల ఖచ్చితమైన నిర్ధారణ, రికార్డుల సమగ్ర పరిశీలన మరియు రైతుల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా, నిబంధనలు మరియు మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే మరియు భూ రికార్డుల సహాయ సంచాలకులు వినయ్ కుమార్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే రామేశ్వర్, మండల సర్వేయర్ ధన్‌రాజ్, సంబంధిత రెవెన్యూ మరియు సర్వే శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు సవాళ్లను స్వీకరించి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 29,(విజన్ ఆంధ్ర ) : విద్యార్థులు జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా స్వీకరించి, సరైన మార్గంలో పయనిస్తూ తమ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడి పేటలో గల కేంద్రీయ విద్యాలయంలో మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలకు మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంతో పోల్చితే కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థుల సంఖ్య దాదాపు రెట్టింపు కావడం సంతోషంగా ఉందని, ప్రస్తుతం 600 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. వివిధ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యాలకు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలిసి చదువుకోవడం, పరస్పరం నేర్చుకోవడం వల్ల వారి వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పాఠ్యాంశాలతో పాటు క్రీడలు, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యార్థులలో సమగ్ర వ్యక్తిత్వం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పాఠశాల జీవితం భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లకు విద్యార్థులను సిద్ధం చేసే వేదిక అని తెలిపారు. జీవితంలో లక్ష్యాలను సాధించడం కొరకు సరైన మార్గంలో పయనించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. విద్యతో పాటు సంగీతం, నృత్యం, క్రీడలు, చిత్రలేఖనం, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి వివిధ రంగాలలో పాల్గొనడం ద్వారా సమగ్ర వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుందని తెలిపారు.



**విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం అభినందనీయం : మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు**

మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలలో చిన్న వయసు నుంచే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం అభినందనీయమని, జీవితంలోని ప్రతి రంగంలోనూ నాయకత్వ లక్షణాలు అవసరమని తెలిపారు. 56 సంవత్సరాల వయసు నుండి పిల్లలలో నాయకత్వ లక్షణాలు, సృజనాత్మకత, క్రమశిక్షణ, బాధ్యతాయుత భావనలను పెంపొందించాలని తెలిపారు. కేంద్ర విద్యాలయాల విధానం దేశవ్యాప్తంగా విద్యార్థులకు బహుభాషా, బహుసాంస్కృతిక, బహుప్రాంతీయ వాతావరణాన్ని కల్పిస్తుందని, కుల, మత, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, సహాయక వాతావరణాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్య కేవలం పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకూడదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ద్వారా విద్యార్థులను సంపూర్ణ వ్యక్తిత్వం కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి కుటుంబంతో పాటు గ్రామం, మండలం, నియోజకవర్గం, జిల్లా, దేశ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను మంచి విద్యాసంస్థలలో చదివిస్తున్నారని, విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజు బకాయిలపై బీజేపీ నిరసన.....

**- సీఎం దిష్టిబొమ్మ దహనం.. అడ్డుకున్న పోలీసులు...**
**తీవ్ర ఉద్రిక్తత.. బిజెపి నేతల అరెస్ట్...**
**- ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు రేవంత్ రెడ్డి సర్కార్ ను విడిచి పెట్టం...**
**- సమస్య పరిష్కారమయ్యే వరకు విద్యార్థుల కు అండగా నిలుస్తాం..**
**- బిజెపి జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో)29 ఆగస్ట్.విద్యార్థుల ఫీజు బకాయిల సమస్యపై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం కరీంనగర్ గీతా భవన్ చౌరస్తా వద్ద తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం నేతృత్వంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేయడానికి బీజేపీ నేతలు ప్రయత్నించగా, అక్కడికి భారీగా చేరుకున్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బిజెపి నేతలకు మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. పోలీసుల వలయాలను దాటుకుని ముందుకు వెళ్లిన బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశంతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల చేయాలని, విద్యార్థుల భవితతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని మార్చుకోవాలన్నారు. సమస్య పరిష్కారమయ్యే కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విడిచి పెట్టే ప్రసక్తి లేదని హెచ్చరించారు. విద్యార్థులకు బిజెపి అండగా ఉంటుందని , బకాయిలు విడుదల చేసే వరకు పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు బాస సత్యనారాయణ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి లు మాడ వెంకట్ రెడ్డి , తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి ,ఎర్రబెల్లి సంపత్ రావు ,భింగి వేణు, గుజ్జ శ్రీనివాస్ రావు , కార్యదర్శి సిహెచ్ నరసింహ రాజు. అధికార ప్రతినిధులు బొంతల కల్యాణ్ చంద్ర ఊగులే సుధాకర్ , దుర్శెట్టి సంపత్ యువ మోర్చ అధ్యక్షులు సంగ నరేష్ ఓబీసీ మోర్చ అధ్యక్షులు ఆకుల రాజేందర్ ఎస్టి మోర్చ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ , కనుమల్ల గణపతి ఓబీసీ మోర్చ రాష్ట కార్యదర్శి అడిచెర్ల రాజు మండల , బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డీ అధ్యక్షులు మడిశెట్టి సంతోష్, మల్లేశం చింతం శ్రీనివాస్ పర్షరాములు. కోలిపాక రాజు తణుకు సాయికృష్ణ , జాడి బాలరెడ్డి,బండారి గాయత్రి,పాదశీ శివరాజ్, కొలకని రాజు, అవుధూర్తి శ్రీనివాస్, రాష్ట కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు దండు కొమురయ్య, ముత్యాల జగన్ రెడ్డి గాజుల స్వప్న ,మామిడి చైతన్య, ఎలుకపల్లి రమేష్, బిజిలి సారయ్య ,నక్కా ప్రమోద్ ,గంగిశెట్టి రాజు , జీడి మల్లేష్, కోలా అశోక్ కచకయల రాజు, బోయిన శ్రీనివాస్, విమల్, వినీత్ తదితరులుపాల్గొన్నారు.

## స్వర్గీయ కోట్నక భీం రావు కు నివాళులర్పించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మీ.



గిరిజన ముద్దుబిడ్డ, ఆదివాసీ తొలి పట్టభద్రుడు, మాజీ గిరిజన శాఖ మంత్రి వర్యులు,స్వర్గీయ శ్రీ కోట్నక భీం రావు 24 వ వర్ధంతి సందర్భంగా ఆసిఫాబాద్ శాసన సభ్యురాలు కోవ లక్ష్మీ,సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప, కోట్నక భీం కుటుంబ సభ్యులు, పాల్గొని ఈ రోజు ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కోట్నక భీం రావు చిల్డ్రన్ పార్క్ లో ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "నాన్నగారు చూపిన బాటలోనే నడుస్తూ, ఆదివాసీల అభివృద్ధి కోసం కృషి చేస్తాను. ఆయన ఆశయ సాధనే నా లక్ష్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ హైమద్, కొట్నాక భీమ్రావు కుటుంబ సభ్యులు, బంధువులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు , ఆదివాసీ సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన విద్యా, మౌలిక సదుపాయాలు కల్పించాలి

**- సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు /జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన**
**- జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు**



ధరూర్ ఆగస్టు 29 (విజన్ ఆంధ్ర బ్యూరో) : విద్యార్థులకు మెరుగైన విద్యా, మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని గుడ్డెం దొడ్డి గ్రామంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు /జూనియర్ కళాశాల ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం,తాగునీరు, పరిశుభ్రత తదితర సౌకర్యాలను పరిశీలించి, ప్రిన్సిపాల్, సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు,వారి ఆరోగ్యం,భద్రత, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతగా, పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వంటశాల, భోజనశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. తాగునీరు,వసతి గృహాలు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక వికాసం




నారాయణపేట, ఆగస్టు29 (విజన్ ఆంధ్ర) : క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం వస్తుందని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జాజాపూర్ ప్రధానోపాధ్యాయురాలు భారతి అన్నారు.ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భారతి, నరసింహ ఫిజికల్ డైరెక్టర్ మాట్లాడుతూ ఒక సుప్రసిద్ధ భారతీయ హాకీ ఆటగాడు అని గుర్తు చేశారు. హాకీ క్రీడలో ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారుల్లో ఒకడు గోల్స్ చేయడంలో మంచి ప్రతిభ కనబరిచేవాడు అన్నారు. భారతదేశానికి హాకీలో స్వర్ణయుగంగా పరిగణించదగిన 1928, 1932, 1936 ఒలంపిక్ క్రీడల్లో వరుసగా బంగారు పతకాలు సాధించి పెట్టిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. ఒకసారి తను గోల్ వేసిన తరువాత అది పడకపోతే తను గోల్ వేసిన విధానం చూసి గోల్పోస్ట్ కొలతలు సరిచూడవలసిందిగా అంపైర్ ను కోరగా అది సరియైన గుర్తింపుగా అందరి మన్ననలు పొందారు.ధ్యాన్ చంద్ ఖేల్ రత్న పురస్కారం, భారత దేశంలో అత్యున్నత క్రీడా పురస్కారం అన్నారు. భారత మాజీ ప్రధాని కీ.శే. రాజీవ్ గాంధీ జ్ఞాపకార్థం 1991-92 లో ఈ పురస్కారం ప్రారంభించినట్లు వారు గుర్తు చేశారు. ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా పాఠశాలలో క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్, భాను ప్రకాష్ ,లక్ష్మణ్ ,ప్రతాప్, నర్సింలు, రఘురాం రెడ్డి ,మంగళ, నిర్మల, శిరీష, వెంకట సాయి, కృష్ణ,వెంకటేష్ విద్యార్థులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జిలతో ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరసన



మాగనూర్, ఆగస్టు 29 ( విజన్ ఆంధ్ర) : ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలనీ టి జీ ఈ జే ఏ సి పిలుపు మేరకు ఉద్యోగ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో కృష్ణా మండలంలో శనివారం నిరసన తెలిపారు. తెలంగా ణ రాష్ట్ర ప్రభుత్వము నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పి ఆర్ సి, డి ఏ లు ప్రకటిం చకుండా మేనిఫెస్టోలో పెట్టిన సిపిఎస్ రద్దు 317 జీవో బాధిత ఉద్యోగ ఉపాధ్యాయులకు నేటికీ న్యాయం చేయకపోవడాన్ని మూడు నెలలు కావచ్చునా నేటికీ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమును సరిగ్గా అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా నిరసించారు.ఈ సందర్భం గా జేఏసీ నాయకులు వై.జనార్ధన్ రెడ్డి,రాంగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీ,డి ఏ లు ప్రకటన,సి పి ఎస్ రద్దు చేయాలనీ డిమాండ్ చేశా రు.ఈ కార్యక్రమంలో నారా యణపేట జిల్లా జేఏసీ అడిషనల్ సెక్రటరీ జనరల్ పి ఆర్ టి యు టి ఎస్ జిల్లా అధ్యక్షులు యాదగిరి జనార్ధన్ రెడ్డి,జేఏసీ కో చైర్మన్ ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు రామ్ గోపాల్, రెవిన్యూ ఉద్యోగసంఘం నాయకులుశ్రీశైలం,పంచాయతీ కార్యదర్శులు మహేష్,రాజు పి అర్ టి యు రాష్ట్ర అసోసియేట అధ్యక్షులునరేందర్,బాలరాజు , మాగనూర్ మండలం అధ్యక్షులు బలరాం కృష్ణ మండల ప్రధాన కార్యదర్శి అజయ్ కుమార్, గౌ.అధ్య క్షులు శివరాజ్ అసోసియేట్ అధ్యక్షులుఅనిల్ కుమార్, తయాప్ప,డి టి ఎఫ్ నాయ కులు అశోక్ నర్సింహా, శంక్రప్ప, వీరేష్, సహీన్, లక్ష్మీదేవి, రంగారావు, గీత, షబానా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి పోచమ్మ తల్లి బోనాల జాతర

## తెలంగాణ సంస్కృతికి ప్రతి రూపం!

- సెప్టెంబర్ 1, 2న మహా జాతర
- కల్వకుర్తి పట్టణ ఆడపడుచుల గుండె చప్పుడు - పోచమ్మ తల్లి!

### బండరాళ్లలో మొదలై, బంగారు శిఖరంగా ఎదిగిన మహిమాన్విత చరిత్ర



నూతన ఆలయంలో ఏర్పాటుచేసిన పోచమ్మ తల్లి విగ్రహం...



40 సంవత్సరాల క్రితం నిర్మించిన పోచమ్మ తల్లి పాత ఆలయం....



ఊరు పుట్టినప్పటి నుండి ఉన్నటువంటి పోచమ్మ తల్లి పాత విగ్రహం....

"ఊరు పుట్టినప్పటి నుండి ఉన్న తల్లి, బండరాళ్ల మధ్య దిక్కులేని దేవతగా పడి ఉన్న తల్లి, నేడు కల్వకుర్తి పట్టణ ప్రజల ఇలవేల్పుగా, కొంగు బంగారంగా మారింది. ఈ తల్లి చరిత్ర తెలిస్తే ప్రతి ఒక్కరి కళ్ళల్లో నీళ్లు, గుండెల్లో భక్తి పొంగుతుంది."

**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, విజన్ ఆంధ్ర, ఆగస్ట్ 29:**

**అమ్మవారి పిలుపు - ఆరు నెలలకు ఒకసారి వినిపించిన ఆర్తనాదం**

సుమారు 60 ఏళ్ల క్రితం... హనుమాన్ గుడి ముందు కూర్చున్న జనం మధ్య నారాకంటి జంగయ్య అనే వ్యక్తి శిగంతో ఊగుతూ "నేను బండరాళ్లలో ఉన్నాను, నన్నెవరూ పట్టించుకోవడం లేదు" అంటూ అమ్మవారి గొంతుతో అరిచేవాడు. ఆరు నెలలకు ఒకసారి ఇలా జరిగేది. అది చూసి జనం భయంతో, భక్తితో ఆలోచించడం మొదలుపెట్టారు. అప్పట్లో గుడి పక్కనే ఉండే శంకరమ్మ అనే భగవద్గీత పారాయణం చేసే పెద్దావిడే అమ్మవారికి కాపలా. జంతువులు వచ్చి అపవిత్రం చేస్తుంటే తరిమికొట్టి, అమ్మవారిని కంటికి రెప్పలా కాపాడారు.





పోతురాజు స్వామి....

**రూ.50 తో మొదలైన ఒక మహా యజ్ఞం**

అమ్మవారి దీన స్థితిని చూసి కీ.శే నీల కృష్ణయ్య, కీ.శే పర్వత్ రెడ్డి, చింతల వెంకటరెడ్డి, రాయచోటి శ్రీశైలం, వెంకటయ్య వంటి పెద్దలు కదిలారు. ఇంటింటికి వెళ్లి రూ.50, రూ.116 చొప్పున చందాలు వసూలు చేసి రూ.20-30 వేలతో ఒక చిన్న గుడి కట్టారు. శిఖరం కట్టడానికి డబ్బులు లేక ఇనుప బ్యారెల్ డబ్బాను బోర్లించి చుట్టూ ఇటుకలు పేర్చి శిఖరం చేశారు. అదే నిజమైన భక్తికి గుర్తు. టాకీస్ కిషోర్ తో పాటు మరికొందరు సిమెంట్ ఇచ్చి ముందు భాగాన్ని చదును చేయించారు. చాలా ఏళ్ల వరకు హనుమాన్ గుడి నుండే దీపధూపాలకు సహాయం తెచ్చేవారు.

**బోనాల పండుగ పుట్టుక - 50 పైసల నుండి మొదలైన సంబరం**

అమ్మవారికి బోనం చేయాలని 40 ఏళ్ల క్రితం పెద్దలు నిర్ణయించారు. అప్పట్లో బోనం ఖరీదు 50 పైసలు, కొబ్బరికాయ 25 పైసలు. మొత్తం 400-500 బోనాలు, మొత్తం ఖర్చు రూ.1500 మాత్రమే. కానీ ఆ భక్తి కోటి రూపాయలకు సమానం. నేడు అదే బోనాల పండుగ వేలాది మందితో, లక్షల రూపాయలతో, రెండు రోజుల మహా జాతరగా మారింది. పాత విగ్రహం అరిగిపోవడంతో, గుడి లోపలికి ఉండటంతో కుమ్మరి సంఘ పూజారులు, కాలనీ ప్రజలు, దాతల సహకారంతో భారీ ఎత్తున నూతన ఆలయాన్ని, పెద్ద విగ్రహాన్ని నిర్మించారు.



అందరి సహకారంతో నిర్మించిన నూతన ఆలయం....

**సెప్టెంబర్ 1వ తేదీ నుండి 2వ తేదీ వరకు - కల్వకుర్తి పట్టణం మొత్తం పండుగే!**

ఈ బోనాల పండుగ అంటేనే కల్వకుర్తి పట్టణానికి పెద్ద పండుగ. తెలంగాణలో ఎక్కడ ఉన్నా, హైదరాబాద్ లో ఉన్నా, మరే ఏ ప్రాంతంలో ఉన్నా కల్వకుర్తి బిడ్డలు ఈ రెండు రోజులు తప్పక ఇంటికి వస్తారు.

సెప్టెంబర్ 1వ తేదీ - మొదటి రోజు: నజరు బోనాలు - వీర బోనం

ఈ రోజు అసలు ఘట్టం మొదలవుతుంది. పట్టణాన్ని కాపాడే గ్రామదేవతలు కోట మైసమ్మ తల్లి, ఈదమ్మ తల్లి, కట్ట మైసమ్మ తల్లి, బొడ్రాయి, వారి తమ్ముడు పోతురాజు స్వామికి నజరు బోనాలు సమర్పిస్తారు.

**- కుమ్మరి ఆడబిడ్డల సేవ:** కుమ్మరి సోదరీమణులు ప్రతి ఇంటికి వెళ్లి బియ్యం, పసుపు, కుంకుమ, నైవేద్య సామాగ్రిని సేకరించి అమ్మవార్లందరికీ నైవేద్యం పెడతారు. ఇది ఊరంతా కలిసి చేసే బోనం.

**- గౌడ సోదరుల వీర బోనం:** ఈ రోజు స్పెషల్. గౌడ సోదరులు పోతురాజు స్వామికి కుండలో నైవేద్యం పెట్టి, ఆ కుండను తలపై ఎత్తుకుని డప్పులతో, ఊరేగింపుగా ఊరంతా తిరుగుతూ తీసుకువచ్చి పోతురాజుకు సమర్పిస్తారు. దీన్నే వీర బోనం అంటారు. ఈ ఊరేగింపు చూడటానికి రెండు కళ్లు చాలవు.

**సెప్టెంబర్ 2వ తేదీ - రెండవ రోజు:** ప్రధాన బోనాల జాతర - అసలైన పండుగ

ఈ రోజు కోసమే అందరూ ఎదురుచూసేది. ఉదయం నుండే అమ్మవారికి అభిషేకం, పట్టు వస్త్రాలతో గ్రాండ్ గా అలంకరణ.అన్ని కులాల, అన్ని మతాల ఆడబిడ్డలు బంగారు బోనాలతో, పసుపు కుంకుమలతో, కొత్త బట్టలతో అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. యువకులు తొట్టెల వేడుకలు, పలారం బండ్లను అందంగా అలంకరించి తీసుకువస్తారు. డీజేలు, డప్పులు, కోలాటాలు, భక్తి పాటలతో కల్వకుర్తి పట్టణం మొత్తం మారుమోగిపోతుంది. యువత ఉత్సాహం మామూలుగా ఉండదు. భక్తులు తమ మొక్కులను మేకపోతులు, కోళ్లు, కల్లు, శాఖలతో తీర్చుకుంటారు. ప్రతి ఇంటి నుండి బోనం వస్తుంది.

**ఎందుకు అంత నమ్మకం? - కొంగు బంగారం తల్లి**

కల్వకుర్తి పోచమ్మ తల్లి చాలా మహిమగల తల్లి అని ప్రజల బలమైన నమ్మకం.

- ఇంట్లో పెళ్లి జరిగితే మొదట దంపతులు వచ్చి ఒడిబియ్యం పోసి మొక్కు చెల్లించుకుంటారు.
- పిల్లలకు జ్వరం, చర్మవ్యాధులు వస్తే అమ్మవారికి కళ్ళు, సాక పోస్తే చాలు, రోగం మాయమవుతుందని నమ్మకం.
- ఏ శుభకార్యం అయినా అమ్మవారి దీవెన లేకుండా మొదలుపెట్టరు. ఈ తల్లి దీవెన ఉంటే అభివృద్ధి ఖాయం అని ప్రతి ఒక్కరూ నమ్ముతారు.

## ముగింపు:

బండరాళ్లలో దిక్కులేకుండా పడి ఉన్న తల్లిని నేడు బంగారు తల్లిగా చేసుకున్న ఘనత కల్వకుర్తి ప్రజలదే. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి చేసుకునే ఈ బోనాల పండుగ, తెలంగాణ సంస్కృతికి, ఐక్యతకు నిదర్శనం. ఈ ఏడాది సెప్టెంబర్ 1వ తేదీ 2వ తేదీన జరిగే ఈ మహా జాతరకు విజన్ ఆంధ్ర పత్రిక ద్వారా భక్తులందరికీ ఆహ్వానం.

---

# బీసీ రాజ్యాధికారం సాధ్యమేనా!!

## చెమట నుంచి అధికారం వరకు

- ఓటు బ్యాంకు కాదు...అధికారంలో మా వాటా!
- చెమట చిందించిన చేతులు... శాసిస్తాయా?
- బీసీ రాజకీయాల్లో కొత్త మలుపు
- దేశ, రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారేనా?
- రేపటి రాజకీయ శక్తి బీసీలేనా?



బీసీల రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికార డిమాండ్, మారుతున్న ఓటు సమీకరణాలపై లోతైన విశ్లేషణ. బీసీ ఓటు బ్యాంకు నుంచి నిర్ణయాధికార శక్తిగా ఎదుగుతున్న పరిణామాలు, అంతర్గత సవాళ్లు, భవిష్యత్ రాజకీయ ప్రభావాలపై "విజన్ ఆంధ్ర" పొలిటికల్ అనాలిసిస్ ప్రత్యేక కథనం.

**హైదరాబాద్, ఆగస్టు 29:**

తరతరాలుగా నాగలి పట్టిన చేతులు... మగ్గం నేసిన వేళ్లు... సుత్తి పట్టి సమాజ నిర్మాణంలో భాగమైన శ్రామిక వర్గాలు, కుల వృత్తి కార్మికు లోకం ఇప్పుడు ఒక్కటే ప్రశ్నిస్తున్నాయి"మా శ్రమతో రాజ్యం బలపడుతోంది... మరి రాజ్యాధికారంలో మా వాటా ఎప్పుడు?"

దేశ రాజకీయాల్లో బీసీల ప్రాతినిధ్యం ఇప్పుడు కేవలం రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు, ఆర్థిక సాయం అనే అంశాలకే పరిమితం కావడం లేదు. జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం, అసెంబ్లీపార్లమెంట్‌లో సముచిత వాటా, నిర్ణయాధికారంలో భాగస్వామ్యం వంటి డిమాండ్లు బలంగా వినిపిస్తున్నాయి.

**ఓటు బ్యాంకు నుంచి అధికార కేంద్రం వైపు...!!**

దశాబ్దాలుగా ఎన్నికల్లో కీలక ఓటు శక్తిగా ఉన్న బీసీలు ఇప్పుడు కేవలం ఓటర్లుగా కాకుండా నిర్ణేతలుగా ఎదగాలని కోరుకుంటున్నారు. "ఎవరి జనాభా ఎంతో... వారికి అంత వాటా" అనే భావన రాజకీయ చర్చల్లో ప్రాధాన్యం సంతరించుకుంటోంది. కులగణన నుంచి చట్టసభల్లో ప్రాతినిధ్యం వరకు సాగుతున్న చర్చలు బీసీ రాజకీయాల్లో కొత్త ఆలోచనలకు దారితీస్తున్నాయి. స్థానిక సంస్థల్లో మాత్రమే కాకుండా అసెంబ్లీ, లోక్‌సభ వంటి కీలక వేదికల్లోనూ జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం ఉండాలనే డిమాండ్ ముందుకు వస్తోంది.

**అయితే... బీసీల ఐక్యతే అసలు పరీక్ష!!**

జనాభా సంఖ్య పెద్దదిగా ఉన్నప్పటికీ, ఆ సంఖ్యను ఒకే రాజకీయ శక్తిగా మార్చడం అంత సులభం కాదు. ఓబీసీ పరిధిలోని అనేక ఉపకులాలు, భిన్నమైన సామాజికఆర్థిక పరిస్థితులు ఐక్యతకు సవాలుగా ఉన్నాయి. అదే సమయంలో వివిధ రాజకీయ పార్టీల పట్ల ఉన్న సంప్రదాయ అనుబంధాలు, స్థానిక వర్గ రాజకీయాలు, ఎన్నికల ఆర్థిక వ్యవహారాలు కూడా బీసీ రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తున్నాయి. బీసీల్లోనే అత్యంత వెనుకబడిన వర్గాలు, ఇతర బీసీ వర్గాల మధ్య అవకాశాల పంపకం కూడా కీలక అంశంగా మారుతోంది. అందరికీ సమాన ప్రాతినిధ్యం, సమాన అవకాశాలు కల్పించగలిగినప్పుడే విస్తృత ఐక్యత సాధ్యమవుతుంది.




**బీసీ ఓటు ఇక ఎవరికీ శాశ్వతం కాదా?**

ప్రధాన రాజకీయ పార్టీలకు బీసీ ఓటు ఎప్పటికీ కీలకమే. అయితే కేవలం ఎన్నికల సమయంలో బీసీలను గుర్తుచేసుకుని, ఆ తర్వాత రాజకీయ ప్రాతినిధ్యాన్ని పరిమితం చేసే విధానాలపై ప్రశ్నలు పెరుగుతున్నాయి.

**ఎన్ని టికెట్లు ఇచ్చారు?**

అధికారంలో ఎంత వాటా ఇచ్చారు? కేబినెట్‌లో ఎంత ప్రాతినిధ్యం కల్పించారు? నిర్ణయాలు తీసుకునే స్థాయిలో ఎంతమంది ఉన్నారు?. ఇలాంటి ప్రశ్నలే భవిష్యత్తు రాజకీయాల్లో బీసీ ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేసే అవకాశముంది.

అయితే బీసీల ఓట్లు పూర్తిగా ఒకే పార్టీ లేదా ఒకే నాయకత్వం వైపు మళ్లిపోతాయని చెప్పడం కూడా సరైంది కాదు. సామాజిక సమస్యలు, స్థానిక రాజకీయాలు, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం, పార్టీల విధానాలు వంటి అనేక అంశాలు ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తాయి.



చెమట నుంచి చట్టం వరకు...!!

దేశ ఆర్థిక, సామాజిక నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన రైతులు, కార్మికులు, చేతివృత్తిదారులు, చిన్న వ్యాపారులు, వృత్తి ఆధారిత వర్గాలు ఇప్పుడు తమ శ్రమకు తగిన రాజకీయ ప్రాతినిధ్యాన్ని కోరుతున్నారు. ఇది కేవలం పదవుల కోసం పోరాటం కాదు... అధికారంలో భాగస్వామ్యం కోసం పోరాటం. ఇది కేవలం ఓటు కోసం కాదు... నిర్ణయాధికారం కోసం డిమాండ్. అయితే జనాభా బలం రాజకీయ అధికారంగా మారాలంటే నినాదాలకంటే ఐక్యత, బలమైన నాయకత్వం, స్పష్టమైన రాజకీయ వ్యూహం, ఉపకులాల మధ్య సమన్వయం అవసరం.

**నిన్న ఓటు వేసిన చేతులు... రేపు చట్టాలు చేసే చేతులవుతాయా?**

బీసీల రాజకీయ చైతన్యం భావోద్వేగ స్థాయి నుంచి సంఘటిత రాజకీయ శక్తిగా మారితే, రాబోయే రోజుల్లో దేశ రాజకీయ సమీకరణాల్లో మరింత పెద్ద మార్పులకు అవకాశం ఉంటుంది. చెమట చిందించిన చేతులకు... శాసించే అవకాశం దక్కేనా? ఓటు బ్యాంకుగా ఉన్న బీసీలు... అధికార కేంద్రంగా ఎదుగుతారా? సమాధానం రాబోయే రాజకీయమే చెప్పాలి.

**- గడ్డం సంతోష్ రాజ్**
**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.